
గురువారం 26 మార్చి 2026

https://www.telugudesam.org



# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు



విద్యుత్ వినియోగదారులకు

## గుడ్ న్యూస్

ఈ ఆర్థిక సంవత్సరం ఛార్జీల పెంపు ఉండదు

- వివరాలు 8 లో..



# శరవేగంగా పర్యాటక ప్రాజెక్టులు

- సందర్శకులు పెరిగేలా యాక్షన్ ప్లాన్
- బారువ నుంచి నెల్లూరు వరకూ బీచ్‌ల అభివృద్ధి
- పెద్దఎత్తున హోటళ్లు, హోంస్టేలకు కార్యాచరణ
- కారవాన్ పార్కులు.. టెంట్ సిటీల ఏర్పాటుకు చర్యలు
- తిరుపతి, విశాఖలలో అమ్యూజ్‌మెంట్ పార్కులు
- ఎకో, టెంపుల్ టూరిజం ప్రాజెక్టులు చేపట్టాలి
- పర్యాటక ప్రోత్సాహకానికి సీఎస్ అధ్యక్షతన కమిటీ
- పర్యాటక శాఖపై సమీక్షలో సీఎం చంద్రబాబు

2

రాష్ట్రంలో పెరుగుతోన్న పర్యాటకుల ఫుట్ ఫాల్‌కు అనుగుణంగా ఏపీలో హోటల్ గదులు, హోం స్టేలను త్వరితగతిన అందుబాటులోకి తేవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించా రు. క్యాంపు కార్యాలయంలో బుధవారం పర్యాటక శాఖపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ పర్యాట క ప్రాంతాలు, నగరాల్లో జాతీయ, అంతర్జాతీయ హోటల్ బ్రాండ్లు వచ్చేలా చూడాలని సూచించారు. పర్యాటక ప్రాజెక్టుల వేగవంతానికి యాక్షన్ ప్లాన్ రూపొందించాలని ఆదేశించారు. రాష్ట్రంలో పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు ప్రత్యేకంగా ఓ బోర్డు లేదా కమిటీ ఏర్పాటు చేసి ప్రాజెక్టులను ముందుకు తీసుకువెళ్లాలని సీఎం దిశానిర్దేశం చేశారు.

## ప్రపంచానికి తెలుగు రుచుల ఘుమఘుమలు

- పర్యాటక శాఖ చారిత్రాత్మక ఒప్పందం
- సీఎం చంద్రబాబు సమక్షంలో ఎంఓయూ
- పాల్గొన్న ఇండియన్ కలినరీ ప్రతినిధులు

ఆంధ్రప్రదేశ్‌ను కలినరీ టూరిజం హబ్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో ఏపీ పర్యాటక శాఖ తిరుపతిలోని ఇండియన్ కలినరీ ఇనిస్టిట్యూట్‌తో అవగాహనా ఒప్పందం చేసుకుంది. ముఖ్య మంత్రి చంద్రబాబు సమక్షంలో ఈ కీలకమైన ఎంఓయూ కుదిరింది. ఇండియన్ కలినరీ ఇనిస్టిట్యూట్ ప్రతినిధులు- ఏపీ పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్‌లు సీఎం సమక్షంలో ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు.

2





## ధూళిపాళ్ల ఇంట పెళ్లి సందడి
## హాజరైన సీఎంలు చంద్రబాబు, రేవంత్‌రెడ్డి

గుంటూరు జిల్లా పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర చిన్న కుమార్తె వైదీప్తి- వివాహానికి తెలుగు రాష్ట్రాల ముఖ్య మంత్రులు చంద్రబాబు, రేవంత్‌రెడ్డి హాజరయ్యారు. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి కుటుంబంతోపాటు హాజరుకాగా మంత్రి నారా లోకేష్ ఆహ్వానం పలికారు. సరదాగా కాసేపు రేవంత్‌రెడ్డితో ముచ్చటించారు.

3



## మంగళగిరిలో రామాలయం పునఃప్రతిష్ఠ

- పాల్గొన్న మంత్రి నారా లోకేష్
- ఆలయానికి రూ.5లక్షల విరాళం



4



## రామతీర్థం గిరి ప్రదక్షిణ మార్గం ప్రారంభం


- నవమికి ముందే రాములోరికి సుమమాల
- వర్చువల్‌గా ప్రారంభించిన పవన్‌కళ్యాణ్

6

## అమరావతి చట్టబద్ధత తుది దశకు...

- 28న అసెంబ్లీ ప్రత్యేక సమావేశం
- రాజధానిగా ప్రకటిస్తూ తీర్మానం
- ఆ వెంటనే కేంద్రానికి..

8



అమరావతి రాజధానిగా చట్టబద్ధత కల్పించే ప్రక్రియ తుది దశకు చేరుకుంది. ఈ నెల 28వ తేదీన ఏపీ అసెంబ్లీ సమావేశం నిర్వహించి రాజధానిగా ప్రకటిస్తూ అసెంబ్లీ తీర్మానం చేయనుంది. అసెంబ్లీ ఆమోదించిన ఈ తీర్మానాన్ని కేంద్ర ప్రభుత్వానికి పంప నున్నారు. ఈ పార్లమెంటు సమావేశాల్లోనే అమరావతిపై తుది నిర్ణయం తీసుకోనుంది.

# స్వర్ణ కుప్పం సాకారమే లక్ష్యం

- యువత స్వశక్తితో ఎదగాలి
- విద్యార్థులు వినూత్నంగా ఆలోచించాలి
- కుప్పం పర్యటనలో నారా భువనేశ్వరి
- డిగ్రీ కాలేజీలో జాబ్‌మేళా

7

స్వర్ణ కుప్పం లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారని ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి స్పష్టం చేశారు. కుప్పం నియోజకవర్గంలో నాలుగురోజుల పర్యట నలో భాగంగా రెండోరోజు పలు గ్రామాల్లో నారా భువనేశ్వరి పర్య టించారు. కుప్పం డిగ్రీ కాలేజ్‌లో నిర్వహించిన జాబ్‌మేళాలో పాల్గొన్నారు. గుడిపల్లి మండలం పెద్ద కోటమకనపల్లి గ్రామంలో పర్యటించిన మహిళలతో సమావేశమయ్యారు.





# శరవేగంగా పర్యాటక ప్రాజెక్టులు

- సందర్శకులు పెరిగేలా యాక్షన్ ప్లాన్
- బారువ నుంచి నెల్లూరు వరకూ బీచ్‌ల అభివృద్ధి
- పెద్దఎత్తున హోటళ్లు, హోంస్టేలకు కార్యాచరణ
- కారవాన్ పార్కులు.. టెంట్ సిటీల ఏర్పాటుకు చర్యలు
- తిరుపతి, విశాఖలలో అమ్యూజ్‌మెంట్ పార్కులు
- ఎకో, టెంపుల్ టూరిజం ప్రాజెక్టులు చేపట్టాలి
- పర్యాటక ప్రోత్సాహకానికి సీఎస్ అధ్యక్షతన కమిటీ
- పర్యాటక శాఖపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు

అమరావతి(చైతన్యరథం): రాష్ట్రంలో పెరుగుతోన్న పర్యాటకుల ఫుట్‌ఫాల్‌కు అనుగుణంగా ఏపీలో హోటల్ గదులు, హోం స్టేలను త్వరితగతిన అందుబాటులోకి తేవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యాటకశాఖకు దిశానిర్దేశం చేశారు. 2029నాటికి రాష్ట్రంలో 50వేల హోటల్ గదుల నిర్మాణం లక్ష్యాన్ని చేరుకోవాలని సీఎం సూచనలు జారీ చేశారు. అలాగే వివిధ పర్యాటక ప్రాంతాల్లో 10వేలకు పైగా హోం స్టేలు కూడా అందుబాటులోకి తేవాలని స్పష్టం చేశారు. హోంస్టేలను అందుబాటులోకి తీసుకువచ్చే అంశంపై ఎలాంటి పరిమితిలేదని వివరించారు. క్యాంపు కార్యాలయంలో బుధవారం పర్యాటక శాఖపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. సమీక్షకు మంత్రి కందుల దుర్గేష్, ఏపీటీడీసీ చైర్మన్ నూకసాని బాలాజీ సహా పర్యాటకశాఖ ఉన్నతాధికారులు హాజరయ్యారు. రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డులో ఆమోదం తెలియజేసిన టూరిజం ప్రాజెక్టులు వేగంగా ఏర్పాటు అయ్యేలా చూడాలని సీఎం దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలోని వివిధ పర్యాటక ప్రాంతాలు, నగరాల్లో జాతీయ, అంతర్జాతీయ హోటల్ బ్రాండ్లు వచ్చేలా చూడాలని సూచించారు.

### పెద్దఎత్తున హోంస్టేల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలి

గోదావరి పుష్కరాల నాటికి కూడా రాజమహేంద్రవరం సహా వివిధ ప్రాంతాల్లో పెద్దఎత్తున హోంస్టేల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలన్నారు. హోంస్టేల నిర్వహణకు సంబంధించి రేటింగ్ కూడా పెట్టాలని దిశానిర్దేశం చేశారు. అరకు, చింతపల్లి, ముంచింగిపుట్టు, గాంధీవనం, మారేడుమిల్లి తదితర ప్రాంతాలతోపాటు కనీసం 10-15 ప్రాంతాల్లో కారవాన్ పార్కులను ఏర్పాటు చేయాలని సూచించారు. కార వాన్లను పార్కింగ్ చేసుకుని కుటుంబంతో సురక్షితంగా ప్రకృతిని ఆస్వాదించేలా ఆయా పార్కుల్లో మౌలిక సదుపాయాలను కల్పించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. రాష్ట్రంలోని ఎక్స్‌పీరియన్స్ కేంద్రాల వద్ద కూడా ఈ తరహా ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. తిరుపతి, విశాఖలలో అమ్యూజ్‌మెంట్ పార్కుల ఏర్పాటుకు యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని సీఎం సూచనలు జారీ చేశారు. అటవీ, దేవాదాయశాఖల సమన్వయంతో ఎకో, టెంపుల్ టూరిజానికి ప్రోత్సాహం ఇచ్చేలా ప్రాజెక్టులు చేపట్టాలని సీఎం పేర్కొన్నారు. ప్రసాద్, స్వదేశ్ దర్శన్ పథకాల కింద వివిధ దేవాలయాలు, దర్శనీయ స్థలాల అభివృద్ధికి చేపట్టిన ప్రాజెక్టులను 2026 మే నాటికి సిద్ధం చేయాలని అన్నారు. దీనికి సంబంధించి మరో రూ.663కోట్లతో కేంద్రానికి ప్రతిపాదనలు పంపినట్టు పర్యాటక శాఖ అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. గండికోట, సూర్యలంక, అరకు బొర్రా గుహలు తదితర ప్రాంతాలను ప్రముఖ పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దేందుకు అవసరమైన కార్యాచరణ చేపట్టాలన్నారు. గోదావరి పుష్కరఘాట్‌ను ఆగస్టు నాటికి, హావ్ లాక్ బ్రిడ్జిపైకి పర్యాటకులను అనుమతించేలా ఈ ఏడాది డిసెంబరు నాటికి పనులు పూర్తిచేయాలని సీఎం స్పష్టం చేశారు.

### పర్యాటక ప్రోత్సాహానికి సీఎస్ అధ్యక్షతన కమిటీ

రాష్ట్రంలో పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు ప్రత్యేకంగా ఓ బోర్డు లేదా కమిటీ ఏర్పాటుచేసి ప్రాజెక్టులను ముందుకు తీసుకు వెళ్లాలని సీఎం దిశానిర్దేశం చేశారు. పర్యాటకశాఖ, అటవీ, దేవాదాయ, పోలీసు, మెరైన్ ఇలా వేర్వేరుశాఖల సమన్వయం కోసం సీఎస్ అధ్యక్షతన దీనిని ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. హౌస్ బోట్లు, హెలీ టూరిజంతో పాటు ఉడాన్ పథకం కింద సీ ప్లేన్‌లను కూడా ప్రోత్సహించాలని తెలిపారు. విశాఖ, విజయవాడ, శ్రీశైలం, గండికోట, కంభం చెరువు లాంటి చోట్ల వాటర్ ఏరో డ్రోమ్స్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం అందించాలని సూచించారు.

### క్రూజ్ నౌకలు.. టెంట్ సిటీలు

సముద్ర విహారాన్ని ప్రోత్సహించేలా విశాఖ, నెల్లూరులోని కృష్ణపట్నం పోర్టుల నుంచి క్రూజ్ నౌకలను కూడా నిర్వహించేలా చూడాలని సూచించారు. తెలంగాణా లాంటి ల్యాండ్ లాక్డ్ రాష్ట్రాల నుంచి కూడా పర్యాటకులు దీనికి పెద్దఎత్తున ఆకర్షితులు అవుతున్న విషయాన్ని గుర్తుచేశారు. రాష్ట్రంలోని వేర్వేరు ప్రాంతా ల్లో ఏర్పాటు చేసే టెంట్ సిటీలను కేటగిరీలుగా విభజించి ప్రోత్స హిస్తే అందరికీ అందుబా టులోకి వస్తాయన్నారు. కనీసం వెయ్యి టెంట్ సిటీలను గోదావరి పుష్కరాల నాటికి అందుబాటులోకి తేవాలని సీఎం సూచనలు జారీ చేశారు.

### అమరావతి క్రియేటివ్ సిటీగా ఎదగాలి

క్రియేటివ్ ఎకానమీని ప్రోత్సహించేందుకు కంటెంట్ క్రియేషన్ పెద్దఎత్తున జరగాలని సూచించారు. క్రియేటివ్ ఎకానమీని సృష్టించేలా అమరావతి క్రియేటివ్ సిటీగా ఎదగాలి. బాలివుడ్ స్టార్ సంజయ్ దత్ కూడా క్రియేటివ్ ఎకానమీ ప్రాజెక్టు ఏర్పాటు చేసేందుకు ఆసక్తి చూపించిన విషయాన్ని వివరించారు. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన ఐకానిక్ డెస్టినేషన్ స్కీమ్ కింద విశాఖ, తిరుపతి నగరాలను అభివృద్ధి చేయాలని..ప్రతీ ఐకానిక్ డెస్టినేషన్‌కు రూ.500కోట్ల వరకూ వెచ్చించేందుకు ఆస్కారం ఉందని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు.

గత ఏడాదిలో పర్యాటక ప్రాంతాలకు 30.92కోట్ల మంది పర్యాటకుల ఫుట్ ఫాల్ నమోదైందని ఈ ఏడాదిలో 9 నెలల కాలానికి గానూ 21శాతం మేర వృద్ధి కనిపించిందని.. ఇది మరింత పెరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రధాన ఆలయాలను అనుసంధానించి టెంపుల్ టూరిజం కూడా ఇంటిగ్రేట్ చేయాలని సూచించారు. సూర్యలంక బీచ్‌నుప్రత్యేకంగా అభివృద్ధి చేసేందుకు యాక్షన్‌ప్లాన్ చేపట్టాలన్నారు. వీటితో పాటు తిరుపతిలో ఉన్న చెరువులు, అమరావతి ప్రాంతంలోని కాలువలు,విశాఖ సహా వేర్వేరు ప్రాంతాలను సుందరీకరణ చేపట్టాలని స్పష్టం చేశారు.

# పర్యాటక శాఖ చారిత్రాత్మక ఒప్పందం

**సీఎం చంద్రబాబు సమక్షంలో ఎంఓయూ**
**పాల్గొన్న ఇండియన్ కలినరీ ప్రతినిధులు**







అమరావతి(చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్‌ను కలినరీ టూరిజం హబ్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో ఏపీ పర్యాటక శాఖ తిరుపతిలోని ఇండియన్ కలినరీ ఇనిస్టిట్యూట్‌తో అవగాహనా ఒప్పందం చేసుకుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో ఈ కీలక మైన ఎంఓయూ కుదిరింది. ఇండియన్ కలినరీ ఇనిస్టిట్యూట్ ప్రతినిధులు- ఏపీ పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్‌లు సీఎం సమక్షంలో ఒప్పంద పత్రాలను మార్చుకు న్నారు. తెలుగు రుచులను, వంటకాలను ప్రపంచానికి పరిచయం చేయటంతో పాటు ప్రాంతీయ ఆహార సంస్కృతిని చాటి చెప్పేలా ఇండియన్ కలినరీ ఇనిస్టిట్యూట్ సహకారం అందించనుంది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఆంధ్రప్రదేశ్‌ను కలిన రీ టూరిజానికి ఓ కీలకమైన ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు వీలు గా ఈ ఎంఓయూ తోడ్పడనుంది. ప్రత్యేకించి కలినరీ విభాగం లో నైపుణ్యాభివృద్ధి కల్పన, ఉపాధి, ఉద్యోగ అవకాశాలు, ఏపీ టూరిజం అథారిటీ నిర్వహించే ఫుడ్ ఫెస్టివల్స్, టూరిజం ఈవెంట్లను నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా తెలుగు వంటకాల రుచులను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తెలియ చేసేలా కార్యాచరణ చేపట్టనున్నారు. ఈ అవగాహనా ఒప్పందం కార్యక్రమంలో పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ, ఏపీ హోటల్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు





## ధూళిపాళ్ల కుమార్తె వివాహానికి

# సీఎంలు చంద్రబాబు, రేవంత్‌రెడ్డి







గుంటూరు (కలెక్టరేట్): గుంటూరు జిల్లా పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర చిన్న కుమార్తె వివాహానికి తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబు, రేవంత్‌రెడ్డి హాజరయ్యారు. గుం టూరు శ్రీ కన్వెన్షన్‌లో నాగసాయి వైదీప్తి- కెవిన్ రామ్ వివాహం బుధవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ఇద్దరూ హాజరై వధూ వరులను ఆశీర్వదించారు. వారితో పాటు ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, మంత్రులు నారా లోకేశ్, పయ్యావుల కేశవ్, అనిత, సంధ్యారాణి, సవిత, పలువురు ఎమ్మెల్యేలు హాజరై నూతన వధూవరులకు శుభాకాంక్ష లు తెలిపారు.



### ఆహ్వానం పలికిన మంత్రి లోకేష్

వివాహవేడుకలకు సీఎం రేవంత్‌రెడ్డి కుటుంబంతో పాటు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు మంత్రి నారా లోకేష్ ఆహ్వానం పలికారు. అనంతరం నూతన వధూవరులు నాగసాయి వైదీప్తి, కెవిన్ రామ్‌లను ఆశీర్వదించారు. వైవాహిక జీవితంలోకి అడుగుపెడుతున్న నూతన దంపతులకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

















## మంగళగిరిలో

# రామాలయం పున:ప్రతిష్ఠ

### పాల్గొన్న మంత్రి నారా లోకేష్

### ఆలయానికి రూ.5లక్షల విరాళం

మంగళగిరి(చైతన్యరథం): పట్టణంలోని కొప్పురావుకాలనీలో నూతనంగా రామాలయ పున:ప్రతిష్ట మహోత్సవంలో విద్య,ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పాల్గొన్నారు. పండితులు వేదమంత్రో చ్ఛారణల మధ్య హనుమత్ లక్ష్మణ సీతాసమేత రాముల వారి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు నిర్వహించారు. ముందుగా ఆలయ ప్రాంగణానికి చేరుకున్న మంత్రి నారా లోకేష్‌కు ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక ప్రజలు, టీడీపీ నాయకులు ఘనస్వాగతం పలి కారు. విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం అనంతరం స్వామివార్లను దర్శించుకుని మంత్రి లోకేష్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయం పునర్ నిర్మాణానికి మంత్రి లోకేష్ రూ.5లక్షల విరాళం అందించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ పద్మశాలీ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్ద య్య, టీటీడీ బోర్డు మెంబర్ తమ్మిశెట్టి జానకీదేవి, ఏపీఎంఎస్ ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, మంగళగిరి పట్టణ టీడీపీ అధ్యక్షుడు పడవల మహేష్ తదితరులు పాల్గొన్నారు.











### ఏలూరు జిల్లా పురోగతిపై
## సీఎం చంద్రబాబు సమీక్ష



అమరావతి(చైతన్యరథం): ముఖ్యమంత్రి కార్యాలయంలో చంద్రబాబు ఆధ్వర్యంలో ఏలూరు జిల్లా సమీక్ష జరిగింది. ఈ సమావేశానికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్, ఇతర ఎమ్మెల్యేలతో కలిసి మంత్రి కొలుసు పార్థసారథి హాజరయ్యారు. సమీక్ష సందర్భంగా ఏలూరు జిల్లా, నూజివీడు నియోజకవర్గంలో అమలులో ఉన్న అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని సమీ క్షించారు. ప్రస్తుతం కొనసాగుతున్న పనులతో పాటు, రాబోయే కాలంలో చేపట్టాల్సిన కీలక ప్రాజెక్టులపై చర్చించారు.







## మంగళగిరిలో సీతారామస్వామి బ్రహ్మోత్సవాలు
### దర్శించుకున్న మంత్రి నారా లోకేష్

మంగళగిరి(చైతన్యరథం): సీతారామస్వామి ఆలయ బ్రహ్మోత్స వాలను పురస్కరించుకుని పాత మంగళగిరిలో కొలువై ఉన్న కోవెలను విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ సందర్శించారు. ముందుగా ఆలయ ప్రాంగణానికి చేరుకున్న మంత్రి లోకేష్‌కు ఆలయ అధికారులు, స్థానిక టీడీపీ నాయకులు, ప్రజలు ఘన స్వాగతం పలికారు. అనంతరం మంత్రి లోకేష్ సీతారామస్వామి వార్లను దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ పద్మ శాలీ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య, టీటీడీ బోర్డు మెంబర్ తమ్మిశెట్టి జానకీదేవి, ఏపీఎం ఎస్ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, గుంటూరు పార్లమెంట్ టీడీపీ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, మంగళగిరి పట్టణ టీడీపీ అధ్యక్షుడు పడవల మహేష్ తదితరులు పాల్గొన్నారు.









### లోకేష్‌ను కలిసిన ఏపీ ఎన్జీవో అధ్యక్షుడు
## పదవీ విరమణ వయసు పెంపుపై కృతజ్ఞతలు

ఉండవల్లి(చైతన్యరథం): విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్‌ను ఏపీ జేఏసీ చైర్మన్, ఏపీ ఎన్జీవో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆలపర్తి విద్యాసాగర్, ఇతర జేఏసీ నేతలు ఉండవల్లి నివాసంలో బుధవారం కలిశారు. ప్రభుత్వరంగ సంస్థలు, గురుకులాల ఉద్యోగుల పదవీ విరమణ వయసును 60 నుంచి 62 సంవత్సరాలకు పెంచుతూ మంత్రుల బృందం తీసుకున్న సానుకూల నిర్ణయాన్ని స్వాగతిస్తూ మంత్రి లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను మంత్రి దృష్టికి తీసుకు వచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీజేఏసీ రాష్ట్ర కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్, ఎన్జీవో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డీవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

# రామతీర్థం గిరి ప్రదక్షిణ మార్గం ప్రారంభం

- నవమికి ముందే రాములోరికి సుమమాల
- రూ.3.40 కోట్ల నిధులతో నిర్మాణం
- వర్చువల్‌గా ప్రారంభించిన పవన్‌కళ్యాణ్
- ఆలయాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని వెల్లడి
- గత ప్రభుత్వంలో శిరచ్ఛేదం బాధకలిగించిందని వ్యాఖ్య




అమరావతి(చైతన్యరథం): ఆలయాల అభివృద్ధికి, హిందూ ధర్మ పరిరక్షణకు కూటమి ప్రభుత్వం కట్టుబడి పని చేస్తుందని ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ స్పష్టం చేశారు. ఆలయాల పవిత్రతను కాపాడటంతో పాటు దేశ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షిస్తా మని హామీ ఇచ్చారు. విజయనగరం జిల్లా నెలిమర్ల నియోజక వర్గంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామ తీర్థం గిరి ప్రదక్షిణ మార్గాన్ని బుధవారం వర్చువల్‌గా ఆయన ప్రారంభించారు. సీతారాముని పేట కూడలి నుంచి నీలాచలం కొండ వరకు రూ.3.40కోట్ల ఉపాధి హామీ నిధులతో 3.70 కిలోమీటర్ల మేర ఈ రహదారిని నిర్మించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, వంగలపూడి అనిత, కొండపల్లి శ్రీనివాస్, పార్లమెంట్ సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యేలు లోకం మాధవి, పూసపాటి అదితి విజయలక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పవన్‌కళ్యాణ్ మాట్లాడుతూ "భారతదేశం లో ఉన్న ప్రసిద్ధ పుణ్యక్షేత్రాల్లో రామతీర్థం ఒకటి. ఈ క్షేత్రంలో రామాయణ, మహా భారత కాలం నాటి ఆనవాళ్లు ఉన్నాయి. అంతటి పవిత్రత కలిగిన రామతీర్థం కొండ చుట్టూ భక్తితో ప్రదక్షిణ చేస్తే ముక్తిని పొందుతారన్నది భక్తుల నమ్మిక. అందుకే వైకుంఠ ఏకాదశి, శివరాత్రి పర్వదినాల్లో బోదికొండగా పిలుచుకునే రామతీర్థం గిరి చుట్టూ వేలాది మంది భక్తులు ప్రదక్షిణ చేసి మొక్కులు తీర్చుకుంటారని తెలిపారు.

### రాళ్లు, ముళ్ల కంపలతో భక్తులు ఇబ్బందిపడేవారు

రామతీర్థం గిరి ప్రదక్షిణ మార్గం గతంలో రాళ్లు, రప్పలు, ముళ్ల కంపలతో నిండి ఉండేది. గిరిప్రదక్షిణ కు వచ్చే భక్తులు కష్టమైనా ఆమార్గంలోనే నడిచేవారు. ఈ విషయాన్ని స్థానిక శాసన సభ్యురాలు లోకం మాధవితోపాటు కొందరు భక్తులు నా దృష్టికి తీసుకు వచ్చారు. చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత ఆలయాల పవిత్రతను సంరక్షించే చర్యల్లో భాగంగా రామతీర్థం కొండ చుట్టూ రోడ్డు నిర్మించే బాధ్యతను భుజాన వేసుకున్నాం. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధుల నుంచి రూ.3.40కోట్లు వెచ్చించి గిరిప్రదక్షిణ మార్గంలో బీటీ రోడ్డు నిర్మించాం. అధికారుల సహ కారంతో శ్రీరామ నవమికి రెండు రోజుల ముందే రోడ్డును ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చామని తెలిపారు.

### 20 నెలల్లో రూ.40 కోట్లు వెచ్చించాం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆలయాల పవిత్రతను కాపాడే చర్యల్లో భాగంగా గడచిన 20 నెలల కాలంలో ఉపాధి హామీ పథకం, పంచాయతీరాజ్, సాస్కి నిధులు రూ. 40 కోట్లకు పైగా వెచ్చించి రాష్ట్ర వ్యాప్తంగా 22 ప్రధాన ఆలయాలకు రోడ్ల సౌకర్యం కల్పించాం. శివరాత్రికి ముందు శ్రీకాళహస్తి గిరిప్రదక్షిణ మార్గాన్ని భక్తులకు అందుబాటులోకి తీసుకువచ్చాం. కోటప్పకొండ గిరిప్రదక్షిణ మార్గంలో రోడ్డు మంజూరు చేశాం. ఈ రోజున రాములవారి భక్తుల కోసం రామతీర్థం గిరిప్రదక్షిణ రోడ్డుని అందుబాటులోకి తెచ్చామని తెలిపారు. గత ప్రభుత్వం హయాంలో ఇదే రామతీర్థం పుణ్యక్షేత్రంలో రాములవారి విగ్రహం శిరచ్ఛేదం చేస్తే కోట్లాది మంది హిందువు భక్తులు బాధకు గుర య్యారు. వారిలో నేనూ ఒకడిని. ఆ ఘటన తీవ్ర వేదన కలిగిం చింది. ఈ రోజున ఆలయానికి గిరి ప్రదక్షిణ మార్గాన్ని సుందరం గా నిర్మించడం ద్వారా స్వామిని ఈ రూపంలో సేవించు కునే భాగ్యం కలగడం అదృష్టంగా భావిస్తున్నాను. సంస్కృతి సంప్రదా యాలను కూటమి ప్రభుత్వం కాపాడుతుందని స్పష్టం చేశారు.






## కుప్పం మున్సిపల్ చైర్మన్ నివాసానికి భువనమ్మ

**కుటుంబసభ్యులకు ఆత్మీయ పలకరింపు**

కుప్పం(చైతన్యరథం): కుప్పం నియోజకవర్గం తంబిగనిపల్లిలో కుప్పం మున్సిపల్ చైర్మన్ సెల్వరాజ్ నివాసానికి నారా భువనేశ్వరి వెళ్లారు. కుటుంబసభ్యులను ఆపాయ్యంగా పలకరించారు. అనంతరం కుప్పంలో హెచ్‌పీ పెట్రోల్ బంక్ సమీపంలో నూతనంగా నిర్మించిన రాయల్ ఇన్ కాంప్లెక్స్ హోటల్‌ను నారా భువనేశ్వరి ప్రారంభించారు.

### మాజీ జెడ్పీటీసీ గృహ ప్రవేశానికి హాజరు

కుప్పం మాజీ జెడ్పీటీసీ శేఖర్ రాజ్‌కుమార్ నూతన గృహ ప్రవేశానికి నారా భువనేశ్వరి హాజరయ్యారు. శేఖర్ రాజ్ కుమార్ కుటుంబసభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం దంపతులకు కొత్త బట్టలు పెట్టి ఆశీర్వదించారు.




చైతన్యరథం

# స్వర్ణ కుప్పం సాకారమే లక్ష్యం

- పరిశ్రమలతో పెద్దఎత్తున ఉద్యోగావకాశాలు
- కష్టాన్ని నమ్ముకుని స్వశక్తితో ఎదగాలి
- విద్యార్థులు వినూత్నంగా ఆలోచించాలి
- కుప్పం పర్యటనలో నారా భువనేశ్వరి
- డిగ్రీ కాలేజీలో యువతకు జాబ్‌మేళా



కుప్పం(చైతన్యరథం): స్వర్ణ కుప్పం లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారని ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి స్పష్టం చేశారు. కుప్పం నియోజకవర్గంలో నాలుగురోజుల పర్యటనలో భాగంగా రెండోరోజు పలు గ్రామాల్లో నారా భువనేశ్వరి పర్యటించారు.

కుప్పం డిగ్రీ కాలేజ్ లో నిర్వహించిన జాబ్‌మేళాలో పాల్గొన్నారు. గుడిపల్లి మండలం పెద్ద కోటమకనపల్లిగ్రామంలో పర్యటించిన మహిళలతో సమావేశమయ్యారు. జాబ్‌మేళాలో విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ యువతకు ఉద్యోగాలు కల్పించేందుకు జాబ్‌మేళా నిర్వహించడం అభినందనీయం. విద్యా ర్థులు వినూత్నంగా ఆలోచించాలి. భవిష్యత్‌పై స్పష్టత ఉండాలి. యువత స్వశక్తితో ఎదగాలి.. కష్టాన్ని నమ్ముకోవాలి. లక్ష్యం ఉంటే ఏదైనా సాధించవచ్చని పేర్కొన్నారు.

## సవాళ్లను ధైర్యంగా ఎదుర్కోవాలి

నాడు విజన్ 2020, నేడు విజన్ 2047లక్ష్యంతో సీఎం చంద్రబాబు పనిచేస్తున్నారు. ఒక నాయకుడిని నమ్మి ఓటేస్తే గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో ఏం జరిగిందో మనం చూశాం. ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన మాట తప్పరు. ఓట్ల కోసం హామీలు ఇవ్వరు. ప్రజల కోసం నిలబడతారు. నేను ఏం చేయగలనో అదే హామీ ఇస్తానని చంద్రబాబు నాతో చెబుతూ ఉంటారు. ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్రానికి పెద్దఎత్తున పెట్టుబడులు తీసుకొ స్తున్నారు. 20 లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నారు. గృహిణిగా ఉన్న నేను హెరిటేజ్ బాధ్యతలను సవాల్‌గా తీసుకున్నాను. జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా ఎదు ర్కోవాలి. ప్రతి దానికీ అసంతృప్తికి లోను కాకూడదు. కష్టపడి పని చేస్తే ఎన్నో అవకాశాలు వస్తాయి. తల్లిదండ్రులు ఎంతో కష్టపడి పిల్లలను చదివిస్తారు. ప్రయోజకులు కావాలని, భవిష్యత్ బాగుం డాలని తాపత్రయపడతారు. పిల్లలు జీవితంలో ఉన్నతంగా స్థిరపడితే ముందుగా సంతోషించేది తల్లిదండ్రులే. లోకేష్ పెంపకం, చదువు బాధ్యత నేనే చూసుకున్నా. ఏది మంచి, ఏది చెడో చెప్పి పెంచినట్లు తెలిపారు. అనంతరం జాబ్‌మేళా సందర్భంగా పలు కంపెనీల ప్రతినిధులతో సమావేశమయ్యారు.








# సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి

- మూడునెలలకోసారి కుప్పం పర్యటన
- నియోజవర్గంలో రూ.7,121 కోట్లతో 17 పరిశ్రమలు తీసుకొచ్చారు
- సంజీవని హెల్త్ క్లినిక్స్‌తో ఆరోగ్య భరోసా
- కుప్పం పర్యటనలో నారా భువనేశ్వరి
- పెద్దకోటమకనపల్లి మహిళలతో సమావేశం



కుప్పం(చైతన్యరథం): చిత్తూరు జిల్లా కుప్పం పర్యటనలో భాగంగా రెండోరోజు గుడిపల్లి మండలం పెద్దకోటమకనపల్లి గ్రామంలో పర్యటించిన నారా భువనేశ్వరి మహిళలతో సమా వేశమయ్యారు. చంద్ర బాబును 8 సార్లు ఎమ్మెల్యేగా గెలిపించిన కుప్పం ప్రజలకు రుణపడి ఉంటాం. ముఖ్యమంత్రి చంద్రబాబు బిజీగా ఉండటంతో ప్రతి మూడు నెలలకు ఒకసారి నేను కుప్పం నియోజకవర్గంలో పర్యటిస్తున్నాను. ప్రజల సమస్యల పరిష్కా రానికి నా వంతు కృషి చేస్తున్నాను. రాష్ట్రాన్ని బాగుచేయడం చంద్రబాబు వల్లే సాధ్యమని ప్రజలు నమ్మి ఓటేశారు. కుప్పం నియోజక వర్గానికి రూ. 7,121 కోట్ల విలువైన పెట్టుబడులతో 17 పరిశ్రమలు తీసుకొచ్చారు. వీటి ద్వారా పెద్దఎత్తున ఉపాధి లభిస్తుంది. కుప్పంలో అడిడాస్ కంపెనీ ఫుట్ వేర్ తయారీ ప్లాంట్ ఏర్పాటు చేస్తోంది. కుప్పంలో సోలార్ ఎనర్జీ వినియోగం పెంచేందుకు చర్యలు చేపట్టారు. 20 లక్షల ఉద్యోగాల కల్పన దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. కుప్పం డిగ్రీ కాలేజ్‌లో జాబ్ మేళా సందర్భంగా 5వేల ఉద్యోగాల కల్పనకు పలు కంపెనీలు ముందు కొచ్చాయి. నియోజకవర్గంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పథకం కింద 37,824 మంది లబ్ధి పొందుతున్నారు. 42,232 మందికి తల్లికి వందనం అందుతోంది. స్వచ్ఛ కుప్పంలో భాగంగా చెత్త నుంచి సంపద సృష్టించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో రహదారుల నిర్మాణం చేపట్టారు. స్వర్ణ కుప్పంలో భాగంగా సీసీ, బీటీ రోడ్లు వేస్తున్నారు. సంజీవని హెల్త్ క్లినిక్స్ ద్వారా పేదల ఆరోగ్యానికి భరోసా కల్పిస్తున్నారు. కుప్పానికి హంద్రీనీవా ద్వారా కృష్ణా జలాలను తీసుకొచ్చారు. గత ప్రభుత్వంలో చంద్రబాబుపై నిందలు మోపి అక్రమంగా అరెస్ట్‌చేశారు. యావత్ తెలుగు ప్రజలు అండగా నిలబడ్డారు. మద్దతుగా మహిళలు పెద్దఎత్తున బయటకు వచ్చి పోరాడారని గుర్తుచేసుకున్నారు. అంతకు ముందు స్థానిక మహిళలతో కలిసి కోలాటం ఆడారు.







## కుప్పంలో భువనమ్మ పర్యటన

# ప్రజల నుంచి వినతుల స్వీకరణ

కుప్పం నియోజకవర్గంలో నాలుగు రోజుల పర్యటనలో భాగంగా రెండో రోజు నారా భువనేశ్వరి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ముందుగా కుప్పంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆ తర్వాత డిగ్రీ కాలేజీలో జాబ్‌మేళాలో పాల్గొని యువతకు సందేశమిచ్చారు. అనంతరం గుడిపల్లిమండలం పెద్దకోటమకన పల్లి గ్రామంలో పర్యటించి మహిళల తో సమావేశమయ్యారు.





# వ్యవసాయ రంగంలో గ్లోబల్ కనెక్ట్..

- సింగపూర్ ప్రతినిధులతో ఏపీ చర్చలు
- మంత్రి అచ్చెన్నాయుడు వీడియో కాన్ఫరెన్స్
- డేటా ఆధారిత పాలసీల దిశగా అడుగులు
- ఎగుమతుల పెంపు, పెట్టుబడుల ఆకర్షణపై వివరణ
- తీర ప్రాంత అభివృద్ధి, మత్స్య రంగంపై ప్రత్యేక దృష్టి



విజయవాడ (చైతన్యరథం): వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సింగపూర్ దేశ ప్రతినిధులతో బుధవారం విజయవాడ క్యాంప్ కార్యాలయం నుంచి కీలక వీడియో కాన్ఫరె న్స్ నిర్వహించారు. వ్యవసాయ రంగంలో గ్లోబల్ కనెక్టివిటీ, ఆహార భద్రత, సరఫరా వ్యవస్థలు, ఆధునిక సాంకేతికత వినియోగంపై విస్తృతంగా చర్చించారు. సింగపూర్ దేశం తన అవసరాల కోసం సుమారు 80 శాతం ఆహార ఉత్పత్తులను దిగుమతి చేసుకుంటున్న నేపథ్యంలో ఆ దేశం అనుసరిస్తున్న ఆహార భద్రతా విధానాలు, నిల్వ పద్ధతులు, సరఫరా అనుబం ధాల నిర్వహణపై మంత్రి వివరాలు తెలుసుకున్నారు. ముఖ్యం గా ఆహార ఉత్పత్తుల సంరక్షణ చర్యలు, సమయానికి సరఫరా, సమర్థవంతమైన రవాణా నిర్వహణపై సింగపూర్ ప్రతినిధులు అమలు చేస్తున్న విధానాలను వారు వివరించారు. ఇక ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వ్యవసాయ రంగ అభివృద్ధికి ఉన్న అవకాశాలు, ఎగుమతుల పెంపు, ఆధునిక సాంకేతికత వినియోగం, పెట్టుబడుల ఆహ్వానం వంటి అంశాలపై మంత్రి వివరించారు. రైతులకు లాభసాటి ధరలు అందించే విధంగా ప్రభుత్వం తీసు కుంటున్న చర్యలను తెలియజేశారు. పబ్లిక్ పాలసీల రూపకల్పన లో సాధారణ ప్రజల అభిప్రాయాలను ఎలా సేకరిస్తారు, వాటిని ఎలా అమలు చేస్తారు అనే అంశంపై ఇరు పక్షాల మధ్య చర్చ జరిగింది. సింగపూర్ ప్రతినిధులు డేటా అనలిసిస్, యుటిలై జేషన్ ద్వారా పాలసీలను ఎలా రూపొందిస్తారో వివరించారు. ఈ విధానాలను రాష్ట్రంలో కూడా అమలు చేసే అవకాశాలపై మంత్రి ఆసక్తి వ్యక్తం చేశారు. సముద్ర తీర ప్రాంత అభివృద్ధి, తీర ప్రాంత వ్యవసాయం, మత్స్యరంగానికి సంబంధించిన అవకాశాలు, తీర ప్రాంత మౌలిక సదుపాయాల పెంపు వంటి అంశాలపై కూడా చర్చించారు. సింగపూర్‌లో అమలు చేస్తున్న ఆధునిక తీర అభివృద్ధి నమూనాలను రాష్ట్రంలో అనుసరించే అవకాశాలను పరిశీలించాలని నిర్ణయించారు. ఈ సమావేశం లో కోల్డ్ స్టోరేజ్ మేనేజ్‌మెంట్‌పై కూడా ప్రత్యేకంగా చర్చ జరిగింది. ఆహార ఉత్పత్తుల నిల్వ, నాణ్యత పరిరక్షణ, నష్టాలను తగ్గించే విధానాలు, ఆధునిక కోల్డ్ చైన్ వ్యవస్థలపై ఇరు పక్షాలు ప్రశ్నలు అడిగి సమాధానాలు ఇచ్చుకున్నారు. ఈ రంగంలో సాంకేతిక సహకారం పెంపుపై చర్చించారు. ఇరు దేశాల మధ్య వ్యవసాయ రంగంలో సహకారం, జ్ఞాన మార్పిడి, పెట్టుబడుల అవకాశాలు మరింత బలోపేతం అవుతాయని మంత్రి పేర్కొ న్నారు. రాష్ట్రంలో ఆధునిక వ్యవసాయ విధానాలు, సరఫరా వ్యవస్థలను మెరుగుపరచడానికి ఈ చర్చలు ఉపయోగపడతా యని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్స్ ఆఫిషియో, వ్యవసాయశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బుడితి రాజశేఖర్, సంబంధిత శాఖల ఉన్నతాధికారులు, సింగపూర్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## 28న అసెంబ్లీ ప్రత్యేక సమావేశం

**- అమరావతిని రాజధానిగా ప్రకటిస్తూ తీర్మానం**

**- ఆ వెంటనే కేంద్రానికి..చట్టబద్ధతకు చర్యలు**




అమరావతి (చైతన్యరథం): ఈ నెల 28వ తేదీన ఏపీ అసెంబ్లీ సమావేశం నిర్వహిస్తున్నట్లు నోటిఫికేషన్ విడుదల అయింది. రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ బుధవారం సాయంత్రం నోటిఫికేషన్ విడుదల చేశారు. 28న ఉదయం 11 గంటలకు అసెంబ్లీ సమా వేశం ప్రారంభం కానుంది. ఈ సందర్భంగా అమరావతిని ఏపీ రాజధానిగా ప్రకటిస్తూ అసెంబ్లీ తీర్మానం చేయనుంది. అసెంబ్లీ ఆమోదించిన ఈ తీర్మానాన్ని కేంద్ర ప్రభుత్వానికి పంపనున్నారు. విభజన చట్టం ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాజధాని ఏదన్నది పార్లమెంట్ రికార్డుల్లో స్పష్టంగా ఉండేలా కేంద్రం ద్వారా తదుపరి చర్యలు తీసుకోనున్నారు. కేంద్రం అమరావతికి చట్టబద్ధత కల్పించేలా సీఆర్‌డీఏ 2014 తీర్మానాన్ని సవరించాలని ఏపీకి సూచించింది. ఈ సూచన మేరకు అసెంబ్లీలో అమరావతిని రాజధానిగా ప్రకటిస్తూ తీర్మానం చేయనున్నారు. దీనిని కేంద్రానికి పంపనుంది. ఈ పార్లమెంటు సమావేశాల్లోనే అమరావతిపై తుది నిర్ణయం తీసుకోనుంది.

## విద్యుత్ వినియోగదారులకు గుడ్ న్యూస్

**- ఈ ఆర్థిక సంవత్సరం ఛార్జీల పెంపు ఉండదు**

**- విద్యుత్ నియంత్రణ మండలి కీలక ప్రకటన**



అమరావతి(చైతన్యరథం): రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూట మి ప్రభుత్వం విద్యుత్ వినియోగదారులకు గుడ్‌న్యూస్ చెప్పింది. 2026 – 2027 ఆర్థిక సంవత్సరంలో విద్యుత్ ఛార్జీలు పెంచకూ డదని నిర్ణయించింది. ఈ మేరకు ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి కీలక ప్రకటన చేసింది. 2026 – 2027 ఆర్థిక సంవత్సరంలో విద్యుత్ ఛార్జీల పెంపు లేదని తెలిపింది. 2026 – 2027 డిస్కమ్‌ల లోడ్ 15,790 కోట్ల రూపాయలను రాష్ట్ర ప్రభుత్వం భరిస్తానని ముందుకు రావడంతో వినియోగదా రులకు బిగ్ రిలీఫ్ దక్కింది. 2024 – 2025 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ట్రూ అప్ ఛార్జీల విధింపు కూడా నిలిపివేసినట్లు ఏపీఈఆర్‌సీ తెలిపింది. ఈ నిర్ణయంతో రాష్ట్రంలోని కోటి 13 లక్షల మంది గృహ వినియోగదారులకు టారిఫ్ పెంపు నుంచి మినహాయింపు దక్కనుంది. ప్రభుత్వం వాణిజ్య వినియోగదారు లకు ఊరట నిచ్చేలా యూనిట్ ధరను 12.25 రూపాయల నుంచి 9.95 రూపాయలకు తగ్గించింది. ఈ నిర్ణయం ద్వారా 2 లక్షల మంది వాణిజ్య వినియోగదారులకు లబ్ధి చేకూరనుంది. అంతేకాదు.. కుటీర పరిశ్రమలకు లోడ్ పరిమితిని 10 హెచ్‌పీ నుంచి 20 హెచ్‌పీకి పెంచింది. రాష్ట్రంలోని 18 వేల మంది కుటీర పరిశ్రమల వినియోగదారులకు లబ్ధి చేకూరనుంది.

## బీసీ హాస్టళ్లలో సౌకర్యాలు కల్పించాలి

- విద్యా సంవత్సరం ప్రారంభంలోపు పూర్తికావాలి
- విద్యార్థుల సంఖ్య పెరిగేలా చర్యలు తీసుకోవాలి
- బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత ఆదేశం



అమరావతి(చైతన్యరథం): బీసీ హాస్టళ్లపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, మరో రెండు నెలల్లో నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కానుందని, ఈలోగా హాస్టళ్లలో మరుగు దొడ్ల నిర్మాణాలు, ఆర్వో ప్లాంట్ల ఏర్పాటు త్వరగా పూర్తి చేయాలని బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత ఆదేశించారు. అమరావతి సచివాలయంలో బుధవా రం బీసీ సంక్షేమ శాఖాధికారులతో మంత్రి సమీక్షించారు. మరో రెండు నెలల తరవాత నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో బీసీ హాస్టళ్లలో మౌలిక సదుపాయాల కల్ప నపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. విద్యార్థులు చేరే నాటికి మరుగుదొడ్ల నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. హాస్టళ్లలోకి దోమ లు రాకుండా దోమల నెట్‌లు కిటికీలు, ద్వారాల వద్ద ఏర్పాటు చేయాలని సూచించారు. పరిశుద్ధమైన తాగునీరు అందించడంలో భాగంగా గడువులోగా ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేయాలన్నారు. బీసీ హాస్టళ్లలో విద్యనభ్యసించే విద్యార్థులకు నాణ్యమైన ఆహారంతో పాటు ఆరోగ్య భద్రతతో కూడిన విద్య అందించడమే సీఎం చంద్ర బాబు లక్ష్యమన్నారు. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు కొత్తగా ఏర్పాటు చేయబోయే 10 ఎంజేపీ స్కూళ్లను వచ్చే విద్యా సంవత్స రానికి ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రాబోయే విద్యా సంవత్సరంలో బీసీ హాస్టళ్లలో విద్యార్థుల సంఖ్య పెంచేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఏ ఒక్క బీసీ బిడ్డ బడి బయట ఉండకూడదని స్పష్టం చేశారు. ఆదరణ 3.0 పథకం అమలుపై తీసుకుంటున్న చర్యలు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సమీక్షలో బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి ఎస్.సత్యనారాయణ, ఎంజేపీ స్కూళ్ల కార్యదర్శి మాధవీలత, అడిషనల్ డైరెక్టర్ చంద్రశేఖర్ రాజు, బీసీ కార్పొరేషన్ జీఎం భీమశంకర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## కార్యకర్తలతో కాఫీ విత్ కబుర్లు

**- ముచ్చటించిన మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి**



మంగళగిరి(చైతన్యరథం): టీడీపీ కేంద్ర కార్యాలయంలో కాఫీ విత్ కబుర్లు కార్యక్రమంలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు. దేశాన్ని నడిపే సామర్థ్యం కలిగిన నాయకుడి సార థ్యంలో మనం పనిచేస్తున్నాం. పార్టీ కార్యకర్తలకు గౌరవమే ప్రధా నం. టీడీపీ పార్టీలో ప్రతి కార్యకర్తకు గౌరవం లభిస్తుంది. పార్టీ అందిస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలే తలమానికమని పేర్కొన్నా రు. ఈ సందర్భంగా పార్టీ కార్యకర్తలతో స్నేహపూర్వకంగా ముచ్చటిస్తూ పలు కీలక అంశాలపై అవగాహన కల్పించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్ సిక్స్ సంక్షేమ పథకాల గురించి కార్యకర్తలకు వివరించారు. పింఛన్లను సమయా నికి కాకుండా ముందుగానే పంపిణీ చేయడం ద్వారా లబ్ధిదారులకు మరింత ఉపశమనం కలిగిస్తున్నామని తెలిపారు. అలాగే పరీక్షలు రాసే విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడం ద్వారా వారి భవిష్యత్తుకు తోడ్పడుతున్నామని పేర్కొన్నారు. పార్టీలో పదవులు ముఖ్యం కాదని, ప్రతి కార్యకర్త సమానమేనని మంత్రి స్పష్టం చేశారు. దేశాన్ని నడిపించే సామర్థ్యం కలిగిన నాయకత్వంలో మనం పనిచేస్తున్నామనే గర్వం ప్రతి కార్యకర్తలో ఉండాలని తెలిపారు.

## "మిషన్ హెల్తీ భారత్" కృషి ప్రశంసనీయం

**- శాప్ ఛైర్మన్ రవినాయుడు అభినందన**



విజయవాడ(చైతన్యరథం): శాప్ కార్యాలయంలో "మిషన్ హెల్తీ భారత్" వ్యవస్థాపకురాలు తాప్సి ఉపాధ్యాయను శాప్ చైర్మన్ రవినాయుడు అభినందించారు. ఈ సందర్భంగా రవినాయుడు మాట్లాడుతూ దేశ భవిష్యత్తు యువత ఆరోగ్యంపై ఆధారపడి ఉంటుందని, "ఒబేసిటీ ముక్త్..హెల్తీ భారత్" లక్ష్యంతో జరుగు తున్న ఈ ఉద్యమం సమయోచితమైందని పేర్కొన్నారు. దేశ వ్యాప్తంగా ఆరోగ్యంపై అవగాహన పెంచే దిశగా "మిషన్ హెల్తీ భారత్" చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. "ఒబేసిటీ ముక్త్ భారత్– ఇండియా టూర్" ద్వారా 16 రాష్ట్రాలు, 300కు పైగా నగరాల్లో విస్తృత ప్రచారం నిర్వహించి 10 లక్షలకు పైగా యువత ను చైతన్యపరిచడం గొప్ప విజయమని కొనియాడారు. "సంపూర్ణ భారత్ యాత్ర" వంటి కార్యక్రమాల ద్వారా దేశవ్యాప్తం గా ఆరోగ్య చైతన్యాన్ని బలోపేతం చేయడం సమాజానికి ఎంతో ఉపయోగకర మని తెలిపారు. యువతను మాత్రమే కాకుండా క్రీడాకారులను కూడా ఆరోగ్య ఉద్యమంలో భాగస్వామ్యం చేయడం అభినందనీ యమని ప్రశంసించారు. ఈ లక్ష్య సాధనలో ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) పూర్తి మద్దతు అందిస్తుందని పేర్కొన్నారు.

# సాగు భూమిలో వైసీపీ గుండాల అరాచకం

- నేతల ఒత్తిడికి తలొగ్గిన అధికారులు
- విజయ డెయిరీలో రాజకీయ వేధింపుల పర్వం
- ప్రజావినతుల కార్యక్రమంలో ఫిర్యాదులు
- అర్జీలు స్వీకరించిన మంత్రి మండిపల్లి





మంగళగిరి(చైతన్యరథం): టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన ప్రజావినతుల స్వీకరణ కార్యక్రమంలో వైసీపీ నేతల అరాచకంపై ఫిర్యాదులు అందాయి. మంత్రి మండిపల్లి రాంప్రసాద్, ఏపీ బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ బుచ్చి రాంప్రసాద్ అర్జీలు స్వీకరించారు. తిరుపతి జిల్లా పెనగమూరు మండలం ఓబిలి గ్రామానికి చెందిన సుబ్బారావు అర్జీ ఇచ్చి అభ్యర్థిస్తూ.. తమకు నందలూరు మండలం మంచిలి రేవు గ్రామ పొలంలో సర్వే నెం. 948/2 లో 5.06 ఎకరాలు, సర్వే నెం. 932/2 లో 1.54 ఎకరాలు, 945/2లో 3.46 ఎకరాల భూమి కలదు. వీటికి సంబంధించి తమ వద్ద పక్కాగా పత్రాలు కూడా ఉన్నాయి. తమ ఇంటికి కేవలం 100 మీటర్ల దూరంలో ఉన్న ఈ పొలాలను సాగు చేసుకోనివ్వకుండా వైసీపీ సానుభూతిపరులు, కొందరు స్థానిక వ్యక్తులు అడ్డుకుంటున్నారు. వైసీపీ గుండాలను అడ్డం పెట్టుకుని తమ భూములను ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారు. వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

### వైసీపీ నేత దౌర్జన్యం

గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం అనంతవరం గ్రామానికి చెందిన బుచ్చిబాబు గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ..తమ గ్రామంలోని సర్వే నెం.38/2లో ఉన్న తమ 20 సెంట్ల ఇంటి స్థలాన్ని కొలిచి, నాలుగు వైపులా హద్దులు నిర్ణయించి సర్టిఫికెట్ ఇవ్వాలని కోరాను. కానీ మండల స్థాయి అధికారులు, సర్వేయర్లు వైసీపీ నాయకుల ఒత్తిడికి తలొగ్గి తమ స్థలం వైపు రావడం లేదు. పైగా వైసీపీకి చెందిన అనంతరెడ్డి అనే వ్యక్తి పక్క ఊరి నుంచి మనుషులను తీసుకొచ్చి తన తండ్రిపై దారుణంగా దాడి చేశారు. ఈ విషయంపై పోలీసు స్టేషన్‌కు వెళ్లినా అధికారులు కనీసం కేసు కూడా నమోదు చేయడం లేదు. ఇప్పటికీ మండలంలో వైసీపీ నేతల మాటే చెల్లుబాటు అవుతుంది. వారిపై చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని కోరాడు.

### విజయ డెయిరీ ఛైర్మన్‌పై ఫిర్యాదు

నంద్యాల జిల్లా పొన్నాపురం గ్రామానికి చెందిన రామకృష్ణ గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ..విజయ డెయిరీ ఛైర్మన్ ఎస్.వి. జగన్‌మోహన్‌రెడ్డి పాత రాజకీయ కక్షలతో కార్మికులను, పాడి రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా కార్మికులను విధుల్లోంచి తొలగించడం, అక్రమ బదిలీ లు చేస్తూ వారిని వేధిస్తున్నారు. పాడి రైతుల సొసైటీలను అకార ణంగా రద్దు చేయడం ద్వారా వారి ఆర్థిక మూలాలను దెబ్బతీస్తు న్నారు. కార్మికులు, రైతులు తమ సమస్యలపై పోరాడుతున్నా.. గత ప్రభుత్వ హయాంలో ఎటువంటి న్యాయం జరగలేదు. వారిపై చర్యలు తీసుకుని తమ సమస్యలను పరిష్కరించాలని కోరాడు.

### భూములు ఆక్రమించారు.

శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా జలదంకి మండలం కొత్తపాళెం గ్రామానికి చెందిన వెంటేశ్వరరెడ్డి గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. గుడ్లదొన గ్రామ సర్వే నెం.103/2, 104/2 లో ఉన్న ప్రభుత్వ భూమికి కోట ప్రసాద్ రెడ్డి, జింకల సుధాకర్ రెడ్డి, వారి అనుచరులు నకిలీ పాస్‌పుస్తకాలు సృష్టించి ఆక్రమించు కున్నారు. అదే సర్వే నెం. 103/3, 104/1 లో తమకు ఉన్న 12.62 ఎకరాల పట్టా భూమిని కూడా ఆక్రమించాలని వారు చూస్తున్నారు. వారిపై చర్యలు తీసుకుని తమ సమస్యను పరిష్కరించాలని కోరాడు.

## మద్యం కుంభకోణంలో అంతిమ లబ్ధిదారులు ఎవరో తేలాలి

- అక్రమాలను ప్రశ్నిస్తే నా మీదా దాడి చేస్తారా?
- ఫ్యాక్షనిస్ట్‌లా వ్యవహరిస్తున్నారు..భయపడేది లేదు
- మీ పాపం పండిన రోజు దగ్గరలోనే ఉంది
- విజయమ్మ లేఖతో అసలు రంగును బయటపడింది
- చెల్లెలి ఆస్తిని నొక్కేయడం మీకు ధర్మమేనా?
- 2004లో మీ ఆదాయం రూ.1.74 కోట్లు
- వేల కోట్లలో మీ వ్యాపారాలు ఎలా పెరిగాయి
- రాష్ట్ర ప్రజలకు మీ అవినీతి సామ్రాజ్యంపై చెప్పాలి
- జైలుకు వెళ్లక తప్పదనే భయంతోనే మాట్లాడుతున్నారా
- వివేకా హత్య కేసులో అన్ని వేళ్లూ మీ వైపే
- సీబీఐ దర్యాప్తును అడ్డుకుంటున్నది మీరు కాదా?
- ఎన్ని అడ్డంకులు సృష్టించినా చట్టం నుంచి తప్పించుకోలేరు
- టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య



మంగళగిరి(చైతన్యరథం): గడిచిన ఐదేళ్లు రాష్ట్రాన్ని తన గుప్పిట్లో పెట్టుకుని, నిరంకుశంగా పాలించిన జగన్‌రెడ్డి పరిస్థితి నేడు 'కుడితిలో పడ్డ ఎలుక'లా తయారైందని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య విమర్శించారు. ఒకప్పుడు ముఖ్య మంత్రిగా వెలిగిన వ్యక్తికి, నేడు ప్రతిపక్ష హోదా కూడా దక్కని దయనీయ స్థితి పట్టడం ఆయన స్వయంకృతాపరాధమేనని ధ్వజ మెత్తారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మద్యం కుంభ కోణం ద్వారా రూ.3500 కోట్లు కొల్లగొట్టారు. ఈ అక్రమ సంపా దనలో అంతిమ లబ్ధిదారులు ఎవరు? రాజ్ కసిరెడ్డి, ధనంజయ్ రెడ్డి, చెవిరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి వంటి వారు కేవలం పావులేనా లేక వారి వెనుక ఉన్న అసలు సూత్రధారి జగనేనా? దీనిపై లెక్కలు తేలాల్సి ఉంది. రూ.43 వేల కోట్ల అక్రమాస్తుల కేసులో సీబీఐ విచారణలు, జోగి రమేష్ కల్తీ మద్యం కేసులు ఒకవైపు జగన్‌ను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఐదేళ్లకు పైగా 'కండిషనల్ బెయిల్'పై తిరుగుతున్న రాజకీయ నేతగా ఆయన రికార్డు సృష్టిస్తున్నారని వ్యాఖ్యానించారు.

### మిమ్మల్ని ప్రశ్నిస్తే శవయాత్రలు చేస్తారా

రాజకీయంగానే కాకుండా వ్యక్తిగతంగా కూడా జగన్ ఒంటరి వాడయ్యారు. తండ్రి బతికి ఉన్నప్పుడే ఆస్తుల పంపకంలో తన చెల్లికి అన్యాయం చేశారని సొంత తల్లి విజయమ్మే లేఖ రాయడం సిగ్గుచేటు. బాబాయ్ వివేకానందరెడ్డిని ఎవరు చంపారో రాష్ట్రం మొత్తానికి తెలుసు. చెల్లెలు సునీత పట్టువదలకుండా పోరాడు తుంటే..నాటి 'కాల్ డేటా' బయటపడుతుందన్న భయంతో జగన్ కంటిమీదు కునుకు లేకుండా గడుపుతున్నారు. మా నేత పట్టాభి వాస్తవాలను ప్రశ్నిస్తే తట్టుకోలేక ఆయన ఇంటిపై దాడి చేయించి ఆయన కుమార్తెను భయభ్రాంతులకు గురిచేయడం మీ ఫ్యాక్షనిస్ట్ బుద్ధికి నిదర్శనం. పోలీసులను అడ్డుపెట్టుకుని రాజకీయ ప్రత్యర్థు లను కొట్టించారు. తండ్రి చనిపోయిన వెంటనే ముఖ్యమంత్రి పదవి కోసం సంతకాలు సేకరించిన నైజం మీది. అలాంటి మిమ్మల్ని ప్రశ్నిస్తే శవయాత్రలు చేస్తారా? రాజకీయాల్లో విమర్శలు సహజం. అవి తట్టుకోలేనప్పుడు రాజీనామా చేసి ఇంట్లో కూర్చోం డి లేదా వ్యాపారాలు చూసుకోండి. జగన్ గారూ.. మీరు ఒక రాజకీయ నాయకుడిలా కాకుండా ఫ్యాక్షనిస్ట్‌లా వ్యవహరిస్తున్నారు. మీ అక్రమాలను ప్రశ్నిస్తే నా మీద కూడా దాడి చేస్తారా? సిద్ధంగా ఉన్నాను. మీ బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదు. చట్టం తన పని తాను చేసుకుపోతుంది, మీ పాపం పండిన రోజు దగ్గరలోనే ఉందని విమర్శించారు.

### '11' అంకె వారిని వదిలేలా లేదు..

ఆయన రాజకీయ శైలి 'ఊరంతా ఒక దారి అయితే.. ఉలిపిక్కట్టెది ఒక దారి' అన్నట్లుగా ఉందని ఎద్దేవా చేశారు. ప్రత్యర్థులు ప్రశ్నిస్తే సమాధానం చెప్పలేక దాడులకు తెగబడటం ఆయన ఫ్యాక్షనిస్ట్ మనస్తత్వానికి నిదర్శనమని మండిపడ్డారు. జగన్ రెడ్డిని '11' అనే అంకె వదిలేలా లేదు. అసెంబ్లీలో గెలిచింది 11 మంది ఎమ్మెల్యేలు. సీబీఐ వేసినవి 11 చార్జిషీట్లు. నిన్న పార్లమెంట్‌లో కూడా 11వ నెంబర్ గది ఇస్తే.. మళ్లీ 12వ నంబర్ గదికి మార్పించుకున్నారట. చార్జిషీట్ల విచారణ జరిగితే తన భవిష్యత్తు ఏమవుతుందో అన్న గందరగోళంలో జగన్ కొట్టుమిట్టా డుతున్నారు. విజయమ్మ లేఖ జగన్ అసలు రంగును బయటపె ట్టింది. నాడు వైఎస్సార్‌కి ఇచ్చిన మాట ప్రకారం 'చెల్లి మేలు కోరే మొదటి వ్యక్తిని' అని చెప్పిన జగన్.. నేడు ఆమెకు రావాల్సిన ఆస్తిని నొక్కేయడం ధర్మమేనా? అని ప్రశ్నించారు.

### వేల కోట్లలో మీ వ్యాపారాలు ఎలా పెరిగాయి

2009 నుంచి 2019 మధ్య కాలంలో కేవలం డివిడెండ్ రూపంలోనే చెల్లికి రూ.200 కోట్లు ఇచ్చారు. ఆడిటర్ల లెక్కల ప్రకారం షర్మిల గారికి రూ.200 కోట్లు లాభం పంపిణీ చేశారంటే ఆ సంస్థల మొత్తం లాభం దాదాపు రూ.2500 కోట్లు ఉండాలి. ఇంత లాభం రావాలంటే ఆ సంస్థల్లో పెట్టిన పెట్టుబడి రూ.25,000 కోట్ల పైమాటే. రాష్ట్ర ప్రజల తరపున, మీ తల్లి, చెల్లి తరపున నేను ఒకటే అడుగుతున్నా.. సమాధానం చెప్పండి. 2004లో మీరు ఆదాయ పన్ను శాఖకు చూపించిన మొత్తం ఆదాయం కేవలం రూ.1.74 కోట్లు. పదేళ్ల కాలంలో వేల కోట్ల లాభాలు వచ్చే స్థాయికి మీ వ్యాపారాలు ఎలా పెరిగాయి? ఏ రాష్ట్రంలోనైనా ఒక ముఖ్యమంత్రి కొడుకు తండ్రి అధికారంలో ఉన్న ఐదేళ్లలోనే ఇన్ని వేల కోట్లు సంపాదించిన దాఖలాలు ఉన్నాయా? ఆ కిటుకు ఏమిటో రాష్ట్ర ప్రజలకు చెప్పండి జగన్ గారూ! ఇది ప్రజాధనం కాదా? అని ప్రశ్నించారు. మీ నాన్న ముఖ్యమంత్రి అయినంత మాత్రాన ఆకాశం నుంచి డబ్బులు పడ్డాయా? చంద్రబాబు మాట్లాడితే తప్పు, పట్టాభి ప్రశ్నిస్తే తప్పు, చివరికి మీ తల్లి, చెల్లి నిజాలు చెబితే అవి కూడా తప్పేనా? మీరు ఒక్కరే నిజాయితీ పరులా? చేతకాక దాడులు చేయించడం మానుకోండి. మీరు చేసిన అక్రమాలపై, మీ ఆదాయంపై ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మీకు ఏమైనా లాటరీ తగిలిందా? లేక కాంట్రాక్టుల పేరుతో ప్రజాధనాన్ని లూటీ చేశారా? రూ.43,000 కోట్లు అక్రమంగా సంపాదించారని సీబీఐ వేసిన 11 చార్జిషీట్లు అక్షర సత్యాలని మీరే నిరూపిస్తున్నారు. సీబీఐ వేసిన చార్జిషీట్లు తప్పా? సుప్రీంకోర్టు జడ్జీలు మీ సంపాదనపై వ్యక్తం చేసిన సందేహాలు తప్పా? మీరు ఒక్కరే సత్యవంతులా అని ప్రశ్నించారు. రాజకీ యంగా 11 సీట్లకు పరిమితమైన జగన్ రెడ్డిని, ఇప్పుడు 11 సీబీఐ చార్జిషీట్లు వెంటాడుతున్నాయి. జైలుకు వెళ్లక తప్పదనే భయంతోనే ఆయన మానసిక సమతుల్యత కోల్పోయి మాట్లాడుతున్నారని వ్యాఖ్యానించారు.

### వివేకా హత్యలో అన్ని వేళ్లూ మీ వైపే

వివేకానందరెడ్డి హత్యకు గురైన నాడు తెల్లవారుజామున మీ ఇంట్లో ఏం జరిగింది? రిటైర్డ్ ఐఏఎస్ అజయ్ కల్లం, ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు వంటి కీలక నేతలతో కలిసి మీరు మేనిఫెస్టో ఫైనల్ చేస్తున్నట్లు కూర్చున్నారు కదా. సరిగ్గా అదే సమయంలో మీ శ్రీమతి భారతి నుంచి ఫోన్ రాగానే హడావుడిగా పైకి వెళ్లారు.. మళ్లీ కిందకు వచ్చి వారితో ఏం మాట్లాడారు? ఆ ఫోన్ చేసింది ఎవరు? మీకు వచ్చిన సమాచారం ఏంటి? ఈ విషయాలను సీబీఐకి ఎందుకు చెప్పలేదు? మీ పార్టీ నేత "మా అన్నకు ఏమీ తెలియదు" అని బుకాయిస్తున్నారు. కానీ, అన్నీ వేళ్లు మీ వైపే చూపిస్తుంటే బాహ్య ప్రపంచం మిమ్మల్ని నమ్ముతుందనుకుంటున్నారా? కన్నతల్లిని క్షోభపెట్టి, తోడబుట్టిన చెల్లిని ఆస్తుల కోసం ఇబ్బంది పెడుతూ, బాబాయ్ కూతురు సునీతమ్మను కోర్టుల చుట్టూ తిప్పిస్తున్న మీకు మానవత్వం ఉందా? బాబాయ్ హత్య ఎవరి వల్ల జరిగిందో తెలిసి కూడా నిజాలు దాచిపెట్టి సీబీఐ దర్యాప్తును అడుగడుగునా అడ్డుకున్న వ్యక్తి మీరు కాదా? అప్పట్లో సీబీఐని మన రాష్ట్రం నుంచి తరిమికొట్టాలని చూసిన చరిత్ర మీది కాదా? అవినీతి కేసుల్లో 11 చార్జిషీట్లు ఎదుర్కొంటూ, రూ.43 వేల కోట్ల ప్రజాధనాన్ని లూటీ చేశారని ఆరోపణలు ఉన్న వ్యక్తి మళ్ళీ అధికారంలోకి వస్తే రాష్ట్రం ఏమవుతుంది? సొంత కుటుంబసభ్యులకే రక్షణ ఇవ్వలేని వాడు, రాష్ట్ర ప్రజలకు రక్షణ ఇస్తాడా? ఇలాంటి వ్యక్తి రాజకీయాల్లో ఉండటం సబబేనా అని ప్రతిఒక్కరూ గుండె మీద చేయి వేసుకుని ఆలోచించాలి. వివేకానందరెడ్డి హత్యపై సీబీఐ దర్యాప్తు ఇంకా లోతుగా జరగాలని నేను కోరుతున్నాను. ఆ రోజు తెల్లవారుజామున జరిగిన ఫోన్ కాల్స్ మర్మం బయట పడితే, అసలు సూత్రధారి ఎవరో లోకానికి తెలుస్తుంది. మీరు ఎన్ని అడ్డంకులు సృష్టించినా చట్టం నుంచి తప్పించుకోలేరని స్పష్టం చేశారు.

# 2027 జూన్ నాటికి పోలవరం తొలిదశ పూర్తి

- జలవనరుల అభివృద్ధికి సహకారం అందిస్తాం
- పెండింగ్ డిజైన్ల అనుమతులు వచ్చేలా చూడాలి
- నల్లమలసాగర్‌కు సాంకేతిక, ఆర్థిక అనుమతులు
- కేంద్ర జలశక్తి కార్యదర్శికి మంత్రి నిమ్మల విజ్ఞప్తి

రాజమండ్రి(చైతన్యరథం): కేంద్ర ప్రభుత్వ సహకారంతో పోల వరం ప్రాజెక్టు పనులను శరవేగంతో చేస్తున్నట్లు జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. ప్రాజెక్టు పనుల పరిశీలనకు బుధ వారం వచ్చిన కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శి వి.ఎల్.కాంతారావును రాజ మండ్రిలో మంత్రి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు పనుల తీరుతెన్నులను, పనుల తాలూకు గడువు షెడ్యూల్‌ను, నాణ్యతా ప్రమాణాలకు సంబంధిం చిన అంశాలను మంత్రి ఆయనకు వివరించారు. అలాగే ప్రాజెక్టు నిర్మాణంతో పాటే సమాంతరంగా నిర్వాసితుల కోసం సహాయ, పునరావాస పనులు వేగవంతం చేసినట్లు చెప్పారు. ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన పెండింగ్ డిజైన్లకు వెంటనే అనుమతులు వచ్చేలా సహకరించాలని కోరారు. పోలవరం కుడి, ఎడమ ప్రధా న కాలువలను 17,500 క్యూసెక్కులకు పెంచిన సామర్థ్యాల తాలూకు రీయింబర్స్‌మెం ట్‌కు సహకరించాలన్నారు. వృథాగా సముద్రంలో కలిసిపోతున్న గోదావరి వరద జలాలు వినియోగిం చుకునేలా పోలవరం-నల్లమలసాగర్ ప్రాజె క్టుకు తక్షణమే సాంకే తిక-ఆర్థిక అనుమతులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఏటా సగటున 3వేల టిఎంసి నీరు బంగాళాఖాతంలో కలసిపోతుందని కేంద్ర జలశక్తి కార్యదర్శి కి వివరించారు. తుఫానులు, ఆటుపోట్లు వంటి సముద్రపు కోత, నదుల కోతకు గురవుతున్న ప్రాంతాలకు రక్షణకు సాయం అందజేయాలన్నారు. గోదావరి, కృష్ణ, పెన్నా, వంశధార, నాగావళి వంటి నదుల ఏటి గట్ల పటిష్టతకు సహకరించమని కోరారు. డెల్టా డ్రైన్స్‌తో పాటు సముద్రంలో కలిసే చోట, ముఖ ద్వారాల వద్ద పూడిక తీయడం, వెడల్పు చేయడానికి నిధులు సాయం అందించాలని అడిగారు. అలాగే ఆల్మట్టి డ్యామ్ ఎత్తు సుప్రీంకోర్టు పరిధిలో ఉన్నందున ఆర్ అండ్ ఆర్, భూ సేకరణ వంటి వాటికి కర్ణాటక ముందుకు వెళ్లకుండా నిలువరించాలని, అందుకు కేంద్రం సహకరించాలని కోరారు.

### మంత్రి వినతులకు సానుకూల స్పందన

మంత్రి నిమ్మల విజ్ఞప్తులకు పూర్తిగా సహకరిస్తామని కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శి కే.ఎల్.కాంతారావు తెలిపారు. 2027 మార్చి లేదా జూన్ నాటికి పోలవరం మొదటి దశ పనులు పూర్తి చేయాలని, ఇంకా భూసేకరణ దాదాపు 8 వేల ఎకరాల వరకు సేకరించాల్సి ఉందన్న ఆయన అదేవిధంగా పునరావాసం పనులు కూడా వేగవంతం చేసేందుకు అన్ని విధాలుగా సహకరిస్తామని మంత్రి నిమ్మలకు తెలిపారు. ప్రాజెక్ట్ పనులకు నిధులు సమస్యే లేదని, రాష్ట్ర ప్రభుత్వం పనులు ఎంత వేగంగా చేస్తే అంతే వేగంగా నిధులు కూడా అందించి సహకరిస్తామని తెలిపారు. గడువు లోగా ప్రాజెక్ట్ పనులు పూర్తి చేయాలని సూచించారు. ప్రాజెక్ట్ నిర్మాణానికి



అవసరమైన అన్ని సాంకేతిక అనుమతులను సైతం త్వరితగతిన వచ్చేలా సహకరిస్తామని, ఫేజ్ -1 పనులు పూర్తి చేసి, ఫేజ్ -2 పనులు వెంటనే చేపట్టాలని సూచించారు. దశాబ్దా లుగా నిర్మాణంలో ఉన్న పోలవరం ప్రాజెక్ట్ ఫేజ్ -1 పూర్తి చేయ డం ద్వారా ప్రాజెక్ట్ పూర్తి అవుతుందనే విశ్వాసాన్ని ప్రజల్లో పెంచుదామని తెలిపారు. ఫేజ్ -1 పూర్తి అయ్యాక వెంటనే ఫేజ్ -2 పనులను కూడా పూర్తి చేద్దామని దానికి కూడా కేంద్రం అన్ని రకాలుగా సహకరిస్తుందని తెలిపారు. వీటితో పాటు రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి కోరిన ఆర్ఆర్ఆర్, పీఎంకేఎస్, ఫ్లడ్ మేనేజ్‌మెంట్ పనులకు సైతం ఆర్థిక సహకారం అందిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో పీపీఏ సీఈవో సంజీవ్ ఒరా, సీడబ్ల్యూసీ మెంబర్ యోగేష్ పైతాన్ ఖేర్, తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ చేకూరి కీర్తి, జలవనరుల శాఖ సలహాదారు వెంకటేశ్వర రావు, ఈఎన్‌సీ నరసింహమూర్తి పాల్గొన్నారు.

# త్వరలో దివ్యాంగులకు రుణ రాయితీ పథకం

- అన్ని జిల్లా కేంద్రాల్లో భవనాలు నిర్మిస్తాం
- టిడ్కో ఇళ్లలో గ్రౌండ్ ఫ్లోర్‌లో ప్లాట్లు ఇస్తాం
- వారిలో వెలుగులు నింపేందుకు ఇంద్రధనస్సు
- మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి
- ఉచిత బస్సు ప్రయాణం దివ్యాంగుల కృతజ్ఞతలు

అమరావతి(చైతన్యరథం): దివ్యాంగుల జీవితాల్లో వెలుగులో నింపేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఇంద్రధనస్సు తీసుకొ చ్చారని రాష్ట్ర వయోవృద్ధులు, దివ్యాంగుల సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి తెలిపారు. బుధవారం అమరా వతి సచివాలయంలో మంత్రి అధ్యక్షతన డిజెబులిటీ అడ్వైజరీ స్టేట్ బోర్డు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దివ్యాంగుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు సీఎం చంద్రబాబు ఇంద్ర ధనస్సు కార్యక్రమాన్ని తీసుకొచ్చార న్నారు. ఇచ్చిన మాట ప్రకారం దివ్యాంగ శక్తి అమలు చేశామని తెలిపారు. త్వరలోనే దివ్యాంగులకు రుణ రాయితీ పథకం



అమలు చేస్తామని చెప్పారు. రాజధాని అమరావతితో పాటు అన్ని జిల్లా కేంద్రాల్లో దివ్యాంగ భవన్లు నిర్మిస్తామని తెలిపారు. జిల్లా కలెక్టరేట్ కార్యాలయాల్లో ప్రతి సోమవారం జరిగే గ్రీవెన్స్ కార్యక్రమంలో అర్జీలు ఇచ్చేందుకు దివ్యాంగులకు ప్రత్యేక కౌం టర్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా లిఫ్ట్ సౌకర్యం ఏర్పాటు చేయనునట్టు తెలిపారు. దివ్యాంగ లబ్ధిదారులకు టిడ్కో ఇళ్లలో గ్రౌండ్ ఫ్లోర్‌లో ప్లాట్లు కేటాయించనున్నట్లు తెలిపారు. దివ్యాంగులందరికీ పూర్తిస్థాయిలో యూడీఐడీ కార్డులు అందజే యనున్నట్లు మంత్రి తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా దివ్యాంగులకు 1750 త్రీవీలర్ల కోసం అందజేయనున్నట్లు మంత్రి తెలిపారు. మొదటి విడతగా 850 పంపిణీ చేస్తున్నామన్నారు. బాపట్లలో దివ్యాంగులకు డిగ్రీ కళాశాల ఏర్పాటుకు విద్యాశాఖకు ప్రతిపాద నలు పంపినట్లు తెలిపారు. దివ్యాంగుల హాస్టళ్ల మరమ్మతులకు రూ.4 కోట్లు విడుదల చేసినట్లు తెలిపారు. దివ్యాంగులకు బెయిలీ లిపి పుస్తకాలను కూడా ప్రతి విద్యా సంవత్సరానికి ముందుగానే అందజేయనున్నట్లు పేర్కొన్నారు. అంధుల టీ 20 వరల్డ్ కప్ కి దేశం తరపున రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహించిన కరుణకుమారికి రూ.25 లక్షలు, దీపికకు రూ.10 లక్షలు ప్రభుత్వం ప్రోత్సాహం అందించిందన్నారు. అదేవిధంగా ఖాళీగా ఉన్న దివ్యాంగుల బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేస్తున్నామని తెలిపారు. దివ్యాంగుల అభివృద్ధి, సంక్షేమానికి సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని తెలిపారు. దివ్యాంగులకు ఉచిత బస్సు సదుపాయం కల్పించినందుకు సీఎం చంద్రబాబు, మంత్రికి సమావేశంలో దివ్యాంగులు కృతజ్ఞతలు తెలిపారు.

# ఉగ్ర నెట్ వర్క్ గుట్టురట్టు

- పాకిస్తాన్ హ్యాండ్లర్లతో సంబంధాలు
- విచారణలో సంచలన అంశాలు
- 42 మంది సభ్యుల కోసం ముమ్మర గాలింపు

విజయవాడ(చైతన్యరథం): విజయవాడలో ముగ్గురు యువకు ల అరెస్టుతో దేశవ్యాప్త ఉగ్రవాద నెట్‌వర్క్ గుట్టురట్టయింది. ఇది కేవలం స్థానిక అంశం మాత్రమే కాక, అంతర్జాతీయ ఉగ్రవాద సంస్థలతో సంబంధం ఉన్న భద్రతాపరమైన విషయమని పోలీ సులు గుర్తించారు. విజయవాడ వంటి ప్రశాంతమైన నగరంలో ఇలాంటి నెట్‌వర్క్ బయటపడటం భద్రతా సంస్థలను అప్రమత్తం చేసింది. ప్రస్తుతం 42 మంది సభ్యుల కోసం పోలీసులు ముమ్మ రంగా గాలిస్తున్నారు. విజయవాడలో పట్టుబడిన ముగ్గురు యువకులను విచారించగా వారు సామాన్య నేరస్థులు కాదని, దేశవ్యాప్త, అంతర్జాతీయ ఉగ్రవాద సానుభూతిపరులతో సంబంధా లు కలిగి ఉన్నారని తేలింది. వీరి వెనుక ఉన్న భారీ నెట్‌వర్క్‌ను ఛేదించేందుకు ఏడు రాష్ట్రాల్లో పోలీసులు సోదాలు నిర్వహిస్తు న్నారు. వీరిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దేశంలోని 7 రాష్ట్రాలు (ఢిల్లీ, రాజస్థాన్, బీహార్, తెలంగాణ) వంటి ప్రాంతాలకు చెందిన సుమారు 42 మంది యువకులతో ఒక రహస్య సోషల్ మీడియా గ్రూప్ నడుస్తోంది. ఈ గ్రూప్ ద్వారా ఐసిస్, కిలాఫత్ ఐడియా లజీని వ్యాప్తి చేస్తున్నారు. వీరంతా ఆల్ మాలిక్ ఇస్లామిక్ యూత్ పేరుతో కార్యకలాపాలు సాగిస్తున్నారు. భారతదేశాన్ని ఇస్లామిక్ స్టేట్‌గా మార్చాలనేది వీరి ప్రధాన సంభాషణల సారాంశమని పోలీసులు గుర్తించారు. జాతీయ జెండా స్థానంలో ఐసిస్ జెండాను పెట్టి ఫొటోలు దిగడం వీరి తీవ్రవాద ధోరణికి నిదర్శనమని పోలీసులు తెలిపారు.



### అంతర్జాతీయ సంబంధాలు, శిక్షణ..

పాకిస్థాన్, అఫ్ఘానిస్థాన్ వంటి దేశాల్లో ఉన్న ఉగ్రవాద సంస్థల తో వీరు నిరంతరం సంప్రదింపుల్లో ఉన్నారు. భారతీయ యువత ను జిహాదీ వైపు మళ్లించి, శిక్షణ కోసం విదేశాలకు పంపేందుకు ఈ ముగ్గురు యువకులు ప్రోత్సహిస్తున్నట్లు పోలీసులకు ఆధారాలు లభించాయి. వీరి వద్ద నుంచి స్వాధీనం చేసుకున్న మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్లలో కీలకమైన ఆడియో క్లిప్పింగ్ లు, జిహాదీ మెసేజ్‌లు లభించాయి. ఈ కేసును అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఏపీ పోలీసులు, కేంద్ర దర్యాప్తు సంస్థలు ఇతర రాష్ట్రాలకు ప్రత్యేక బృందాలను పంపాయి. దేశ భద్రతకు విఘాతం కలిగించే ఇలాంటి మిలిటెంట్ కార్యకలాపా లపై ఉక్కుపాదం మోపుతామని ఉన్నతాధికారులు హెచ్చరించారు. యువత సోషల్ మీడియాలో ఏయే గ్రూపుల్లో ఉంటున్నారు, ఎవరితో మాట్లాడుతున్నారు అనే అంశాలపై తల్లి దండ్రులు నిఘా ఉంచాలని, పిల్లలు ఉగ్రవాదం వైపు వెళ్లకుండా జాగ్రత్త వహించాలని పోలీసులు కోరారు.

### ఉగ్ర లింక్ కేసులో మరొకరి అరెస్ట్

విజయవాడ ఉగ్ర లింకుల కేసులో మరొకరు అరెస్టయ్యారు. హైదరాబాద్ చంచల్‌గుడాకు చెందిన సయిదా బేగం అనే మహిళను కౌంటర్ ఇంటెలిజెన్స్ అధికారులు అరెస్ట్ చేశారు. అనంతరం సయిదా బేగంను టూటౌన్ పోలీసుస్టేషన్‌కు తరలించి విచారిస్తు న్నారు. ఫారిన్ హ్యాండ్లర్ అల్ హకీమ్ షకూర్ ద్వారా సోహైల్ బేగ్, షరీఫ్, డానిష్‌లు తీవ్రవాద సంస్థల వైపు వెళ్ళేలా ప్రోత్సహించడంలో సయిదా బేగం కీలకంగా వ్యవహరించినట్లు పోలీసులు గుర్తించారు. మరోవైపు ఈ ఉగ్ర లింకుల కేసులో నింది తులు మహ్మద్ రెహ్మతుల్లా, మీర్జా సోహెల్, మహ్మద్ డానిష్‌లను మంగళవారం విజయవాడలోని సీఎంఎం కోర్టులో పోలీసులు హాజరుపరిచారు. వారికి ఏప్రిల్ 6 వరకు రిమాండ్ విధించారు. అనంతరం వారిని విజయవాడలోని జైలుకు తరలించారు. పాకిస్థాన్‌లోని హ్యాండ్లర్లతో సంబంధాలు ఏర్పరచుకుని సామాజిక మాధ్యమాల ద్వారా ఉగ్ర కార్యకలాపాలకు పాల్పడుతున్న ఈ ముగ్గురిని విజయవాడ టూటౌన్ పోలీసులు అరెస్ట్ చేసి.. వివిధ సెక్షన్ల కింద వారిపై కేసులు నమోదు చేశారు. ఇన్‌స్టాగ్రామ్, టెలి గ్రామ్‌తో పాటు పలు సామాజిక మాధ్యమాల ద్వారా యువతను ఉగ్రవాదం భావజాలం వైపు ఆకర్షిస్తున్నట్లు గుర్తించారు. అలాగే ఉగ్రవాద చేరికలు, జిహాదీ కార్యకలాపాల కోసం అవసరమైన నిధులు వీరికి పాకిస్థాన్ హ్యాండ్లర్లు సమకూరుస్తున్నట్లు నిఘా వర్గాల వద్ద సమాచారం ఉంది. ఆంధ్రప్రదేశ్‌లోనే కాకుండా.. దేశంలోని వివిధ ప్రాంతాల్లోని యువకులతో వీరు గ్రూప్‌లను ఏర్పాటు చేసి.. అందులో ఉగ్రవాద భావజాలాన్ని వ్యాప్తి చేస్తూ.. ఉగ్రదాడులకు వారిని సన్నద్ధమయ్యేలా పురిగొల్పుతున్నట్లు విచార ణలో వెల్లడైంది. అరెస్టయిన వీరందరిని లోతుగా విచారిస్తున్నారు.

### సింగపూర్ పోలీస్ ప్రతినిధులతో సమావేశం

# 'స్మార్ట్ పోలీసింగ్' సాంకేతిక భద్రతపై చర్చ

**- పాల్గొన్న హోంమంత్రి వంగలపూడి అనిత**



అమరావతి(చైతన్యరథం): రాష్ట్ర సచివాలయంలో హోం మంత్రి అనిత సింగపూర్ పోలీస్ ప్రతినిధులతో కీలక సమావేశం నిర్వ హించారు. ఈ సమావేశంలో సింగపూర్ పోలీస్ ఫోర్స్ అమలు చేస్తున్న 'స్మార్ట్ పోలీసింగ్' విధానాలు, ఆధునిక సాంకేతిక భద్రతా వ్యవస్థలపై సుదీర్ఘంగా చర్చ జరిగింది. సింగపూర్ పోలీస్ శాఖలో వినియోగిస్తున్న టెక్నాలజీ ఆధారిత పరిపాలనా సంస్కరణలు, ప్రజా భద్రతను మరింత బలోపేతం చేసే చర్యలను మన రాష్ట్ర పరిస్థితులకు అనుగుణంగా అమలు చేసే అవకాశా లను పరిశీలించారు. ఈ సందర్భంగా హోం మంత్రి అనిత మాట్లాడుతూ అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఆధునిక సాంకేతికతను రాష్ట్ర పోలీసింగ్ వ్యవస్థలో భాగం చేయడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. దీని ద్వారా ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన మరియు సమర్థవంతమైన సేవలను అందించగలమని స్పష్టం చేశారు.

# మిట్టల్ ఉక్కు పరిశ్రమతో యువతకు భరోసా

- **పారిశ్రామిక రంగానికి అండగా కూటమి ప్రభుత్వం**
- **న్యాయ శాఖ మంత్రి ఎన్.ఎం.డీ.ఫరూక్**



అమరావతి(చైతన్యరథం): ఏపీకి తలమానికంగా ఆర్సెల్లార్ మిట్టల్, నిప్పాన్ స్టీల్ సంయుక్త భాగస్వామ్యంతో అనకాపల్లి నియోజకవర్గం, నక్కపల్లి మండలం, రాజయ్యపేటలో గ్రీన్ ఫీల్డ్ స్టీల్ ప్లాంట్‌కు శంకుస్థాపన చేయడం యువతకు ఉపాధి భరోసా లభించినట్లు అయిందని న్యాయ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ పేర్కొన్నారు. ఏడాదికి 17.8 మిలియన్ టన్నుల ఉక్కు ఉత్పత్తి సామర్థ్యంతో ప్లాంటు ఏర్పాటుతో లక్ష మందికి ప్రత్యక్ష, పరోక్ష విధానంలో యువతకు ఉపాధి కలుగుతుందని బుధవారం అమరావతిలో ఏదైనా చేసిన ఒక ప్రకటనలో మంత్రి వెల్లడించారు. మిట్టల్ స్టీల్ ప్లాంట్‌కు అనుబంధంగా రూ.11,198 కోట్లతో క్యాప్టివ్ పోర్ట్ ఏర్పాటు అవుతుండడం రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న సరళీకృతమైన విధానాలే కారణమని పేర్కొన్నారు. ముఖ్యంగా ఉత్తరాంధ్ర ప్రాంత యువతకు మేలు కలుగుతుందన్నారు. పారిశ్రామిక పెట్టుబడులకు నవ్యాంధ్ర అన్ని విధాలుగా అనుకూలంగా మారిందన్నారు. కొత్త పరిశ్రమల ఏర్పాటుకు, పెట్టుబడులకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా సహకారం అందించడం జరుగుతుందన్నారు. విశాఖను ఐటీ హబ్‌గా తీర్చిదిద్దేందుకు విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ తీసుకుంటున్న చర్యలు ఎంతో సత్ఫలితాలు ఇస్తున్నాయని పేర్కొన్నారు. గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు,మరెన్నో ప్రతిష్ఠాత్మక కంపెనీల రాకకు మార్గం సుగమం కావడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తుందని తెలిపారు. ముందుచూపుతో కూడిన ప్రణాళిక చంద్రబాబు సొంతం. ఈజీ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో దేశంలోనే ఆంధ్ర ప్రదేశ్‌ను ప్రథమ స్థానంలో నిలవడం ఖాయమని స్పష్టం చేశారు. సింగిల్ విండో విధానం ద్వారా అనుమతులతో ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు చూసి పారిశ్రామిక దిగ్గజ సంస్థలు తరలి వస్తున్నాయని పేర్కొన్నారు. దేశానికే గర్వకారణంగా నిలిచే మిట్టల్ పరిశ్రమతో 700 రకాలకు పైగా ఉక్కు ఉత్పత్తులు తయారు చేసే అవకాశం ఉందని పేర్కొన్నారు.

# ఐకానిక్ టవర్ల నిర్మాణ పనులు వేగవంతం

**- అమరావతి సెల్ఫ్ ఫైనాన్స్ సిటీ**
**- కొంతమంది పనిగట్టుకుని దుష్ప్రచారం**
**- పురపాలక మంత్రి పొంగూరు నారాయణ**
**- హెచ్ఓడీ టవర్-3 నోడ్ పనులకు శ్రీకారం**



అమరావతి(చైతన్యరథం): రాజధాని అమరావతిలో రాష్ట్ర స్థాయి అధికారులంతా ఒకేచోట ఉండేలా సెక్రటేరియట్‌కు ఐకాని క్ టవర్లు డిజైన్ చేశామని మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ వెల్లడించారు. ఈ ఐదు టవర్ల నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయని ఆయన వివరించారు. అత్యాధునిక డయాగ్రిడ్ టెక్నాలజీతో వీటి నిర్మాణం జరుగుతోందన్నారు. బుధవారం రాజధానిలో నిర్మిస్తున్న హెచ్ఓడీ టవర్-3 కార్నర్ నోడ్ అమర్చే పనులకు మంత్రి నారాయణ ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ గత ఏడాది వర్షాలు అధికంగా కురవడంతో 4నెలల పాటు ఈ పనులకు ఆటంకం కలిగిందని పేర్కొన్నారు. ఐకానిక్ భవనాలు, ప్రజాప్రతినిధులు, అధికారుల నివాసాలు, మౌలిక వసతుల పనులు వేగంగా జరుగుతున్నాయని వివరించా రు. అమరావతి నిర్మాణానికి సీఎం చంద్రబాబు ప్రత్యేక ఫైనాన్స్ మోడల్ ఇచ్చారని చెప్పారు. ప్రజలు చెల్లించే పన్నుల నుంచి ఒక్క రూపాయి కూడా రాజధాని అమరావతికి ఖర్చు పెట్టడం లేదని పేర్కొన్నారు. అమరావతి సెల్ఫ్ ఫైనాన్స్ సిటీ అని ఈ సందర్భంగా గుర్తు చేశారు. కానీ కొంతమంది అమరావతిపై దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. అమరావతిలో సోమవారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంపై సీఎం చంద్రబాబు సమీక్షించారన్నారు. ప్రస్తుతం ఈ ప్రమాద ఘటనపై విచారణ జరుగుతోందని తెలిపా రు. ఎవరైనా ఉద్దేశపూర్వకంగా ఈ పని చేస్తే ఖచ్చితంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏజీఐసీఎల్ ఎండీ శ్రీనివాస్‌తో పాటు ఇంజనీర్లు పాల్గొన్నారు.

# మధ్యాహ్న భోజనం నాణ్యతలో రాజీ లేదు

**- చిన్న లోటు పాటు ఉన్నా చర్యలు తీసుకుంటాం**
**- సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి**



ఏలూరు/ఆగిరిపల్లి(చైతన్యరథం): ఆగిరిపల్లి మండలం ఈదర గ్రామంలో బుధవారం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో మధ్యా హ్నం భోజనం పథకాన్ని పరిశీలించి మంత్రి కొలుసు పార్థసారథి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. భోజనం తింటూ విద్యార్థు లతో మాట్లాడారు. ఉపాధ్యాయులు పాఠాలు ఎలా చెబుతున్నారు, భోజనం ఎలా ఉంటుందని, తదితర వివరాలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో అమలు అవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని అకస్మికంగా తనిఖీలు చేశామని, విద్యార్థులతో కలిసి భోజనం చేసి ఆహార నాణ్యతను స్వయంగా పరిశీలించా మని, విద్యార్థులు సంతృప్తి చెందారని అన్నారు. విద్యార్థులు ఆరోగ్యంగా ఎదగాలనే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం డొక్కా సీతమ్మ పేరుతో పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు పోషకాహారం అందించేందుకు సన్న బియ్యంతో భోజనం అందిస్తున్నామని తెలిపారు. ప్రతిరోజూ మధ్యాహ్న భోజన నాణ్యతను ఒక ఉపాధ్యాయుడు తప్పనిసరిగగ్గా పరిశీలించాలని లోకేష్ తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మక నిర్ణయం అన్నారు. భోజన నాణ్యతలో ఎక్కడైనా లోపాలు ఉంటే కఠిన చర్యలు తీసుకుంటా మని హెచ్చరించారు. గత ఐదేళ్లలో చేయలేని ఉపాధ్యాయులు భర్తీని కూటమి ప్రభుత్వం మొదటి సంవత్సరంలోనే పూర్తి చేసింద ని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం సంధిపాము శారద, విద్యా కమిటీ చైర్మన్ కంచిర్ల అంజయ్య, ప్రజా ప్రతినిధు లు, కూటమి నాయకులు, ఉపాధ్యాయులు, నాన్ టీచింగ్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# వయోవృద్ధులకు సీనియర్ సిటిజన్ కార్డులు

- **మనమిత్ర వాట్సాప్ ద్వారా అందజేస్తున్నాం**
- **సైబర్ నేరాలపైనా అవగాహన కల్పించాలి**
- **ఆర్టీసీ బస్సుల్లో రాయితీ, సీట్లు అమలు చేయాలి**
- **మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి**



అమరావతి(చైతన్యరథం): మనమిత్ర వాట్సాప్ ద్వారా రాష్ట్రం లోని వయోవృద్ధులకు ఉచితంగా సీనియర్ సిటిజన్ కార్డులు అందిస్తున్నామని వయోవృద్ధులు, దివ్యాంగుల సంక్షేమ శాఖా మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి పేర్కొన్నారు. బుధవారం వెలగపూడి సచివాలయంలో మంత్రి స్వామి అధ్యక్షతన సీనియర్ సిటిజన్స్ రాష్ట్ర కౌన్సిల్ 3వ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వయోవృద్ధుల సంక్షేమం, ఆరోగ్యం, భద్రతపై సమావేశంలో మంత్రి సమీక్షించారు. మన మిత్ర వాట్సాప్ ద్వారా ఉచితంగా సీనియర్ సిటిజన్ కార్డులు అందజేస్తున్నాం. అర్హులైన వారందరికీ ఈ కార్డులు తీసుకునేలా అవగాహన కల్పించాలి. సైబర్ నేరాల పట్ల వృద్ధులకు విస్తృతంగా అవగాహన కల్పించాలి. వృద్ధాశ్రమాల్లో లైట్ వెయిట్ వ్యాయామ పరికరాలు ఏర్పాటు చేయాలి. ఆర్టీసీ బస్సుల్లో వృద్ధులకు రాయితీ, సీట్ల కేటాయింపు పటిష్టంగా అమలు చేయాలి. వృద్ధులు, దివ్యాంగుల కోసం కలెక్టర్ కార్యాలయాల్లో లిఫ్ట్ సౌకర్యంతో పాటు వీల్ చైర్లు ఏర్పాటు చేస్తున్నాం. వృద్ధులు, దివ్యాంగులకు దేశంలో ఎక్కడా లేనివిధంగా పెద్ద మొత్తంలో పింఛన్లు ఇస్తున్నాం. 2036 నాటికి రాష్ట్రంలో ప్రతి 5 మందిలో ఒకరు వృద్ధుడు ఉంటారు. దీన్ని అధిగమించేం దుకే సీఎం చంద్రబాబు నాయుడు పాపులేషన్ మేనేజ్ మెంట్ పాలసీకి శ్రీకారం చుడుతున్నారు. వృద్ధుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఏఎస్ సూర్యకుమారి, డైరెక్టర్ రవిప్రకాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కనిగిరి నియోజకవర్గంలో మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి పర్యటన



కనిగిరి (చైతన్యరథం): వెలిగండ్ల మండలం గన్నవరం గ్రామంలో రూ.3.70 కోట్లతో నిర్మించిన పాలేరు కిచ్చమ్మ వంతెనను మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ప్రారంభించారు. రైతన్న మీకోసం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డితో కలిసి గన్నవరం గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ రైతులకు కరపత్రాలు పంపిణీ చేశారు. ప్రభుత్వ పథకాలను వినియోగించు కుని వ్యవసాయ ఆదాయం పెంపొందించుకోవడం, ఆధునిక వ్యవసాయ పద్ధతులు అవలంబించడం, డిమాండ్ ఆధారిత పంట లపై దృష్టి సారించడం, నీటి వనరులు సమర్థ వినియోగం వంటి అంశాలను ప్రజలకు వివరించారు. అనంతరం కార్యక్రమంలో భాగంగా రైతులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్నారు.

చైతన్యరథం

## నియోజకవర్గ అభివృద్ధికి అకింతభావంతో కృషి చేస్తా

**● ఘనంగా కోళ్ల లలితకుమారి జన్మదిన వేడుకలు**



ఎస్.కోట (చైతన్యరథం): శృంగవరపుకోట నియోజకవర్గ శాసనసభ్యురాలు కోళ్ల లలితకుమారి జన్మదిన వేడుకలు బుధవారం నియోజకవర్గవ్యాప్తంగా అత్యంత వైభవంగా జరిగాయి. ఎల్.కోటలోని ఆమె నివాసం వద్ద పండుగ వాతావరణం నెలకొంది. నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాల నుంచి భారీ సంఖ్యలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రభుత్వ ఉన్నతాధికారులు మరియు ప్రజలు తరలివచ్చి ఆమెకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... తనపై చూపిస్తున్న ఈ ప్రేమాభిమానాలు ఎంతో సంతృప్తిని ఇస్తున్నాయని, నియోజకవర్గ అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి నిరంతరం అంకితభావంతో కృషి చేస్తానని పునరుద్ఘాటించారు. అనంతరం కొత్తవలసలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొని అభిమానులు, నాయకుల సమక్షంలో కేక్ కట్ చేశారు. కార్యకర్తల ఉత్సాహాల మధ్య జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారందరికీ భోజన సౌకర్యం కల్పించారు. నియోజకవర్గ ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా, భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి పనులు చేపడతానని ఈ సందర్భంగా ఆమె పేర్కొన్నారు. ఎమ్మెల్యే పుట్టినరోజు సందర్భంగా ఐటీ, విద్య శాఖ మంత్రి నారా లోకేష్ స్వయంగా మెసేజ్ చేసి శుభాకాంక్షలు తెలియజేయడం విశేషం. ఈ కార్యక్రమంలో ఐదు మండలాల కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## పంచాయతీలకు చెత్త సేకరణ ట్రై సైకిల్స్‌ను పంపిణీ చేసిన నరసన్నపేట శాసనసభ్యులు బగ్గు రమణమూర్తి



నరస్సన్నపేట (చైతన్యరథం): కూటమి ప్రభుత్వం ప్రతి గ్రామాలు స్వచ్ఛ గ్రామాలుగా రూపాంతరం చెంది దిశగా కృషి చేస్తుందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తెలిపారు. పోలాకి మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో పంచాయతీలకు చెత్త సేకరణ ట్రై సైకిల్స్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... పరిశుభ్రత పట్ల చర్యలు తీసుకునే విధంగా స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా పలు కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన, మండల పార్టీ అధ్యక్షులు మిరియాపల్లి వెంకటప్పలనాయుడు, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యదర్శి కిల్లి వేణుగోపాలస్వామి, రాష్ట్ర నగరాల కార్పొరేషన్ డైరెక్టర్ నల్లన వెంకునాయుడు, యూనిట్ ఇన్‌ఛార్జ్ బోర వెంకట్రావు, తెంబూరు గౌరినాయుడు, అర్జాల విష్ణు తదితరులు పాల్గొన్నారు.

## స్టీల్ ప్లాంట్‌తో లక్ష మందికి ఉపాధి : జీఎంఆర్



అనకాపల్లి (చైతన్యరథం): అనకాపల్లి జిల్లాలో ఆర్సెలార్ మిట్టల్, నిప్పాన్ స్టీల్ సంస్థల సంయుక్త భాగస్వామ్యంలో ఏర్పాటు కాబోతున్న ఉక్కు కర్మాగార శంకుస్థాపనపై మీడియా సమావేశంలో ఎమ్మెల్యే మామిడి గోవిందరావు పాల్గొన్నారు. ఉత్తరాంధ్ర పారిశ్రామిక విప్లవానికి ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ శంకుస్థాపన నాంది కాబోతుందన్నారు. లక్ష మంది యువతకు ఉపాధి కల్పించే బృహత్తర ప్రాజెక్ట్.. కూటమి ప్రభుత్వ 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'కు నిదర్శనమన్నారు. ఏపీ పారిశ్రామిక ముఖచిత్రాన్ని మార్చనున్న రూ.1.35 లక్షల కోట్ల పెట్టుబడితో మంత్రి నారా లోకేష్ కృషితోనే ఇది సాధ్యమైందని ఎమ్మెల్యే ఎంజీఆర్ వ్యాఖ్యానించారు. ఉత్తరాంధ్రలో పారిశ్రామిక స్వర్ణయుగం ప్రారంభమైందని, ఆంధ్రప్రదేశ్ మొత్తం ఎన్నో మౌలిక సదుపాయాలతో పెట్టుబడులను ఆకర్షితులు చేస్తూ ఆంధ్రప్రదేశ్ యువతకు ఇరవై లక్షలు ఉద్యోగాలు కలపని లక్ష్యంగా తీసుకుని భారీ పెట్టుబడి – ఉపాధి కల్పన: రూ.1,35,964 కోట్లతో దేశంలోనే అతిపెద్ద గ్రీన్ ఫీల్డ్ స్టీల్ ప్రాజెక్టు రావడం వల్ల ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్ష మందికి పైగా యువతకు ఉపాధి లభిస్తుందని తెలిపారు. 'జాబ్స్ ఫస్ట్' విజన్, మంత్రి నారా లోకేష్ పెట్టుబడిదారులతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ, అతి తక్కువ కాలంలో అనుమతులు మంజూరు చేయించి ఈ ప్రాజెక్టును పట్టాలెక్కించారు. ఒక జూమ్ కాల్‌తో ఇంతటి భారీ పెట్టుబడిని రాష్ట్రానికి తీసుకురావడం ఆయన సమర్థతకు నిదర్శనమన్నారు.

# గ్రీన్‌ఫీల్డ్ స్టీల్ ప్రాజెక్టుతో లక్షల ఉద్యోగాలు

**● స్టీల్ ప్లాంట్ రాకతో ఇండస్ట్రియల్ హబ్‌గా ఉత్తరాంధ్ర ప్రాంతం : ఎమ్మెల్యే గొండు శంకర్**



శ్రీకాకుళం (చైతన్యరథం): అనకాపల్లి జిల్లాలో ప్రముఖ సంస్థల సంయుక్త భాగస్వామ్యంతో ఏర్పాటు చేయనున్న సమీకృత ఉక్కు కర్మాగారానికి శంకుస్థాపన జరగడం రాష్ట్రానికి గర్వకారణమని ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి, ముఖ్యమంత్రి, డిప్యూటీ సీఎం, ఇతర మంత్రులు పాల్గొనడం విశేషమన్నారు. దేశంలోనే అతిపెద్ద గ్రీన్ ఫీల్డ్ స్టీల్ ప్రాజెక్టుల్లో ఒకటైన ఈ ప్రాజెక్ట్ సుమారు రూ.1,35,964 కోట్లతో నిర్మించబడుతుందని చెప్పారు. దీని ద్వారా లక్షకు పైగా ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగాలు సృష్టించబడతాయని, స్థానిక యువతకు విస్తృత ఉపాధి అవకాశాలు లభిస్తాయని వివరించారు. స్కిల్ డెవలప్మెంట్, టెక్నికల్ ట్రైనింగ్, అనుబంధ పరిశ్రమల అభివృద్ధి ద్వారా దీర్ఘకాలిక అవకాశాలు ఏర్పడతాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. "జాబ్స్ ఫస్ట్" విధానంతో ఈ ప్రాజెక్ట్ యువత భవిష్యత్తును మార్చే ఉపాధి యంత్రంగా నిలుస్తుందని అన్నారు. ఈ స్టీల్ ప్లాంట్ వల్ల ఉత్తరాంధ్ర ప్రాంతం ఇండస్ట్రియల్ హబ్‌గా అభివృద్ధి చెందుతుందని, పోర్ట్, రహదారి, రైల్వే సదుపాయాలు మెరుగుపడతాయని తెలిపారు. ఎంఎస్ఈలు, చిన్న పరిశ్రమలు అభివృద్ధి చెందడంతో స్థానిక ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని చెప్పారు. ఈ ప్రాజెక్ట్ రెండు దశల్లో పూర్తి కానుందని వెల్లడించారు. మొదటి దశలో ఏడాదికి 7.3 మిలియన్ టన్నులు, రెండో దశలో 10.5 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యం కల్పించబడుతుందని చెప్పారు. 2030 జూన్ నాటికి మొదటి బ్లాస్ట్ ఫర్నేస్, డిసెంబర్ నాటికి రెండో బ్లాస్ట్ ఫర్నేస్ అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. రూ.11,192 కోట్లతో 50 ఎంటీపీఏ సామర్థ్యంతో క్యాప్టివ్ పోర్ట్ నిర్మించనున్నట్లు తెలిపారు. దీని ద్వారా మరో 6 వేల మందికి ఉపాధి లభిస్తుందని పేర్కొన్నారు.

# మధ్యాహ్న భోజన పథకం భోజనాలు విద్యార్థులు సంతృప్తికరంగా భుజించాలి

**●నాణ్యత విషయంలో ఒక చిన్న లోటు ఉన్నను చర్యలు తీసుకుంటాం**

**●విద్యార్థిని, విద్యార్థులతో కలిసి భోజనం చేసిన మంత్రి కొలుసు పార్థసారధి**



ఏలూరు/ఆగిరిపల్లి (చైతన్యరథం): ఆగిరిపల్లి మండలం ఈదర గ్రామంలో బుధవారం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలం1 మధ్యాహ్నం భోజనం పథకాన్ని పరిశీలించి రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి విద్యార్థిని, విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. భోజనం తింటూ విద్యార్థులతో మాట్లాడారు. ఉపాధ్యాయులు పాఠాలు ఏలా చెప్తున్నారు, భోజనం ఏలా ఉంటుందని, తదితర వివరాలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ... పాఠశాలలో అమలు అవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని అకస్మికంగా తనిఖీలు చేశామని, విద్యార్థులతో కలిసి భోజనం చేసి ఆహార నాణ్యతను స్వయంగా పరిశీలించామని, విద్యార్థులు సంతృప్తి చెందారని అన్నారు. విద్యార్థులు ఆరోగ్యంగా ఎదగాలనే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం డొక్కా సీతమ్మ పేరుతో పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు పోషకాహారం అందించేందుకు సన్న బియ్యంతో భోజనం అందిస్తున్నామని పేర్కొన్నారు. ప్రతిరోజూ మధ్యాహ్న భోజన నాణ్యతను ఒక ఉపాధ్యాయుడు తప్పనిసరిగగ్గా పరిశీలించాలని ఐటి,విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మక నిర్ణయం అన్నారు. భోజన నాణ్యతలో ఎక్కడైనా లోపాలు ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి హెచ్చరించారు. గత ఐదేళ్లలో చేయలేని ఉపాధ్యాయులు భర్తీని కూటమి ప్రభుత్వం మొదటి సంవత్సరంలోనే పూర్తి చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సంధిపాము శారద, విద్యా కమిటీ చైర్మన్ కంచిర్ల అంజయ్య, ప్రజా ప్రతినిధులు, కూటమి నాయకులు, ఉపాధ్యాయులు, నాన్ టీచింగు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వ పాలనలో ప్రగతి బాటలో పల్లెలు

**● మైలవరం నియోజకవర్గంలో రూ.32.92 కోట్లతో సీసీ రోడ్లు : ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్**



మైలవరం (చైతన్యరథం): మైలవరం నియోజకవర్గంలో రూ.32.92కోట్లతో సీసీ రోడ్లు నిర్మించామని, కూటమి ప్రభుత్వ పాలనలో పల్లెలు ప్రగతి బాట పడుతున్నాయని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు పేర్కొన్నారు. పల్లెపండుగ 2.0 కార్యక్రమంలో భాగంగా రెడ్డిగూడెం మండలంలోని కూనపరాజుపర్వలో రూ.71 లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మించిన సిమెంట్ రహదారులను ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు మాట్లాడుతూ... కూనపరాజుపర్వ గ్రామంలో రూ.1.5 కోట్లతో పనులు పూర్తి చేసిన గ్రామ నాయకత్వాన్ని అభినందించారు. ఇక్కడ బీసీ ఏరియాలో కమ్యూనిటీ హాల్ నిర్మాణం టెండర్ దశకు వచ్చిందన్నారు. కూనపరాజుపర్వ గ్రామాభివృద్ధికి తొలి ప్రాధాన్యత ఇచ్చి మరిన్ని నిధులు కేటాయించనున్నట్లు స్పష్టం చేశారు. గ్రామ నాయకత్వం రాజకీయాలకు అతీతంగా ప్రజలకు అండగా ఉంటూ, గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలన్నారు. ఒక్కొక్క మెట్టు ఎక్కుతూ పర్వతాలను అధిరోహించినట్లే, ఒక్కో అభివృద్ధి పని పూర్తి చేస్తూ గ్రామాన్ని సంపూర్ణంగా అభివృద్ధి చేస్తామన్నారు. అలానే మైలవరం నియోజకవర్గంలో సీఎంఆర్ఎఫ్ కింద రూ.15.50 కోట్లు మంజూరు చేశామన్నారు. సీఎం చంద్రబాబు, ప్రభుత్వ పెద్దలు చెప్పిన విధంగా అనారోగ్య బాధితులకు రాజకీయాలకు అతీతంగా ఆర్థికసాయం అందజేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పనకు పెద్దపీట వేస్తున్నట్లు స్పష్టం చేశారు. పల్లెపండుగకు పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేయడం హర్షణీయమన్నారు.

## 28న అసెంబ్లీ సమావేశం... అమరావతి రాజధాని ప్రకటిస్తూ తీర్మానం

అమరావతి (చైతన్యరథం): ఈ నెల 28వ తేదీన ఏపీ అసెంబ్లీ సమావేశం నిర్వహిస్తున్నట్లు నోటిఫికేషన్ విడుదల అయింది. రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ బుధవారం సాయంత్రం నోటిఫికేషన్ విడుదల చేశారు. 28వ తేదీ ఉదయం 11 గంటలకు అసెంబ్లీ సమావేశం ప్రారంభం కానుంది. ఈ సందర్భంగా అమరావతిని ఏపీ రాజధానిగా ప్రకటిస్తూ అసెంబ్లీ తీర్మానం చేయనుంది. అసెంబ్లీ ఆమోదించిన ఈ తీర్మానాన్ని కేంద్ర ప్రభుత్వానికి పంపనున్నారు. విభజన చట్టం ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాజధాని ఏదన్నది పార్లమెంట్ రికార్డుల్లో స్పష్టంగా ఉండేలా కేంద్రం ద్వారా తదుపరి చర్యలు తీసుకోనున్నారు.

చైతన్యరథం

# పొగాకు రైతుకు గిట్టుబాటు ధర అందిస్తాం



జంగారెడ్డిగూడెం (చైతన్యరథం): రైతు పండించిన పొగాకు పూర్తి స్థాయిలో కొనుగోలు చేయించేందుకు తాము కట్టుబడి ఉన్నామని భారత పొగాకు బోర్డు చైర్మన్ సీహెచ్ యశ్వంత్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం పొగాకు వేలాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పొగాకుకు గిట్టుబాటు ధరలు అందించేందుకు రైతుల తరపున పోరాడుతానని హామీ ఇచ్చారు. గత ఏడాది కంటే ధరలు బాగా తక్కువగా ఉండడం బాధాకరమన్నారు. పొగాకు ప్రారంభ ధర గత ఏడాది కంటే రూ.25 రూపాయలు తగ్గించి రూ.265తో ప్రారంభించడం పట్ల రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రారంభ ధర కనీసం రూ.350 ఇవ్వాలని రైతుల పట్టుబట్టారు. గత ఏడాది మేలు రకం పొగాకు రూ.456 గరిష్ఠ ధర లభించింది. వేలం కేంద్రాల అధ్యక్షుడు పరిమి రాంబాబు, వెంకటరావు, రీజినల్ మేనేజర్ సురేంద్ర, వేలం నిర్వహణ అధికారులు పి. ప్రశాంత్, మార్గరెట్, రైతు సంఘం మాజీ అధ్యక్షుడు కరాటం వెంకటరెడ్డి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# పంటలకు గిట్టుబాటు ధర కల్పించేలా ప్రభుత్వం చర్యలు : ముప్పిడి



తాళ్లపూడి (చైతన్యరథం): పశ్చిమాసియాలో యుద్ధం నేపథ్యంలో రైతులు నష్టపోకుండా పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు తెలిపారు. మండలంలోని మలకపల్లి సొసైటీ కార్యాలయంలో సొసైటీ అధ్యక్షుడు సుబ్బరాయచౌదరి అధ్యక్షతన బుధవారం జరిగిన సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. యుద్ధం నేపథ్యంలో కోకో పంట ధర తగ్గుతుందని రైతులు తన దృష్టికి తీసుకొచ్చారని, ఈ విషయాన్ని ముఖ్యమంత్రి, చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఈ సొసైటీ ద్వారా రైతులను ఆదుకునేలా చర్యలు చేపట్టారన్నారు. రైతులు పండించిన ధాన్యాన్ని ఇష్టం వచ్చిన రైసు మిల్లులకు తరలించే సౌకర్యంతో పాటు నాణ్యమైన గోనె సంచులు ఇచ్చామన్నారు. గ్రామానికి చెందిన సుజాతకు సీఎంఆర్ఎఫ్ కింద మంజూరు అయిన చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి రాపాక రాజేశ్వరి, ఏఎంసీ చైర్మన్ శ్రీరామ్, ఉపాధ్యక్షురాలు మంగామణి, నాయకులు, రైతులు, అధికారులు పాల్గొన్నారు.

# రైతుల సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉన్నాం : ఎమ్మెల్యే యార్లగడ్డ



గన్నవరం (చైతన్యరథం): ఉంగుటూరు మండలం మానికొండ గ్రామంలో నిర్వహించిన "రైతన్న మీ కోసం" వారోత్సవాల కార్యక్రమంలో ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, కృష్ణ జిల్లా టీడీపీ అధ్యక్షులు వీరంకి వెంకట గురుమూర్తి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం గ్రామంలో రైతుల వద్దకు వెళ్లి కరపత్రాలు అందజేసి, వారి సమస్యలను నేరుగా తెలుసుకున్నారు. గన్నవరం నియోజకవర్గం నుంచే పీఎం కిసాన్ - అన్నదాత సుఖీభవ నిధులను రాష్ట్రవ్యాప్తంగా సీఎం చంద్రబాబు ప్రారంభించినట్లు గురుమూర్తి తెలిపారు. రైతులకు ఉన్న ప్రతి సమస్యకు పరిష్కారం చూపుతున్నామని చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ... తెలుగుదేశం పార్టీ స్థాపన తర్వాత ఎప్పుడూ లేని విధంగా మానికొండ గ్రామం భారీ మెజారిటీ ఇచ్చిందని, అందుకే ఈ గ్రామాన్ని ప్రత్యేకంగా అభివృద్ధి చేస్తానని తెలిపారు. మానికొండ-
-తరిగొప్పల రోడ్డుతో పాటు ఇతర మౌలిక వసతుల అభివృద్ధికి మొత్తం రూ.3.45 కోట్లను కేటాయించినట్లు వెల్లడించారు. ఇందులో రూ.2.50 కోట్లతో అధ్వానంగా ఉన్న రహదారిని 10 రోజుల్లో ప్రారంభిస్తామనీ, మరో రూ.95 లక్షలతో నందమూరు రోడ్డును నిర్మిస్తామని స్పష్టం చేశారు. ఇప్పటికే నియోజకవర్గంలో 60 వేల మందికి ఇంటి వద్దే రక్త పరీక్షలు నిర్వహించామని, రైతులకు ఇచ్చే పట్టాదారు పాస్ పుస్తకాలలో లోపాలను సరిచేసి, రాష్ట్ర రాజముద్రతోనే పంపిణీ చేస్తున్నామని చెప్పారు.

# కుటుంబ గొడవలను రాజకీయాల్లోకి లాగారు

**●పేద... దళిత వర్గాలను గౌరవించి సహాయపడే వ్యక్తిత్వం నాది**

**●మీడియా సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు**



రాజమహేంద్రవరం (చైతన్యరథం): వైసీపీ వారు కుటుంబ గొడవలను రాజకీయాల్లోకి లాగారని మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు మండిపడ్డారు. ప్రస్తుతం ఆయన వాయిస్‌తో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న ఆడియోలపై ఆయన స్పందించారు. అవన్నీ వైకాపా వారు చేసిన ఫేక్ ఆడియోలని ఖండించారు. గత 40 సంవత్సరాల తన రాజకీయ జీవితంలో నగర ప్రజలకు, బడుగు బలహీన వర్గాలకు, ముఖ్యంగా దళిత వర్గాలకు తన వ్యక్తిత్వం సహాయ పడగలను తెలుసు అని మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు అన్నారు. ఆపదలో ఉన్న వారికి కష్టాల్లో ఉన్నవారికి ఎంతో సహాయ పడ్డానని, ఒక కుటుంబం వివాదంలో కుల పెద్దమనిషిగా సహాయపడేందుకు తమ మధ్య జరిగిన సంభాషణను వక్రీకరించి తనకున్న రాజకీయ పరపతిని మాజీ ఎంపీ భరత్ కుట్రలు చేస్తున్నాడనీ విమర్శించారు. ముందు ఎన్నికల ముందు అతని తండ్రి వయసు గల తనను వయసు కూడా గౌరవం ఇవ్వకుండా చెప్పు తీసి కొడతానని అహంకారపూరితంగా మాట్లాడినప్పుడే తాను గట్టిగా బుద్ధి చెప్పి ఉండాల్సిందని, ఈరోజు మళ్లీ తన వైపు చూసే సాహసం చేసేవాడు కాదని అన్నారు. ఒక అభాగ్యురాలి కష్టాన్ని అర్థం చేసుకుని ఆమె కాపురాన్ని సరిదిద్దే ప్రయత్నం తాను చేస్తుంటే భరత్ అనుచరులు రంగ ప్రవేశం చేసి ఆ మహిళా కుటుంబ సభ్యులను మభ్యపెట్టి, తమ మధ్య జరిగిన సంభాషణ ఆడియోను అతూకులతో ఎడిట్ చేసి తన వ్యక్తిత్వంపై దుష్ప్రచారం పాల్పడుతున్నాడని అతనిపై చర్యలు తీసుకోవాలని, ఆడియోలో నిజానిజాలు నిర్ధారణ చేయాలని కోరుతూ జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ప్రస్తుత సమాజంలో కుల విద్వేషాలను వైసీపీ పార్టీవారు రాజకీయ ఉనికి కోసం రెచ్చగొడుతున్నారని ప్రజలు, దళిత వర్గాలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.

# ఆంధ్రాలో ప్రకాశిస్తున్న 'పీఎం సూర్య ఘర్'

**●దేశవ్యాప్తంగా 32 లక్షల కుటుంబాలకు లబ్ధి**

**●ఆంధ్రప్రదేశ్‌లో 1.14 లక్షల ఇళ్లపై సౌర పలకలు**

**●లోక్‌సభలో విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ ప్రశ్నకు కేంద్రం సమాధానం**



న్యూఢిల్లీ / విజయవాడ (చైతన్యరథం): దేశవ్యాప్తంగా అమలు చేస్తున్న 'ప్రధానమంత్రి సూర్య ఘర్ ఉచిత విద్యుత్ యోజన' (పీఎంఎస్‌జీ : ఎంబీవై) పథకం ఆంధ్రప్రదేశ్‌లో ప్రకాశిస్తోంది. పథకం వేగంగా అమలు జరుగుతోంది. ఈ విషయాన్ని కేంద్ర పునరుత్పాదక ఇంధనశాఖ సహాయ మంత్రి శ్రీపాద్ యశోనాయక్ లోక్‌సభలో వెల్లడించారు. 'ప్రధానమంత్రి సూర్య ఘర్ ఉచిత విద్యుత్ యోజన' పథకం పురోగతిపై విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్‌తో పాటుగా పలువురు ఎంపీలు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు. 'ప్రధానమంత్రి సూర్యఘర్ ఉచిత విద్యుత్ యోజన' పథకం ద్వారా దేశవ్యాప్తంగా 32లక్షల కుటుంబాలకు లబ్ధి చేకూరిందన్నారు. దేశవ్యాప్తంగా ఇప్పటి వరకు 66.48లక్షల దరఖాస్తులు రాగా, 26.20లక్షల ఇన్‌స్టాలేషన్లు పూర్తయ్యాయని దీనివల్ల మొత్తం 32,40,068 కుటుంబాలు ప్రయోజనం పొందాయని తెలిపారు. ఈ పథకం అమలుకు కేంద్రం ఇప్పటివరకు రూ.17,967.46 కోట్ల సబ్సిడీని విడుదల చేసిందని మంత్రి పేర్కొన్నారు. అదే విధంగా ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటివరకు 1,14,313 గృహాలపై సోలార్ విద్యుత్ వ్యవస్థలను ఏర్పాటు చేసినట్లు మంత్రి శ్రీపాద్ యశోనాయక్ తెలిపారు.

**సూర్యఘర్ ఉచిత విద్యుత్ యోజన పథకం ప్రారంభం నుంచి విశేష స్పందన**

2024 ఫిబ్రవరి నుంచి ఆంధ్రప్రదేశ్‌లో 'ప్రధానమంత్రి సూర్యఘర్ ఉచిత విద్యుత్ యోజన' పథకం ప్రారంభమైందని, పథకం ప్రారంభం నుంచి విశేష స్పందన లభించిందని పేర్కొన్నారు. ఈ పథకం కింద దేశ వ్యాప్తంగా 32,40,068 ధరఖాస్తులు రాగా రాష్ట్రంలో మొత్తం 14,72,814 దరఖాస్తులు వచ్చినట్లు వివరించారు. వీటిలో 1,14,313 దరఖాస్తులకు సంబంధించి ఇన్‌స్టాలేషన్లు ఇప్పటికే పూర్తయినట్లు మంత్రి తెలిపారు. తద్వారా 1,17,453 కుటుంబాలకు రాష్ట్రంలో లబ్ధి చేకూరిందనీ, ఈ పథకం కింద లబ్ధిదారులకు కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు రూ.734.97 కోట్లను ఆర్థిక సహాయం (సబ్సిడీ) రూపంలో ఈ ఏడాది మార్చి 20 నాటికి నేరుగా పంపిణీ చేసిందన్నారు.

**పల్నాడు జిల్లా అత్యధికం... అతి తక్కువగా అల్లూరి జిల్లాల్లో**

ఆంధ్రప్రదేశ్‌లో 'ప్రధానమంత్రి సూర్య ఘర్ ఉచిత విద్యుత్ యోజన' పథకం అమలు పురోగతిని జిల్లాల వారీగా పరిశీలిస్తే... పల్నాడు జిల్లా నుంచి అత్యధికంగా 1,62,506 దరఖాస్తులు అందినట్లు తెలిపారు. సోలార్ పలకల ఏర్పాటులో గుంటూరు జిల్లా 7,767 యూనిట్లతో అగ్రస్థానంలో ఉందన్నారు. ఆ తర్వాతి స్థానాల్లో ఏలూరు (7,341), కాకినాడ (6,878), కృష్ణా (6,871), విశాఖపట్నం (6,208) జిల్లాలు ఉన్నాయన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో అతి తక్కువగా 62 యూనిట్లు మాత్రమే ఏర్పాటయ్యాయన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం 1,508 మంది రిజిస్టర్డ్ వెండర్లు సోలార్ పలకల ఏర్పాటు సేవలు అందిస్తున్నారని మంత్రి వివరించారు. రాష్ట్రంలోని 12 జిల్లాల్లో 'మోడల్ సోలార్ గ్రామాల'ను ప్రకటించినట్లు మంత్రి తెలిపారు.

# తాబేళ్లు ప్రకృతికి అమూల్యం : ఎమ్మెల్యే మండలి



కోడూరు (చైతన్యరథం): తాబేళ్లు ప్రకృతికి అమూల్యమైన వరమని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. బుధవారం కోడూరు మండలం పాలకాయతిప్పలో ఏలూరు డివిజన్ అటవీ శాఖ అధికారుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సముద్రపు తాబేళ్ల పునరుత్పత్తి కేంద్రాన్ని ఎమ్మెల్యే సందర్శించారు. గుడ్ల నుంచి బయటకు వచ్చిన తాబేలు పిల్లలను సముద్రంలో వదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాబేళ్లు సముద్ర జీవ వ్యవస్థలో కీలకపాత్ర పోషిస్తాయన్నారు. తాబేళ్లు సముద్ర తీరాలను సమతౌల్యంగా ఉంచి జీవ వైవిధ్యాన్ని పరిరక్షిస్తాయన్నారు. భారతదేశంలో ఆలీవ్ రిడ్లే సముద్రపు తాబేళ్ల పరిరక్షణలో ఒడిశా, చెన్నై, విశాఖపట్నంతో పాటు హంసలదీవి సాగర తీరం కీలక భాగస్వామిగా నిలుస్తోందన్నారు. ఆలీవ్ రిడ్లే తాబేళ్ల జాతి పరిరక్షణకు ప్రభుత్వ సహకారంతో అటవీ శాఖ అధికారులు చేస్తున్న కృషిని అభినందించారు.

# తాబేళ్లు ప్రకృతికి అమూల్యం : ఎమ్మెల్యే మండలి



కోటనందూరు (చైతన్యరథం): కోటనందూరులోని రామాలయంలో స్థానిక తెదేపా నాయకులు వెలగా వెంకటకృష్ణారావు ఆధ్వర్యంలో నూతన వంట, విశ్రాంత షెడ్లను బుధవారం ప్రారంభించారు. సేవాగుణం, దైవభక్తి కలిగిన రంగనాయకులు, వెంకట కృష్ణారావు కలిసి సుమారు రూ.2 లక్షలతో ఈ షెడ్లను నిర్మించారు.

# స్టీల్ ప్లాంట్ రాకతో ఉత్తరాంధ్ర అభివృద్ధికి నాంది : ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్



పెదకూరపాడు (చైతన్యరథం): ఉత్తరాంధ్ర అభివృద్ధికి నాంది పలుకుతూ అనకాపల్లి జిల్లాలో ఆర్సెలార్ మిట్టల్ మరియు నిప్పాన్ స్టీల్ సంయుక్తంగా ఏర్పాటు చేస్తున్న భారీ స్టీల్ ప్లాంట్ శంకుస్థాపన జరగడం రాష్ట్రానికి గర్వకారణమని పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ తెలిపారు. నియోజకవర్గ క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ... ప్రపంచస్థాయి సమీకృత ఉక్కు కర్మాగారానికి కేంద్రమంత్రి కుమారస్వామి, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ శంకుస్థాపన చేయడం చారిత్రాత్మక ఘట్టమని ఆయన పేర్కొన్నారు. సుమారు రూ.1,35,964 కోట్లకు పైగా భారీ పెట్టుబడితో దేశంలోనే అతిపెద్ద గ్రీన్ ఫీల్డ్ స్టీల్ ప్రాజెక్టులలో ఒకటిగా ఈ పరిశ్రమ రూపుదిద్దుకోనుందని తెలిపారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా లక్షకు పైగా ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగ అవకాశాలు సృష్టించబడతాయని, ముఖ్యంగా స్థానిక యువతకు విస్తృత స్థాయిలో ఉపాధి లభిస్తుందని అన్నారు. స్కిల్ డెవలప్మెంట్, టెక్నికల్ ట్రైనింగ్, అనుబంధ పరిశ్రమల అభివృద్ధి ద్వారా యువతకు దీర్ఘకాలిక ఉపాధి అవకాశాలు ఏర్పడతాయని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న "స్పీడ్ ఆఫ్ డూయింగ్" విధానం, పారదర్శక పాలసీలు, వేగవంతమైన అనుమతులు పెట్టుబడులను ఆకర్షించడంలో కీలక పాత్ర పోషించాయని అన్నారు. ప్రపంచస్థాయి కంపెనీలు ఆంధ్రప్రదేశ్ వైపు చూస్తుండటం ప్రభుత్వంపై ఉన్న నమ్మకానికి నిదర్శనమని, మంత్రి నారా లోకేష్ కృషి ఈ ప్రాజెక్ట్ సాధనలో ప్రధాన కారణమని ఆయన ప్రశంసించారు.

# కూటమి ప్రభుత్వంలో ఆంధ్రప్రదేశ్‌కి పారిశ్రామిక కళ

**◆విలేకర్ల సమావేశంలో జిడిసిసి బ్యాంక్ చైర్మన్ మక్కెన మల్లికార్జున రావు వెల్లడి**

వినుకొండ (చైతన్యరథం) : ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ప్రాజెక్టులను పూర్తి చేస్తూ, భారీగా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తోందని, రాబోయే 15 ఏళ్ల పాటు కూటమి ప్రభుత్వమే అధికారంలో ఉంటుందని ఉమ్మడి గుంటూరు జిల్లా జిడిసిసి బ్యాంక్ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు స్పష్టం చేశారు. బుధవారం వినుకొండలోని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో ఆయన మాట్లాడుతూ.. అనకాపల్లి జిల్లాలో ఆర్సెలార్ మిట్టల్ మరియు నిప్పాన్ స్టీల్ సంయుక్తంగా సుమారు రూ.1,35,964 కోట్ల భారీ పెట్టుబడితో ఏర్పాటు చేస్తున్న గ్రీన్ ఫీల్డ్ స్టీల్ ప్లాంట్ శంకుస్థాపనతో ఉత్తరాంధ్ర అభివృద్ధిలో కొత్త యుగం మొదలైందని హర్షం వ్యక్తం చేశారు. మంత్రి నారా లోకేష్ కేవలం ఒక జూమ్ కాల్‌తో ఇంతటి భారీ ప్రాజెక్టును రాష్ట్రానికి తీసుకురావడం అభినందనీయమని ప్రశంసిస్తూ, ఈ ప్లాంట్ ఏపీ యువత భవిష్యత్తును మార్చే ఒక "ఉపాధి యంత్రం" అని కొనియాడారు. ఇదే క్రమంలో వినుకొండ నియోజకవర్గాన్ని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు ఎంతో అభివృద్ధి చేస్తున్నారని మక్కెన ప్రశంసించారు. రెండు దశల్లో నిర్మితమయ్యే ఈ ప్లాంట్ ద్వారా 2030 నాటికి పూర్తిస్థాయి ఉత్పత్తి ప్రారంభమవుతుందని, దీనికి అనుబంధంగా నిర్మించే క్యాప్టివ్ పోర్టు ద్వారా అదనంగా మరో 6 వేల మందికి ఉద్యోగాలొస్తాయని వివరించారు.

# 650 కిలోల పాతపుస్తకాలు సేకరించిన అన్నపూర్ణకు ప్రశంసలు

**◆ఐటీసీ 'వావ్' ఆధ్వర్యంలో ఇంటర్ స్కూల్ రీసైక్లింగ్ ఛాంపియన్షిప్**



విజయవాడ (చైతన్యరథం): పర్యావరణ పరిరక్షణకు ఐటీసీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన వెల్ బీయింగ్ అవుట్ఆఫ్‌వేస్ట్ (వావ్) కార్యక్రమం ఇంటర్‌స్కూల్ రీసైక్లింగ్ ఛాంపియన్షిప్‌లో అధిక మొత్తంలో పాత పుస్తకాలను సేకరించిన విజయవాడ ఢిల్లీ పబ్లిక్ స్కూల్స్‌కు చెందిన 8వ తరగతి విద్యార్థిని, స్వచ్ఛ ఆంధ్ర కార్పోరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ కుమార్తె అన్నపూర్ణను పలువురు అభినందించారు. తండ్రి పట్టాభిరామ్ ఆశయాలకు అనుగుణంగా, ఆయన బాటలో నడుస్తున్న అన్నపూర్ణ ఐటీసీ వావ్ ప్రతినిధులు, స్కూల్ నిర్వాహకులు, ఉపాధ్యాయుల ప్రశంసలు అందుకుంది. విద్యార్థులు తాము సేకరించిన పాత పుస్తకాలను ఏజీఎస్-ఐటీసీ నిర్వాహకులకు అందజేశారు. ఈ సందర్భంగా, ఢిల్లీపబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ భువనేశ్వరన్ మాట్లాడుతూ... పర్యావరణ పరిరక్షణలో భాగమైన చెట్లను కాపాడాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అత్యధికంగా పాత పుస్తకాలను సేకరించిన విద్యార్థిని అన్నపూర్ణను ప్రత్యేకంగా అభినందించారు. వావ్ ప్రతినిధులు గణేష్, కిరణ్ మాట్లాడుతూ... వాడిన కాగితాన్ని రీసైకిల్ చేయడం ద్వారా కేవలం ఒక మెట్రిక్ టన్ను (1,000 కిలోల) కాగితంతో మన భూమిని అనేక రకాలుగా రక్షించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని అన్నపూర్ణ అత్యధికంగా 650 కిలోల పాత పుస్తకాలను నిర్వాహకులకు అందజేసి ప్రశంసా పత్రం అందుకుంది.

# సీఎం చంద్రబాబుతోనే అన్ని ప్రాంతాల అభివృద్ధి సాధ్యం

**◆ఉత్తరాంధ్రలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు రాష్ట్రానికే గర్వ కారణం**



విజయవాడ (చైతన్యరథం): సీఎం చంద్రబాబుతోనే అన్ని ప్రాంతాల అభివృద్ధి సాధ్యమని, ఉత్తరాంధ్రలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు రాష్ట్రానికే గర్వకారణమని, ఇది పారిశ్రామిక ప్రగతిని సూచిస్తోందని కృష్ణా జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గౌడ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి మరియు కృష్ణాజిల్లా తెలుగుదేశంపార్టీ ప్రధాన కార్యదర్శి గోపు సత్యనారాయణ వ్యాఖ్యానించారు. అనకాపల్లి జిల్లాలో ఆర్సెలార్ మిట్టల్ - నిప్పాన్ స్టీల్ సంయుక్తంగా ఏర్పాటు చేస్తున్న భారీ స్టీల్ ప్లాంట్‌కు శంకుస్థాపన జరగడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ప్రపంచంలోనే ప్రఖ్యాత సంస్థలు ఏపీకి రావడం.. ఇక్కడి పారిశ్రామిక ప్రగతిని సూచిస్తోందని ఆయన అభిప్రాయపడ్డారు. దేశంలోనే అతిపెద్ద గ్రీన్ ఫీల్డ్ స్టీల్ ప్రాజెక్టులలో ఒకటైన ఈ ప్రాజెక్ట్ సుమారు రూ.1,35,964 కోట్లకు పైగా పెట్టుబడితో అతిపెద్ద ఉక్కు కర్మాగారాన్ని నిర్మించబోతుండటం రాష్ట్రానికే గర్వ కారణమన్నారు. దీని వలన లక్షకు పైగా ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగ అవకాశాలు వచ్చే అవకాశం ఉందన్నారు. వెనుకబడిన ఉత్తరాంధ్రలో యువతకు భారీ స్థాయిలో ఉపాధి లభిస్తుందన్నారు. ఈ ప్రాజెక్టు రాకతో ఉత్తరాంధ్ర ఇండస్ట్రియల్ హబ్‌గా అభివృద్ధి చెందుతోంది. పోర్ట్ కనెక్టివిటీ, రహదారి, రైల్వే సదుపాయాలు మెరుగుపడి లాజిస్టిక్స్ రంగం బలోపేతం అవుతుందన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఎవరైనా రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలంటేనే భయపడే పరిస్థితి ఉండేదన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ చొరవతో పెద్ద ఎత్తున పరిశ్రమలు వస్తున్నాయన్నారు.

# టీడీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పండుగలా చేద్దాం : ఎమ్మెల్యే నసీర్



గుంటూరు (చైతన్యరథం): తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ పండుగకు సిద్ధం కావాలని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ కేడర్ కు పిలుపునిచ్చారు. ఈ నెల 29వ తేదీన తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవం, రేపు 26న బిఆర్ స్టేడియంలో మల్టీపర్పస్ భవన సముదాయాల శంకుస్థాపన కార్యక్రమం సందర్భంగా పార్టీ శ్రేణులతో బుధవారం స్థానిక తూర్పు శాసనసభ్యుల వారి కార్యాలయంలో ఎమ్మెల్యే నసీర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ తెలుగు నేలపై పేద, బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతిగా తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించిందని తెలిపారు. అన్న నందమూరి తారక రామారావు స్ఫూర్తితో సీఎం నారా చంద్రబాబునాయుడు ఆంధ్ర ప్రదేశ్ ను ప్రపంచ పటంలో గొప్ప రాష్ట్రంగా తీర్చిదిద్దారని పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించాకే తెలుగు ప్రజలు తలెత్తుకొని నిలబడేలా ఆత్మ గౌరవాన్ని కాపాడినట్లు చెప్పారు. అలాంటి తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ పండుగలా నిర్వహించాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బీఆర్ స్టేడియం అభివృద్ధి కోసం అసెంబ్లీలోనూ ప్రస్తావించానని, ఈ క్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర సహాయం మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ సహకారంతో బిఆర్ స్టేడియం అభివృద్ధికి బాటలు వేశామని స్పష్టం చేశారు.

# ఆరోగ్య గుడివాడ నిర్మాణంలో భాగస్వామ్యం అవుదాం



జగ్గయ్యపేట (చైతన్యరథం): కృష్ణా ఫార్మర్స్ కోపరేటివ్ సొసైటీ ఆవరణలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో కృష్ణా జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురాం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆధునికీకరించిన కృష్ణ ఫార్మర్స్ సొసైటీ భవనాన్ని ఆయన ఘనంగా ప్రారంభించారు. భవనంలో చేపట్టిన ఆధునికరణ పనులను పరిశీలించిన నెట్టెం రఘురాం... సదుపాయాలను మెరుగుపరచడం ద్వారా రైతులకు మరింత సమర్థవంతమైన సేవలు అందించే దిశగా తీసుకున్న ఈ చర్యలను అభినందించారు. ముఖ్యంగా ఈ పనులను సమర్థవంతంగా అమలు చేసిన సొసైటీ చైర్మన్ యానాల గోపీచంద్‌ని ప్రశంసించారు. ఈ సందర్భంగా 2021-22, 2022-23, 2023-24 సంవత్సరాలకు సంబంధించిన డివిడెండ్లను మొత్తం 2,926 మంది సభ్యులకు రూ.49,27,420లను పంపిణీ చేశారు. సమావేశంలో సంఘ ఆడిట్ నివేదికను ఆమోదించగా, సంఘం ఆర్థికంగా ప్రగతి పథంలో దూసుకెళ్తోందని చైర్మన్ యానాల గోపీచంద్ వివరించారు. ఈ సందర్భంగా నెట్టెం రఘురాం మాట్లాడుతూ... 2025-26 ఆర్థిక సంవత్సరంలో సంఘం రూ.1.36 కోట్లు లాభాలు సాధించిందని తెలిపారు. ఇప్పటివరకు రూ.9 కోట్లకు పైగా డిపాజిట్లు సేకరించి, రూ.45 కోట్ల రుణ వ్యాపారాన్ని విజయవంతంగా విస్తరించినట్లు పేర్కొన్నారు.

# ఆరోగ్య గుడివాడ నిర్మాణంలో భాగస్వామ్యం అవుదాం

**◆గుడివాడ ఆసుపత్రికి సిటీ స్కాన్ మంజూరు... త్వరలో మరిన్ని మెరుగైన వసతులు: ఎమ్మెల్యే రాము**




గుడివాడ (చైతన్యరథం): ఆరోగ్య గుడివాడ నిర్మాణంలో మనందరం భాగస్వామ్యం అవుదామని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ప్రజలు, రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన వెల్లడించారు. గుడివాడ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలోని సమావేశ మందిరంలో వైద్య అధికారులు, వైద్యులు, టెక్నీషియన్లు ఇతర సిబ్బందితో ఎమ్మెల్యే రాము రివ్యూ సమావేశం నిర్వహించారు. వైద్య అధికారులతో మాట్లాడుతూ ఆసుపత్రిలో అందిస్తున్న, చికిత్సల వివరాలు... అందుబాటులో ఉన్న వసతులు, సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రి ఓపి, ఐపీ, సర్జికల్ రికార్డులు పరిశీలించారు. ఓపీ, ల్యాబ్ టెస్టులకు... సర్జికల్స్ నిధుల ప్రపోజల్స్ మధ్య భారీ వ్యత్యాసం ఉండటాన్ని గుర్తించి అధికారులను ఎమ్మెల్యే రాము ప్రశ్నించారు. సిటీస్కాన్ సమస్యను అధికారులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా... కలెక్టర్‌తో మాట్లాడి ఎమ్మెల్యే రాము సమస్యను పరిష్కరించారు. అనంతరం వివిధ విభాగాల వైద్యులతో మాట్లాడిన ఎమ్మెల్యే సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మెరుగైన సామాగ్రి కోసం విభాగాల వారీగా ప్రాజెక్టు ప్రపోజల్స్ రూపొందించాలని సూచించారు. గుడివాడ ఆసుపత్రి సెకండరీ కేటగిరిలో ఉండడం వల్లనే... ఐసీయూ, కావలసినంత డ్రగ్ మంజూరు కావడం లేదని వైద్య అధికారులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. పొరపాట్లు జరిగితే సరిదిద్దుకోవాలని... బాధ్యతతో పనిచేసే ప్రతి ఒక్కరికి తన సంపూర్ణ మద్దతు ఉంటుందని సమావేశంలో పాల్గొన్న వైద్యులకు ఎమ్మెల్యే రాము భరోసా ఇచ్చారు.

చైతన్యరథం

# పకడ్బందీగా సీఎం పర్యటన ఏర్పాట్లు



వింజమూరు (చైతన్యరథం): పట్టణంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు పర్యటన నేపథ్యంలో "పేదల సేవలో" కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు సమగ్ర సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశాన్ని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని 8 మండలాల ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొని చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రతి అంశాన్ని సమగ్రంగా సమీక్షిస్తూ, ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం కావడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లపై చర్చించారు. కార్యక్రమం సజావుగా, శ్రద్ధగా, ఎటువంటి అవాంతరాలు లేకుండా జరగడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నాయకులకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. అలాగే, సభలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలు, సూచనలు, సలహాలను శ్రద్ధగా విని, వాటిని అమలు చేసే విధంగా కార్యాచరణ రూపొందించాల్సిందిగా సూచించారు. ప్రతి ఒక్కరూ తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ, సమన్వయంతో పనిచేయాలని, చిన్న పొరపాటు కూడా జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి పర్యటన ప్రజలకు ఉపయోగపడేలా, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలపై అవగాహన పెంచేలా ఉండాలని, ఈ కార్యక్రమం ద్వారా పేదలకు మరింత మేలు చేకూరే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన ఆకాంక్షించారు.



4.8కోట్ల రూపాయలతో కనిగిరి ఫైర్ స్టేషన్ వద్ద ఓవీ రోడ్డుకు ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి తో కలసి భూమి పూజ చేసిన రోడ్లు భవనం శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి పాల్గొన్న అధికారులు, నాయకులు

# శరవేగంగా పొట్టేపాలెం కలుజు పనులు

## నెల్లూరు రూరల్ టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి



నెల్లూరు రూరల్ (చైతన్యరథం): పొట్టేపాలెం గ్రామంలో 82.50 లక్షల రూపాయలతో అభివృద్ధి పనులకు మండల పరిషత్ అధ్యక్షుడు బూడిద విజయ్ కుమార్ శ్రీ వేదగిరి లక్ష్మీ నరసింహస్వామి దేవస్థాన చైర్మన్ ఇందుపూరు అచ్యుత్ రెడ్డి ప్రారంభోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి పాల్గొన్నారు. దివంగత నేత ఇందుపూరు శ్రీనివాసులు రెడ్డి, గ్రామస్తుల కోరిక మేరకు పొట్టేపాలెం గ్రామంలో కమ్యూనిటీ హాలును నిర్మించామన్నారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పొట్టేపాలెం గ్రామ అభివృద్ధికి 4కోట్ల 30లక్షల రూపాయలు నిధులను కేటాయించామన్నారు. పొట్టేపాలెం ప్రజల కల పొట్టేపాలెం పొర్లుకట్టను ఈ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే నిర్మించామన్నారు పొట్టేపాలెం కలుజు నిర్మాణం పనులు కూడా శరవేగంగా జరుగుతున్నాయన్నారు. ఇంత అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు, నెల్లూరు రూరల్ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డికి, కూటమి ప్రభుత్వానికి మీ అందరి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలన్నారు. కార్యక్రమంలో గుండ్లపాలెం పీఏసీఎస్ సొసైటీ చైర్మన్ పముజుల ప్రదీప్, జడ్పీ కోఆప్షన్ నెంబర్ అల్లాబక్షు, గ్రామ సర్పంచ్ ఏడుకొండలు ఎంపీటీసీ నేరెళ్ల నారాయణ టీడీపీ నాయకులు హరి యాదవ్, పొన్నాల రామచంద్ర రెడ్డి, ముత్యాల సుబ్రహ్మణ్యం, శ్రీనివాసులు రెడ్డి, అశోక్ రెడ్డి, సతీష్ రెడ్డి, సురేష్ రెడ్డి, వంశీ రెడ్డి, జనార్దన్ రెడ్డి, నేరెళ్ల బాలకృష్ణ, ఫిరోజ్, రియాజ్, నరసయ్య, జనాని బాబు, జితేంద్ర బాబు,నవాజ్, నరసింహ, సురేష్ బాబు, మల్లి, అలియాజ్, నరసయ్య, మల్లయ్య, రామయ్య, శివ, అనిల్ స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు

# పుల్లల చెరువులో రైతన్నా మీకోసం

## పాల్గొన్న టీడీపీ ఇన్చార్జి గూడూరు ఎరిక్సన్‌బాబు

యర్రగొండపాలెం (చైతన్యరథం): పుల్లలచెరువు మండలంలో నిర్వహించిన "రైతన్నా మీకోసం" కార్యక్రమంలో భాగంగా యర్రగొండపాలెం టీడీపీ ఇంచార్జి ఎరిక్సన్ బాబు ఇంటింటికి వెళ్లి రైతులకు కరపత్రాలు అందజేస్తూ, రైతుల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుంటూ, వారికి అందుబాటులో ఉన్న పథకాలు, సబ్సిడీలు, ప్రభుత్వం రైతుల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అభివృద్ధి కార్యక్రమాలపై అవగాహన కోసంవివరించారు. ఈ కార్యక్రమంలో మండల కూటమి నాయకులు, క్లస్టర్, బూత్, యూనిట్ ఇంచార్జిలు, గ్రామ పార్టీ నాయకులు చురుకుగా పాల్గొని రైతుల వద్దకు వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు.



# సీఎం చంద్రబాబు చొరవతో చేనేతల జీవితాల్లో వెలుగులు

## ఆంధ్రప్రదేశ్ పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ పోతుల లక్ష్మీ నరసింహులు



అనంతపురం (చైతన్యరథం): నారా చంద్రబాబు నాయుడు, నారా లోకేష్ చేనేత జీవితాల్లో వెలుగులు నింపారని ఆంధ్రప్రదేశ్ పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ పోతుల లక్ష్మీనరసింహులు అన్నారు. బుధవారం స్థానిక సిండికేట్ నగర్ ప్రాంతంలో పద్మశాలి డైరెక్టర్ పోతుల లక్ష్మీనరసింహులు చేనేత కళాకారులు దేవరకొండ రామాంజినేయులు, మహేష్, అభిలాష్, మెటీకల రామకృష్ణ ఇళ్లకు వెళ్లి కూటమి ప్రభుత్వం ఏప్రిల్ 1 తేదీ నుండి హ్యాండ్లూమ్ కు 200 యూనిట్లు, పవర్ లూమ్స్ కు 500 యూనిట్లు ఉచిత విద్యుత్తు అందిస్తున్నదని, చేతి మగ్గాలు నేసే నేతన్నలకు నెలకు సుమారు పన్నెండు వందల రూపాయలు, మర మగ్గాలా నేతన్నలకు నెలకు ఐదు వేల రూపాయలు వరకు లబ్ది చేకూరుతున్నదని చేనేత కళాకారులకు, కుటుంబ సభ్యులకు వివరించారు. నారా లోకేష్ యువ గళం పాదయాత్రలో నేతన్నల కష్టాలను చూసి అధికారంలోకి రాగానే కూటమి ప్రభుత్వం ఉచిత విద్యుత్తును అందిస్తామని హామీ ఇచ్చి,నేడు అమలులోకి తీసుకురావడం అభినందనీయమని కొనియాడారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేనేతల జీవితాలలో వెలుగులు నింపడానికి కృషి చేయడం సంతోషకరమన్నారు. చేనేత కుటుంబాలు హర్షం వ్యక్తం చేశాయి. చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత శాసనసభ సమావేశాల్లోను,అనేక కార్యక్రమాల్లో ఆప్కో ద్వారా దుకాణాలు ఏర్పాటు చేయించి, వస్త్రాలను అమ్మకాలు జరపడం తద్వారా చేనేత వస్త్రాల ధరింపు ఆవశ్యకతను తెలిపిన మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బడ్జెట్ సమావేశాల సందర్భంగా అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అనంతపురం జిల్లా కేంద్రంలో టెక్స్ టైల్ పార్కును ఏర్పాటుకు కృషి చేయాలని, కూటమి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందని తెలిపారు. రాష్ట్రంలో చేనేత వృత్తిపైన ఆధారపడినటువంటి కుటుంబాలకు ఉచిత విద్యుత్తును అందించడం వారి జీవితాల్లో చీకటిని దూరం చేసి వెలుగును నింపినందుకు చేనేత కుటుంబాలు కూటమి ప్రభుత్వానికి,నారా చంద్రబాబు నాయుడు, నారా లోకేష్,పరిటాల సునీత గారికి ధన్యవాదాలు తెలియజేయడం ఆనందాన్నిచ్చిందని పోతుల లక్ష్మీనరసింహులు అన్నారు. ఈ కార్యక్రమంలో సిండికేట్ నగర్ తెలుగుదేశం పార్టీ నాయకులు పుత్త ఎర్రిస్వామి హాజరయ్యారు.

# మైదుకూరులో అభివృద్ధి పనులకు శ్రీకారం

## కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్

మైదుకూరు (చైతన్యరథం): ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ మైదుకూరు మున్సిపాలిటీలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డు శ్రీరామ్ నగర్‌లో సిమెంట్ రోడ్డుకు భూమి పూజ నిర్వహించారు. రూ. 15 లక్షల నిధులతో రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సిండికేట్ సొసైటీ చైర్మన్ పాశం మారుతి టెంకాయ కొట్టి పనులను ప్రారంభించారు. రోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు ఎమ్మెల్యే సుధాకర్ యాదవ్ సూచించారు. అలాగే స్థానిక ప్రజలు రోడ్లు మరియు డ్రైనేజీ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ సంబంధిత వీధులను పరిశీలించి, రోడ్లు డ్రైనేజీ పనులను తక్షణమే మంజూరు చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్‌ను స్థానిక టీడీపీ నాయకులు శాలువాలు, పూలమాలతో ఘనంగా సత్కరించారు. సొసైటీ చైర్మన్ మారుతి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. పట్టణ అధ్యక్షుడు దాసరి బాబు, మార్కెట్ యార్డ్ చైర్మన్ ఏపీ రవీంద్ర, టీడీపీ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధనపాల జగన్, మున్సిపల్ కమిషనర్ రంగస్వామి, ఏఈ నిరంజన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



జోన్-5

(నంద్యాల, కర్నూలు, హిందూపురం, అనంతపురం, కడప)

చైతన్యరథం

# అన్ని ప్రాంతాల అభివృద్ధి సీఎం చంద్రబాబుతోనే సాధ్యం

## ఎమ్మెల్యే పరిటాల సునీత, ఉత్తరాంధ్ర మాదిరిగా రాయలసీమలోనూ భారీ పరిశ్రమలు రావాలని ఆకాంక్ష



రాప్తాడు, (చైతన్యరథం): ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే అన్ని ప్రాంతాల అభివృద్ధి సాధ్యమని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. అనకాపల్లి జిల్లాలో ఆర్సెలార్ మిట్టల్, నిప్పాన్ స్టీల్ సంయుక్తంగా ఏర్పాటు చేస్తున్న భారీ స్టీల్ ప్లాంట్‌కు శంకుస్థాపన జరగడంపై ఆమె హర్షం వ్యక్తం చేశారు. ప్రపంచంలోనే ప్రఖ్యాత సంస్థలు ఏపీకి రావడం ఇక్కడి పారిశ్రామిక ప్రగతిని సూచిస్తోందని ఆమె అభిప్రాయపడ్డారు. దేశంలోనే అతిపెద్ద గ్రీన్ ఫీల్డ్ స్టీల్ ప్రాజెక్టులలో ఒకటైన ఈ ప్రాజెక్ట్ సుమారు రూ.1,35,964 కోట్లకు పైగా పెట్టుబడితో అతిపెద్ద ఉక్కు కర్మాగారాన్ని నిర్మించబోతుండటం రాష్ట్రానికే గర్వ కారణమన్నారు. దీని వలన లక్షకు పైగా ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగ అవకాశాలు వచ్చే అవకాశం ఉందన్నారు. వెనుకబడిన ఉత్తరాంధ్రలో యువతకు భారీ స్థాయిలో ఉపాధి లభిస్తుందన్నారు. ఈ ప్రాజెక్టు రాకతో ఉత్తరాంధ్ర ఇండస్ట్రియల్ హబ్‌గా అభివృద్ధి చెందుతోంది. పోర్ట్ కనెక్టివిటీ, రహదారి, రైల్వే సదుపాయాలు మెరుగుపడి లాజిస్టిక్స్ రంగం బలోపేతం అవుతుందన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఎవరైనా రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలంటేనే భయపడే పరిస్థితి ఉండేదన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ చొరవతో పెద్ద ఎత్తున పరిశ్రమలు వస్తున్నాయన్నారు. ప్రపంచ స్థాయి కంపెనీలు ఆంధ్రప్రదేశ్ వైపు చూస్తున్నాయంటే అది వారిద్దరి కృషి వలనేనన్నారు. మరోవైపు రాయలసీమ ప్రాంతంలో కూడా ఇలాంటి పరిశ్రమలు తీసుకొస్తే.. మా ప్రాంత యువతకు ప్రయోజనం కల్గుతుందన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో కియా లాంటి పరిశ్రమలు స్థాపించారని.. ఇప్పుడు కూడా అలాంటి అంతర్జాతీయ కంపెనీలను తీసుకుని రావాలని ఎమ్మెల్యే సునీత ముఖ్యమంత్రి చంద్రబాబును కోరారు.

# రైతు బాంధవుడు ముఖ్యమంత్రి చంద్రబాబు

## గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం



గుంతకల్లు (చైతన్యరథం): గుత్తి మండలం బాచుపల్లి గ్రామంలో గుంతకల్లు నియోజకవర్గం ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం ఇటీవల అన్నదాత సుఖీభవ పథకం కింద మూడో విడత 6000 రైతన్నల ఖాతాలో జమ చేసినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు బుధవారం రైతన్న మీకోసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు రైతన్నల ఖాతాలో సంవత్సరానికి 20 వేల రూపాయలు ఇచ్చి ఆదుకుంటానని హామీ ఇచ్చారని, ఇచ్చిన మాట ప్రకారమే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మూడు విడతలగా 20 వేల రూపాయలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి రైతన్నల ఖాతాలో జమ జరిగిందన్నారు. ఈ సందర్భంగా రైతన్నల కష్టాలను నేరుగా తెలుసుకునేందుకు నారా చంద్రబాబు రైతుల వద్దకు వెళ్లాలని సూచించడంతో గ్రామానికి వచ్చామన్నారు. ఏ సమస్యలున్నా తమ దృష్టికి తీసుకువస్తే కచ్చితంగా పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గుత్తి మండల, పట్టణ కూటమి నాయకులు కార్యకర్తలు గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# మంత్రి నారా లోకేష్ కృషితో ఆర్టీటీ ఎఫ్‌సీఆర్ఏ పునరుద్ధరణ

## శ్రీరామ నవమి కానుక దక్కిందన్న అనంత ఎమ్మెల్యేలు

ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏ రెన్యూవల్ సమస్య 2022లోనే వచ్చిందని ఆ రోజే వైసీపీ నాయకులు సరిగా స్పందించి ఉంటే సమస్య ఇంత దూరం వచ్చేది కాదని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ విమర్శలు చేశారు. రెన్యూవల్ కావడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ప్రభుత్వ విప్, రాయదుర్గం ఎమ్మెల్యే కాలువ శ్రీనివాసులు, సత్యసాయి జిల్లా అధ్యక్షుడు, మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబులతో కలిసి ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ ఆర్డీటీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా సేవలందిస్తున్న సంస్థ అన్నారు. అత్యంత వెనుకబడిన అనంతపురం జిల్లాలో విద్య, వైద్యం, వ్యవసాయం, గృహ నిర్మాణాలు, క్రీడల్లో అనేక సేవలందించారన్నారు. విన్సెంట్ ఫెర్రర్ దగ్గర నుంచి మాంఛో ఫెర్రర్ వరకు వారు చేసిన కార్యక్రమాలు వెలకట్టలేనివన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నుంచే ఆర్డిటికీ నిధులు రాకుండా ఆగిపోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. కానీ వారు ఏ రోజు దీని గురించి పట్టించుకోలేదన్నారు. ఈ 20 నెలల కాలంలో జిల్లా ఎమ్మెల్యేలు రాష్ట్రంలో ఎంపీలు ప్రత్యేకంగా చొరవ తీసుకుని కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడారన్నారు. ఇటీవల జిల్లాకు వచ్చిన సమయంలో మంత్రి నారా లోకేష్ ప్రత్యేకంగా ఒక హామీ ఇచ్చారన్నారు. ఇచ్చిన హామీ మేరకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, హోం మంత్రి అమిత్ షాతో మాట్లాడి రెన్యూవల్ చేయించారన్నారు. మరో ఐదేళ్లపాటు విదేశీ నిధులు రావడానికి ఎలాంటి ఆటంకాలు ఉండవన్నారు. ఆర్డిటి సేవలు యధావిధిగా కొనసాగుతాయన్నారు. వైసిపి నేతలు కేవలం జిల్లాలో పాదయాత్రలు నిరసనలు అంటూ షో చేశారు కానీ.. అవి జిల్లా దాటి కూడా పోలేదన్నారు. మంత్రి నారా లోకేష్ చొరవ వలనే సాధ్యమైందన్నారు. కేంద్ర ప్రభుత్వ ఇచ్చిన శ్రీరామ నవమి కానుకగా భావిస్తున్నామని పేర్కొన్నారు.



ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు ఆధ్వర్యంలో సంబరాలు

# సీఎం సీబీఎన్ దూరదృష్టితోనే ఎడారి భూములకు కృష్ణా జలాలు

## పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి వెల్లడి, ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏ క్లియరెన్స్‌పై హర్షం



బుక్కపట్నం (చైతన్యరథం): ముఖ్యమంత్రి చంద్రబాబు దూర దృష్టితో ఎడారి ప్రాంతాల్లో హంద్రీనీవా ద్వారా కృష్ణా జలాలు పారుతున్నాయని పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పేర్కొన్నారు. కరువు ప్రాంతమైన రాయలసీమ జిల్లాల్లో హంద్రీ నీవా కాలువ ద్వారా కృష్ణా జలాలు తీసుకొచ్చి చెరువులను నింపిన చరిత్ర కూటమి ప్రభుత్వానిదన్నారు. పుట్టపర్తి నియోజవర్గంలోని బుక్కపట్నం మండలం మారాల, సీకాయ కుంటపల్లి, కృష్ణాపురం గ్రామాల్లో ఇంటింటా పర్యటించి కూటం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను కరపత్రాలు ద్వారా ప్రజలకు తెలియజేశారు .రైతు బాంధవుడు ముఖ్యమంత్రి చంద్రబాబు అని అభివర్ణించారు. వెనుకబడిన కరువు ప్రాంతంలో కృష్ణా జలాలు పారడంతో ఎడారి బీడు భూముల్లో బంగారు పంటలు సాగై ఆ పొలాలన్నీ పచ్చగా కళకళలాడుతున్నాయని తెలిపారు. రైతును ఆదుకోవడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు. ప్రతి రైతుకు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా ఏడాదికి రూ.20వేలు రూపాయలు రైతు ఖాతాలో జమ చేసినట్లు తెలిపారు. ప్రతి ఇంటికి సంక్షేమ పథకాల ద్వారా ఒక కుటుంబానికి లక్ష నుంచి 1,50,000 వరకు సంక్షేమ లబ్ధి చేకూర్చినట్లు ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి వెల్లడించారు. ఉమ్మడి జిల్లాలో పేదలకు సేవ చేస్తున్న ఆర్డీటీ సంస్థకు కేంద్ర ప్రభుత్వం ద్వారా ఎఫ్‌సీఆర్ఏ మంజూరయ్యేలా ప్రత్యేక కృషిచేసిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు, మంత్రి నారా లోకేష్ బాబుకు, కేంద్ర ప్రభుత్వ పెద్దలకు పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మారాలలో స్వచ్ఛ రథాన్ని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు.

### పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ

ఆస్తి ప్రజల హక్కు అని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పేర్కొన్నారు. కృష్ణాపురం గ్రామంలో రెవిన్యూ శాఖ ఆధ్వర్యంలో రైతులకు ప్రభుత్వ రాజ ముద్రకలిగిన పట్టాదారు పాసు పుస్తకాలను ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, ఆర్డీవో సువర్ణ చేతుల మీదుగా 584 మంది రైతులకు పంపిణీ చేశారు. గత ప్రభుత్వ హయాంలో వైసిపి పెద్దల ఫోటోలను రైతుల పాస్ పుస్తకాలపై ముద్రించుకున్నారని గుర్తు చేశారు. మన ఆస్తిపై ఇతర పోటోలు కాకుండా మన ఆస్తి మనకే హక్కు ఉంటుందని ఇతరులకు ఎలాంటి హక్కులు ఉండవన్నారు. ఈ విషయాన్ని ప్రతి ఒక్కరు గుర్తుపెట్టుకుని,ఆస్తి మన హక్కు అని అన్ని హక్కులు కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును జీవితాంతం మనం గుర్తు పెట్టుకోవాలని కోరారు. అనంతరం కృష్ణాపురం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం తో ఖాసింబి కుటుంబానికి 5 లక్షల ప్రమాద బీమాను ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి చేతులమీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో బుక్కపట్నం మండల టీడీపీ కన్వీనర్ మల్లిరెడ్డి, కృష్ణాపురం సహకార సంఘం అధ్యక్షులు అప్ప స్వామి నాయుడు, గంగాధం, అంజనప్ప,రామానాయుడు, హరి, కిష్టప్ప, దుర్గమప్ప, సూరి, తిప్పన్న, నారాయణస్వామి, రవీంద్ర, సాయి వ్యవసాయాధికారి నటరాజ్, సచివాలయ సిబ్బంది కూటమి పార్టీల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మిల్‌పిటాస్‌లో వెల్లివిరిసిన తెలుగు సంస్కృతి

## బే ఏరియాలో అంబరాన్నంటిన సంబరాలు




**మిల్‌పిటాస్, కాలిఫోర్నియా:** బే ఏరియా తెలుగు అసోసియేషన్ (BATA) తన ప్రతిష్టాత్మక వార్షిక ఉగాది వేడుకలను మార్చి 21న మిల్‌పిటాస్‌లోని ఇండియా కమ్యూనిటీ సెంటర్‌లో అత్యంత వైభవంగా నిర్వహించింది. ఉదయం 9 గంటలకు గంటలకు ప్రారంభమై రాత్రి పది గంటల వరకు కొనసాగిన ఉత్సవాల్లో బే ఏరియా నలుమూలల నుంచి వచ్చిన తెలుగువారు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అతిథులకు సంప్రదాయబద్ధంగా ఉగాది పచ్చడి వడ్డించి, పండుగ విశిష్టతను, సంస్కృతిని చాటిచెప్పారు.

**యువతరం ప్రతిభకు వేదికగా 25వ వార్షిక పోటీలు**

ఈ ఏడాది 'బాటా' యువజన టాలెంట్ పోటీలకు సంబంధించి 25వ వార్షికోత్సవం కావడం ఒక ప్రత్యేక మైలురాయిగా నిలిచింది. పగటిపూట జరిగిన కార్యక్రమంలో టాలీవుడ్, క్లాసికల్, జానపద విభాగాల్లో గానం, నృత్యం పోటీలు నిర్వహించారు. సుమారు 600 మందికి పైగా చిన్నారులు, యువకులు ప్రతిభ కనబరిచారు. పెరుగుతున్న రద్దీ ఉత్సాహాన్ని దృష్టిలో ఉంచుకుని వేదిక వద్ద ఉన్న వివిధ గదులను కేటాయించి పోటీలను సమర్ధవంతంగా నిర్వహించారు. ప్రాంగణమంతా రంగురంగుల దుస్తులతో కళకళలాడింది.

**90వ దశకపు సినీ స్వర్ణయుగం థీమ్‌తో..**

సాయంత్రం జరిగిన ప్రధాన సాంస్కృతిక కార్యక్రమం 1990వ దశకపు తెలుగు సినిమా స్వర్ణయుగం థీమ్‌తో సాగింది. ఐదేళ్ల చిన్నారుల నుంచి పెద్దల వరకు అందరూ ఉత్సాహంగా పాల్గొని 90 నాటి తెలుగు సినీ వైభవాన్ని కళ్లకు కట్టారు. 'బాటా' టీం సభ్యులు వివిధ ప్రాంతాల్లో శిక్షణ ఇచ్చి ఈ ప్రదర్శనలను అద్భుతంగా తీర్చిదిద్దారు.

కార్యక్రమానికి ముగింపుగా ప్రముఖ టాలీవుడ్ ప్లేబ్యాక్ సింగర్ అంజనా సౌమ్య తన మధురమైన గొంతుతో శ్రోతలను అలరించారు.

**విశిష్ట అతిథుల ప్రసంగాలు**

ఈ వేడుకలకు శాన్‌ఫ్రాన్సిస్కోలోని భారత కాన్సులేట్ జనరల్ నుంచి అభిషేక్ శర్మ ముఖ్య అతిథిగా విచ్చేశారు. తెలుగు భాష, సంస్కృతిని విదేశాల్లో కాపాడుతున్న 'బాటా కృషిని ఆయన అభినందించారు. అలాగే శాంటా క్లారా కౌంటీ డిస్ట్రిక్ట్ అటార్నీ జెఫ్ రోసెన్, ఫ్రీమాంట్ సిటీ మేయర్ రాజ్ సల్వాన్, మిల్‌పిటాస్ సిటీ మేయర్ కార్మెన్ మోంటానో ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు.

ఇమ్మిగ్రేషన్ అంశాలపై ప్రత్యేక సెషన్లు నిర్వహించారు. న్యాయ నిపుణులు నవదీప్ తూర్ మీంబర్, మనోహర్ టి రెడ్డి, కల్పన వి పెద్దిభొట్ల, కోమే విశాకన్ ప్రొఫెషనల్స్ కుటుంబాలకు అవసరమైన అప్‌డేట్స్ ఇచ్చారు.

**దాతల సహకారం... వాణిజ్య ప్రదర్శనలు**

సంజీవ్ గుప్తా సీపీఏ గ్రాండ్ స్పాన్సర్‌గా, రియల్టర్ నాగరాజ్ అన్నయ్య "పవర్డ్ బై" స్పాన్సర్‌గా, శ్రీని గోలి రియల్ ఎస్టేట్స్ గోల్డ్ స్పాన్సర్‌గా వ్యవహరించారు. ఇంకా ఇన్నా సర్వీస్, పీఎన్జీ జ్యువెలర్స్, అపెక్స్ కన్సల్టింగ్, కావ్య ఫుడ్స్, పాఠశాల శ్రీస్ కిచెన్ వంటి సంస్థలు మద్దతు తెలిపాయి. ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్టాళ్లలో దుస్తులు, నగలు, పెట్టుబడులు రియల్ ఎస్టేట్ సేవలకు విశేష స్పందన లభించింది.

కార్యక్రమం విజయవంతం కావడంపై 'బాటా' ప్రెసిడెంట్ శివ కె హర్షం వ్యక్తం చేస్తూ దాతలకు, వాలంటీర్లకు, కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. 'బాటా' కార్యవర్గ సభ్యులు వరుణ్, హరి ఎస్, సందీప్ కె, సంకేత్ వివిధ కమిటీల సభ్యులు శ్రీదేవి పసుపులేటి, శ్రీలు వెలిగేటి, శిరీష బట్టుల, తారక దీప్తి, కిరణ్ విన్నకోట, సురేష్ శివపురం, రవి పోచిరాజు, హరీష్ ఇనంపూడి, సుధాకర్ బైరి, ఉదయ్, గౌతమి, సింధు, కళ్యాణి, కృష్ణ ప్రియ, దీప్తి, స్రవంతి తదితరులు పాల్గొన్నారు. స్టీరింగ్ కమిటీ అడ్వైజరీ బోర్డు సభ్యులు జయరామ్ కోమటి, విజయ ఆసూరి, వీరు వుప్పల, ప్రసాద్ మంగిన, కరుణ్ వెలిగేటి, రమేష్ కొండ, కళ్యాణ్ కట్టమూరి హరినాథ్ చికోటి బృందాన్ని అభినందించారు.

---

### షార్లెట్ వేదికగా...

# టీఏజీసీఏ ఎన్నికల సందడి

## నూతన బాధ్యతలు చేపట్టిన దిలీప్ తోటకూరి కార్యవర్గం



**షార్లెట్:** అమెరికాలోని నార్త్ కరోలినాలో ప్రముఖ తెలుగు సంస్థ 'తెలుగు అసోసియేషన్ ఆఫ్ గ్రేటర్ షార్లెట్ ఏరియా' (TAGCA) 2026-2028కి నూతన కార్యవర్గాన్ని ప్రకటించింది. సంస్థ అభివృద్ధిని కాంక్షిస్తూ, సేవా దృక్పథంతో పనిచేసే నిపుణులైన సభ్యులను ఎగ్జిక్యూటివ్ కమిటీ, బోర్డ్ ఆఫ్ ట్రస్టీలుగా ఎంపిక చేసినట్టు సంస్థ వెల్లడించింది.

**నూతన కార్యవర్గ సభ్యులు వీరే...**

అధ్యక్షుడు: దిలీప్ తోటకూరి
ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్: రంగనాథ్ వీరమాచనేని
జనరల్ సెక్రటరీ: సత్య వేమూరు
జాయింట్ సెక్రటరీ: రమేష్ ముకుళ్ళ
ట్రెజరర్: శశి మజ్జి
జాయింట్ ట్రెజరర్: సురేష్ బొడ్ల
స్పోర్ట్స్ సెక్రటరీ: కల్యాణి చలసాని
మహిళా సేవా కార్యదర్శి: కల్యాణి పుల్లేటి
క్రీడా కార్యదర్శి: రఘు అల్లూరి
కమ్యూనిటీ సర్వీసెస్ సెక్రటరీ: సురేంద్ర యలవర్తి
పబ్లిక్ రిలేషన్స్ సెక్రటరీ: దిలీప్ వడపల్లి
బోర్డ్ ఆఫ్ ట్రస్టీలు: సాయిరామ్ కావూరి, డాక్టర్ గీతా డి వల్లభనేని.

నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు షార్లెట్ ప్రాంత తెలుగు ప్రజలు, సంస్థ సభ్యులు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. రాబోయే రెండేళ్ల కాలంలో నూతన సారథుల నాయకత్వంలో సంస్థ మరిన్ని విజయాలు సాధించాలని, తెలుగు కమ్యూనిటీకి మెరుగైన సేవలు అందించాలని వారు ఆకాంక్షించారు. బాధ్యతలు స్వీకరించిన ప్రతి సభ్యుడు అంకితభావంతో పనిచేసి సంస్థ గౌరవాన్ని మరింత పెంచాలని ఆశిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

---




# భారత్-అమెరికా జోడీ విజయబావుటా

## క్యూబా గిరాల్డిల్లా బ్యాడ్మింటన్ టోర్నీలో స్వర్ణ పతకం కైవసం

**హవానా (క్యూబా):** అంతర్జాతీయ బ్యాడ్మింటన్ రంగంలో అట్లాంటాకు చెందిన ఫోర్టియస్ స్పోర్ట్స్ అకాడమీ క్రీడాకారులు సరికొత్త చరిత్ర సృష్టించారు. క్యూబా రాజధాని హవానాలో జరిగిన XXIV ఇంటర్నేషనల్ గిరాల్డిల్లా BWF ఫ్యూచర్ సిరీస్-2026లో పురుషుల డబుల్స్ విభాగంలో భారత్-అమెరికన్ జంట కతీరవన్ కాంచీపురం మణివన్నన్, ముకిల్ నంబికుమార్ బంగారు పతకం సాధించి అగ్రస్థానంలో నిలిచారు.

**ఉత్కంఠభరిత పోరు... అద్భుత విజయం**

ఫైనల్ మ్యాచ్ ఆద్యంతం ఉత్కంఠగా సాగింది. ఎల్ సాల్వడార్‌కు చెందిన ప్రపంచ స్థాయి క్రీడాకారులు ఉరియల్ ఫ్రాన్సిస్కో (ప్రపంచ ర్యాంక్ 135), మాన్యుయెల్ మెజియా (ప్రపంచ ర్యాంక్ 380)లతో తలపడిన ఫోర్టియస్ ద్వయం అసాధారణ పోరాట పటిమ కనబరిచింది.

తొలి సెట్: 13-21 (ప్రత్యర్థి ఆధిపత్యం)

రెండో సెట్: 25-23 (నువ్వా నేనా అన్నట్టు సాగిన పోరులో ఫోర్టియస్ జంట విజయం)

నిర్ణయాత్మక మూడో సెట్: 21-10 (ఏకపక్షంగా సాగిన పోరులో ఫోర్టియస్ ఘన విజయం)

మొదటి సెట్ కోల్పోయినప్పటికీ ఒత్తిడిని అధిగమించి వరుసగా రెండు సెట్లు గెలుచుకోవడం వీరి మానసిక దృఢత్వానికి నిదర్శనమని క్రీడా విశ్లేషకులు ప్రశంసించారు.

**విజయం వెనుక 'ఫోర్టియస్' కృషి**

ఈ అంతర్జాతీయ విజయం వెనుక ఫోర్టియస్ స్పోర్ట్స్ అకాడమీ కోచింగ్ బృందం (హెమార్డ్ హంబ్లర్స్, సంజీత్, డేనియల్ హంబ్లర్స్, విన్ న్గుయెన్) కృషి ఎంతో ఉంది. అత్యాధునిక సాంకేతిక శిక్షణ, మ్యాచ్ అనలిటిక్స్, ఫిట్‌నెస్ ప్రోగ్రామ్ ఈ అథ్లెట్లను ప్రపంచ స్థాయి విజేతలుగా తీర్చిదిద్దాయి. అమెరికా బ్యాడ్మింటన్ ఖ్యాతిని గ్లోబల్ స్టేజ్‌పై నిలబెట్టిన కతీరవన్, ముకిల్‌లను ఫోర్టియస్ మేనేజ్‌మెంట్ అభినందించింది.





---

### విద్యార్థుల భవితకు

# 'టామా' భరోసా

## జడ్జి నీరా బాల్ సమక్షంలో 28న లీడర్‌షిప్ వర్క్‌షాప్

**అట్లాంటా:** తెలుగు అసోసియేషన్ ఆఫ్ మెట్రో అట్లాంటా (TAMA) 45 ఏళ్ల వేడుకల సందర్భంగా హైస్కూల్ విద్యార్థుల కోసం "యూత్ లీడర్‌షిప్ అన్‌ప్లగ్డ్" అనే వినూత్న కార్యక్రమం నిర్వహిస్తోంది. విద్యార్థులు వివిధ రంగాల్లోని నాయకుల నుంచి స్ఫూర్తి పొందేందుకు ఈ వేదికను సిద్ధం చేశారు.



**ముఖ్య అతిథులు:**

ఈ సెషన్‌లో జార్జియా స్టేట్ బోర్డ్ ఆఫ్ వర్కర్స్ కాంపెన్సేషన్ డైరెక్టర్, అప్పీలేట్ జడ్జి నీరా బాల్ ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు మార్గనిర్దేశం చేయను న్నారు. హవిష్మత్ ఆర్య (UGA లా స్టూడెంట్), హరి చావ్లా (ఫ్యూయల్ డాడీ కో-ఫౌండర్) వారి అనుభవాలను పంచుకుంటారు. బెబో పొట్నూరి మోడరేటర్‌గా వ్యవహరిస్తారు.

**నిర్వాహక బృందం:**

ఈ కార్యక్రమం విజయవంతానికి 'టామా' ప్రెసిడెంట్ సునీత పొట్నూరి, చైర్మన్ మధుకర్ యార్లగడ్డ నేతృత్వంలో కింది సభ్యులు కృషి చేస్తున్నారు.

తిరు చిల్లపల్లి, సునీల్ దేవరపల్లి, సత్య నాగేందర్ గుత్తుల, కృష్ణ ఇనపాకుతిక, చలమయ్య బచ్చు, ముఖర్జీ వేములపల్లి, శ్రీనివాస్ రామనాథం, పార్వతి కొంపెల్ల, శేఖర్ కొల్లు, చైతన్య కొర్రపాటి, నరేంద్రబాబు నల్లూరి. ప్రియ బాలుసు, వెంకట్ తెరాల, నగేష్ దొడ్డక, రాఘవ తడవర్తి, రామ్‌కి చౌదరపు, సాయిరామ్ కరుమంచి, సురేష్ యాదగిరి, వెంకట్ మేసాల, యశ్వంత్ జొన్నలగడ్డ, హరికృష్ణ అద్దంకి.

**కార్యక్రమ వివరాలు:**

తేదీ: మార్చి 28, శనివారం

సమయం: ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు

వేదిక: గ్లోబల్ అకాడమీ, 1675 పీచ్‌ట్రీ పార్క్‌వే, కమ్మింగ్, జార్జియా.

పరిమిత సీట్లు మాత్రమే ఉన్నందున ఆసక్తి గలవారు వెంటనే రిజిస్టర్ చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. మరిన్ని వివరాలకు info@tama.orgకు ఈ-మెయిల్ చేయవచ్చు.








# అక్షర విన్యాసం

## 'తానా-పాఠశాల' ఆధ్వర్యంలో అప్రతిహత తెలుగు భాషా యజ్ఞం

- 8 గంటల పాటు నిరంతరాయంగా 'మయూఖ తంత్రులు' కార్యక్రమం
- వంద మంది చిన్నారుల అద్భుత ప్రదర్శన
- ఉగాది వేళ ప్రతిధ్వనించిన తెలుగు పదకోశం
- వీక్షించి పులకించిన ప్రవాస భారతీయులు

**అట్లాంటా:** పరాయి దేశంలో మాతృ భాష పరిమళాలను వెదజల్లుతూ తెలుగు సంస్కృతిని భావి తరాలకు వారసత్వంగా అందించేందుకు ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) అనుబంధ సంస్థ 'పాఠశాల' సరికొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టింది. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్వహించిన 'మయూఖ తంత్రులు' కార్యక్రమంలో భాగంగా సుమారు 100 మంది విద్యార్థులు ఎనిమిది గంటల పాటు నిరంతరాయంగా తెలుగు భాషా విన్యాసాలతో అలరించారు.

**భాషపై మమకారం.. సంస్కృతికి ప్రాణం**

ఉదయం 9 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ఈ కార్యక్రమం అప్రతిహతంగా సాగింది. అమెరికా వ్యాప్తంగా ఉన్న వందలాది మంది ప్రవాస భారతీయుల పిల్లలకు తెలుగు నేర్పిస్తున్న 'పాఠశాల', మన యువతే మన వారసత్వ సంపద అని చాటిచెప్పింది. "తేనెలొలుకు తెలుగు మన మాతృ భాష.. దీనిని రేపటి తరం కోసం ఒక సజీవ ఆస్తిగా, గర్వించదగ్గ అస్తిత్వంగా నిలబెట్టుకుందాం" అని ఉపాధ్యాయులు పిలుపునిచ్చారు.

**ముఖ్య అతిథుల ప్రశంసల జల్లు:**

ఈ కార్యక్రమంలో పద్మభూషణ్ పురస్కార గ్రహీత, తానా మాజీ అధ్యక్షుడు, ప్రపంచ సాహిత్య వేదిక నిర్వాహకులు డాక్టర్ తోటకూర ప్రసాద్, ప్రస్తుత అధ్యక్షుడు నరేన్ కొడాలి, కోశాధికారి రాజా కసుకుర్తి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. మాతృ భాషపై మమకారంతో విదేశీ గడ్డపై తెలుగు వెలుగులు పంచుతున్న 'పాఠశాల' ప్రతినిధులను, విద్యార్థుల తల్లిదండ్రులను వారు ప్రత్యేకంగా అభినందించారు.

'పాఠశాల' అధ్యక్షుడు భానుప్రకాష్ మాగులూరి మాట్లాడుతూ.. ఇలాంటి కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తూ భావి తరాలకు తెలుగు భాషను శాశ్వత ఆస్తిగా అందిస్తామని ధీమా వ్యక్తం చేశారు.

నిర్వాహకులు ప్రసాద్ మంగిన, అమృత ముత్యాల, శ్రీరంజని శెట్టులూరు, రంజిత ఆదిమూలం, శేఖర్‌చంద్ర సమన్వయంతో ఈ కార్యక్రమ విజయవంతంలో కీలక పాత్ర పోషించారు. వందలాది మంది తల్లిదండ్రులు ఈ వేడుకను వీక్షించి చిన్నారుల ప్రతిభను చూసి పులకించిపోయారు.

## సంక్షోభ సమయాన...

# ఏపీఎన్ఆర్టీఎస్ ఆపన్నహస్తం

- కువైట్ నుంచి స్వగ్రామానికి శంకరయ్య పార్థివదేహం
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వానికి, 'ఏపీఎన్ఆర్టీఎస్' రాయబారి సురేష్‌బాబునాయుడికి కృతజ్ఞతలు తెలిపిన మృతుడి భార్య భవాని

తిరుపతి (చైతన్యరథం): ఉపాధి కోసం సుదూర తీరాలకు వెళ్లి అనారోగ్యంతో కన్నుమూసిన ఒక సామాన్య కార్మికుడి మృతదేహం అంతర్జాతీయ ఉద్రిక్తతల నడుమ చిక్కుకుపోయిన వేళ... ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ఏపీఎన్ఆర్టీఎస్ భగీరథ ప్రయత్నం చేసి స్వదేశానికి తీసుకువచ్చాయి. తిరుపతికి చెందిన బతుల శంకరయ్య పార్థివదేహం ఎట్టకేలకు ఆయన స్వగ్రామానికి చేరుకోగా కుటుంబ సభ్యులు కన్నీటి వీడ్కోలు పలికారు.

తిరుపతిలో ఏపీఐఐసీలో పనిచేస్తున్న ఎస్.భవాని భర్త శంకరయ్య కువైట్‌లో స్థిరపడ్డాడు. తొమ్మిదేళ్లుగా అక్కడే ఉంటున్న ఆయన ఈ నెల 12వ తేదీన ఆకస్మికంగా మరణించడంతో అతడి కుటుంబం తీవ్ర దిగ్భ్రాంతికి గురైంది. అయితే ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య యుద్ధ వాతావరణం నెలకొనడం, విమాన సర్వీసులు రద్దు కావడంతో శంకరయ్య భౌతికకాయాన్ని భారత్‌కు తీసుకురావడం అసాధ్యంగా మారింది.

ఏపీఎన్ఆర్టీ రాయబారి సురేష్‌బాబునాయుడు 'అక్షర' సాయం: డీఆర్వో మార్గదర్శకత్వంలో భవాని పంపిన మెయిల్‌కు ఏపీఎన్ఆర్టీఎస్ తక్షణం స్పందించింది. కువైట్‌లోని ఏపీఎన్ఆర్టీఎస్ రాయబారి మాలేపాటి సురేష్ బాబునాయుడు స్వయంగా రంగంలోకి దిగారు. కువైట్ రాయబార కార్యాలయం, ఉన్నతాధికారులతో నిరంతరం సమన్వయం చేసుకున్నారు. యుద్ధప్రాతిపదికన పత్రాల ప్రక్రియను పూర్తి చేసి, కువైట్ నుంచి ఢిల్లీ, చెన్నైలకు విమాన టిక్కెట్లు, అక్కడి నుంచి స్వగ్రామానికి అంబులెన్స్ సౌకర్యం ఏర్పాటు చేశారు.

కృతజ్ఞతలతో కూడిన వీడ్కోలు:

అధికారుల అచంచలమైన కృషి ఫలితంగా ఈ నెల 21వ తేదీన శంకరయ్య అంత్యక్రియలు మత సంప్రదాయాల ప్రకారం గౌరవంగా ముగిశాయి. ఈ సందర్భంగా భార్య భవాని మాట్లాడుతూ... "నా భర్తను చివరిసారిగా చూసుకునే భాగ్యం కల్పించిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం, భారత విమానయాన మంత్రిత్వ శాఖ, ఏపీఎన్ఆర్టీఎస్‌కి నేను ఎప్పటికీ రుణపడి ఉంటాను" అని భావోద్వేగంతో తెలిపారు. ప్రత్యేకించి మాలేపాటి సురేష్‌బాబునాయుడు చూపిన మానవత్వానికి ఆమె శిరస్సు వంచి ధన్యవాదాలు తెలియజేశారు.




## 'బాటా' ఉగాది వేడుకల్లో

# ప్రవాసాంధ్రుల సందడి






భాష ఏదైనా... ప్రాంతం ఏదైనా... తెలుగువారి గుండె చప్పుడు ఒక్కటేనన్నారు. ఖండాంతరాల్లో ఉన్నా కన్నతల్లిని, మాతృ భాషను మరువలేమన్నారు. వారే అమెరికాలోని కాలిఫోర్నియాలో ఉంటున్న ప్రవాసాంధ్రులు. మిల్‌పిటాస్ వేదికగా 'బే ఏరియా తెలుగు అసోసియేషన్ (బాటా) నిర్వహించిన ఉగాది వేడుకలు తెలుగువారి ఆత్మీయతకు, సంస్కృతికి అద్దంపట్టాయి. తెలుగు సంస్కృతీ సౌరభాలను వెదజల్లాయి. 90వ దశకపు సినీ మధురిమలు, చిన్నారుల కళా ప్రదర్శనలు ఆహుతులను పరవశింపజేశాయి.



# కేరళ ఎన్నికలపై పశ్చిమాసియా నీడలు



## ఫలితాలను తారుమారు చేయనున్న యుద్ధం

పశ్చిమాసియా ఉద్రిక్తతలు చమురు ధరల పైనే కాదు.. కొన్ని వారాల్లో మన దేశంలో జరగనున్న ఎన్నికల పైనా ప్రభావం చూపనున్నాయి. మరీ ముఖ్యంగా కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో ఆ ఎఫెక్ట్ భారీగా కనిపించేలా ఉంది. మొత్తంగా ఫలితాన్నే మార్చే అవకాశం లేకపోయినా... కొన్ని ప్రాంతాల్లో గెలుపోటములను నిర్దేశించొచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఏప్రిల్ 9న కేరళ అసెంబ్లీకి ఎన్నికలు జరగనున్నాయి. ఆ రాష్ట్ర వాసులు పశ్చిమాసియా దేశాలకు ఉపాధి నిమిత్తం భారీగా వెళ్తుంటారు. కేరళ మైగ్రేషన్ సర్వే తాజా గణాంకాల ప్రకారం.. గల్ఫ్ ప్రాంతంలో ఉన్న కేరళ వాసుల సంఖ్య సుమారు 22 లక్షలు తమ ఓటుహక్కును వినియోగించుకునేందుకు ఎన్నికల సమయంలో యూఏఈ, సౌదీ అరేబియా, కువైట్ సహా ఆయా దేశాల నుంచి స్వరాష్ట్రానికి తిరిగివస్తుంటారు. ఇలాంటి సమయంలో కొన్ని ప్రవాస గ్రూపులు వీరి కోసం ప్రత్యేకంగా ఛార్టర్డ్ విమానాలు నడుపుతుంటాయి. ఈసారి ఎన్నికలు, ఈస్టర్, ఇతర పండగలు ఉండటంతో సొంత ప్రాంతాలకు వచ్చేవారి సంఖ్య భారీగా ఉండేది. ఇప్పుడు ఇరాన్, ఇజ్రాయెల్, అమెరికా మధ్య యుద్ధం కారణంగా వారు సులభంగా స్వదేశానికి వచ్చే పరిస్థితి లేకుండా పోయింది. ఇప్పటివరకు కొన్నివేల మందే వెనక్కి వచ్చినట్లు జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఈసారి వచ్చేవారి సంఖ్య సగానికి పైగా తగ్గొచ్చని ప్రవాస గ్రూపులు అంచనా వేస్తున్నాయి. "మామూలుగా మేము యూఏఈ నుంచి ఎనిమిది చార్టర్డ్ విమానాలు ఏర్పాటు చేసేవాళ్లు. కానీ ఈసారి అలా ఏర్పాటుచేసే పరిస్థితి లేదు" అని యూఏఈ కేరళ ముస్లిం కల్చరల్ సెంటర్ ప్రెసిడెంట్ పుథుర్ రెహమాన్ మీడియాకు వెల్లడించారు. ఈ ప్రభావం ఉత్తర కేరళలోని మలప్పురం, కొళికోడ్, కాసర్ గోడ్, పాలక్కాడ్ త్రిశ్శూర్‌లోని నియోజవర్గాల్లో కనిపించనుంది. కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్లో ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ కీలక పార్టీ. ఇక్కడి ఓటర్ల నుంచి ఆ పార్టీనే ఎక్కువ లబ్ధి పొందుతుంటుంది. "ఈ ఓటింగ్ కోసం చాలామంది. తిరిగిరాకపోవచ్చు. వారిని రప్పించేందుకు మా ప్రయత్నాలు కొనసాగుతున్నాయి.. పరిస్థితి మెరుగపడకపోతే.. పోలింగ్ శాతం తక్కువగానే ఉండొచ్చు" అని ఐయూఎంఎల్ జనరల్ సెక్రటరీ ఆందోళన వ్యక్తంచేశారు. అయితే మొత్తం పోలింగ్ శాతంపై ఈ ప్రవాస ఓటర్ల ప్రభావం పరిమితంగానే ఉంటుందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. "ఉత్తర కేరళలోని నియోజకవర్గాల్లోనే గల్ఫ్ ఓటర్ల సంఖ్య ఎక్కువగా ఉన్నప్పటికీ.. సాధారణంగా అవన్నీ భారీ మెజార్టీతో గెలిచే సీట్లు" అని పేర్కొన్నారు. అందుకే ప్రభావం పరిమితమేనని చెప్తున్నారు.



# అర్హులందరికీ రైలు టికెట్లు

అర్హులైన ప్రయాణికులందరికీ టికెట్లు లభించేలా చర్యలు తీసుకుంటున్నట్టు కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ఇందులో భాగంగానే ఐఆర్సీటీసీ పోర్టల్ నుంచి దాదాపు 3 వేల నకిలీ ఖాతాలను తొలగించినట్టు తెలిపారు. లోక్‌సభ ప్రశ్నోత్తరాల సమయంలో రైల్వే టికెట్లపై అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి బదులిచ్చారు. "దళారుల టికెట్ల విక్రయానికి అడ్డుకట్ట వేసి.. ప్రయాణికులకు టికెట్లను అందుబాటులో ఉంచడం కోసం నకిలీ ఖాతాలను తొలగించించారు. సౌకర్యవంతమైన సేవలను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి వెల్లడించారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో దేశవ్యాప్తంగా ప్రభుత్వం 75వేల ప్రత్యేక రైలు సర్వీసులను నడిపింది" అని రైల్వేశాఖ మంత్రి పేర్కొన్నారు. రైలు ప్రయాణాల భద్రతపై మరింత దృష్టి సారించడం వల్ల ప్రమాదాలు 90 శాతం మేర తగ్గాయని మంత్రి చెప్పారు.

# చిన్నారిపై కేసు కోసం అంతగా చొక్కాలు చించుకుంటారా!

## పోలీసులకు సుప్రీం ధర్మాసనం చీవాట్లు

నాలుగేళ్ల చిన్నారిపై అత్యాచార ఘటనలో సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. ఏమాత్రం సున్నితత్వం లేకుండా బాలిక, ఆమె తల్లితండ్రులతో వ్యవహరించారని గురుగ్రామ్ పోలీసులపై మండిపడింది. క్రాస్ ఎగ్జామినేషన్ చేసిన తీరును తప్పుపడుతూ.. ఇది అత్యంత దారుణమైన ప్రవర్తన అని, వారిని అగౌరవించడమేనని మందలించింది. ఈ లైంగిక దాడి కేసులో పోలీసుల స్పందన సరిగా లేదని ఆరోపిస్తూ బాధితురాలి తల్లిదండ్రులు అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. వారి పిటిషన్‌పై బుధవారం మరోసారి విచారణ జరిగింది. "దర్యాప్తులో భాగంగా ఆ చిన్నారి వద్దకు వెళ్లకుండా తననే పోలీసు స్టేషన్‌కు రప్పించడం సిగ్గుచేటు. మీరు బాధితురాలి ఇంటికి ఎందుకు వెళ్లలేదు. మీరేమైనా. రాజులా..?" అని సుప్రీం ధర్మాసనం ప్రశ్నించింది. అలాగే ఈ నేరాన్ని పోక్సో చట్టంలోని సెక్షన్ 6 నుంచి సెక్షన్ 10కి ఎందుకు మార్చారని అడిగింది. సెక్షన్ ఆరు ప్రకారం.. నేరం రుజువైతే 20 ఏళ్ల జైలుశిక్ష పడుతుంది. సెక్షన్ 10 కింద అయితే ఆ శిక్షాకాలం 10 ఏళ్లే ఉంటుంది. బాలల సంక్షేమ కమిటీ ఇచ్చిన నివేదిక ప్రకారమే సెక్షన్ 10లోకి చేర్చామని హరియాణా పోలీసుల తరపున హాజరైన అడిషనల్ సొలిసిటర్ జనరల్ సమాధానం ఇచ్చారు."బాధితురాలి వాంగ్మూలం కంటే ఈ రిపోర్టు ఎలా ప్రాధాన్యం ఇవ్వాలని అనిపించింది. ఆ బాలిక అమాయకత్వాన్ని మీరు నమ్మలేదు. సాక్ష్యం లేదని నిరూపించే ప్రయత్నాలు జరిగాయి. ఒక చిన్నారిపై లైంగిక దాడి ఘటనలో మీ అవగాహన ఇదే అయితే.. చట్టబద్ధ పాలన సంగతేంటి..? ఈ ఘటనపై పోలీసులకు స్పష్టమైన అవగాహన లేదు. చట్టం పట్ల ఏమాత్రం గౌరవం ఉన్నా రాష్ట్ర ప్రభుత్వం సంబంధిత అధికారులను బదిలీ చేయాలి. ఈ కేసులో సీసీటీవీ లేదు.. ఆదీఇదీ అని చెప్తున్నారు. గత 15 రోజులుగా మీరు ఏం చేస్తున్నారు. మేం ఈ కేసును పరిగణనలోకి తీసుకోగానే.. మీరు అరెస్టులు మొదలు పెట్టారు. అసలు బాలల సంక్షేమ కమిటీ సభ్యులు ఎవరు..? వారి అర్హతలు ఏంటి..? వారిని ఎవరు నియమిస్తారు..?" అని తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది.అలాగే అఫిడవిట్లో చిన్నారి పేరు ప్రస్తావించడాన్ని తప్పుపట్టింది. ఈ కేసు దర్యాప్తు కోసం ముగ్గురు సభ్యులతో సిట్ ఏర్పాటుకు ఆదేశాలు ఇచ్చింది. గురువారంలోగా కేసు రికార్డులను సిట్ కు అప్పగించాలని ఆదేశించింది.

# పరారైన ఆప్ ఎమ్మెల్యే అరెస్టు



ఆప్ ఎమ్మెల్యే హర్మీత్ సింగ్ వతన్ మజ్రాను పోలీసులు అరెస్టు చేశారు. అత్యాచారం, మోసానికి సంబంధించిన కేసులో గతేడాది సెప్టెంబర్ నుంచి పరారీలో ఉన్న ఆయనను తాజాగా మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్లో అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. అతన్ని పటియాలాకు తీసుకొస్తున్నామని, ఇక్కడి కోర్టులో హాజరుపరుస్తున్నామని వెల్లడించారు. పటియాలాలోని సనూర్ నియోజకవర్గానికి హర్మీత్ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. జిరాక్‌పూర్‌కు చెందిన ఓ మహిళ ఫిర్యాదుతో ఆయనపై కేసు నమోదైంది. విడాకులు తీసుకున్నట్లు నమ్మించి హర్మీత్ తనతో సంబంధం కొనసాగించారని ఆమె ఆరోపించారు. ఆ తర్వాత తనపై బెదిరింపులకు కూడా పాల్పడినట్లు ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలోనే గతేడాది సెప్టెంబరులో పోలీసులు ఆయనను అరెస్టు చేశారు. స్టేషనుకు తరలిస్తుండగా హర్మీత్, ఆయన సహాయకులు అధికారులపై కాల్పులు జరిపారు. ఈ నేపథ్యఁలో హర్మీత్ అక్కడి నుంచి పరారయ్యారు. హర్మీత్‌ను పట్టుకునేందుకు.. పోలీసులు గాలిస్తుండగా తాజాగా మధ్యప్రదేశ్‌లో పట్టుపడ్డారు.



# ఇంధన ప్రయోజనాల కోసం 'ఆపరేషన్ ఊర్జా సురక్షా'

## నావికాదళం సహకారంతో యుద్ధ మేఘాలు దాటొస్తున్న ఓడలు

పశ్చిమాసియా యుద్ధ మేఘాలను దాటి కొన్ని చమురు, గ్యాస్ నౌకలు ఒక్కొక్కటిగా భారత్‌కు చేరుకుంటున్నాయి. దేశీయ ఇంధన ప్రయోజనాలను కాపాడటంలో భాగంగా ఈ నౌకల భద్రత కోసం భారత నేవీ ప్రత్యేక చర్యలు చేపట్టింది. 'ఆపరేషన్ ఊర్జా సురక్షా'ను ప్రారంభించి.. చమురు, ఎల్పీజీ నౌకలను సురక్షితంగా హర్మూజ్‌ను దాటిస్తోంది. ఈ ఆపరేషన్‌కు సంబంధించిన వివరాలను కొన్ని ఆంగ్ల పత్రికలు ప్రచురించాయి.. హర్మూజ్ వద్దకు యుద్ధ నౌకలు సాధారణంగా భారత్ వచ్చే చమురు, గ్యాస్ నౌకలు సౌదీ అరేబియాలోని రాస్ తనురా వంటి పోర్టుల నుంచి ప్రయాణం ప్రారంభిస్తాయి. ఇవి పర్షియన్ గల్ఫ్ మీదుగా హర్మూజ్ జలసంధి వద్దకు చేరుకుంటాయి. నౌక వేగం, ప్రయాణించే మార్గాన్ని బట్టి ఇందుకు గరిష్టంగా రెండు రోజుల సమయం పడుతుంది. ప్రస్తుతం ఉద్రిక్తతల నేపథ్యంలో ఈ జలసంధి వద్దే వందలాది నౌకలు చిక్కుకుపోయిన సంగతి తెలిసిందే. దీంతో వాటిని సురక్షితంగా తీసుకొచ్చేందుకు భారత నౌకాదళం రంగంలోకి దిగింది. ఇరాన్ అధికారుల నుంచి అనుమతులు తీసుకోవడంతో పాటు నౌకలు జలసంధి దాటేవరకు అనుక్షణం వాటికి సహాయ సహకారాలు అందిస్తోంది. హర్మూజ్‌దాటిన తర్వాత ఈ నౌకలు గల్ఫ్ ఆఫ్ ఒమన్లోకి ప్రవేశించి అక్కడి నుంచి అరేబియా సముద్రంలోకి వస్తాయి. దీంతో ఈ రెండు ప్రాంతాల వద్ద భారత నేవీ 5 యుద్ధ నౌకలను మోహరించింది. ఈ యుద్ధ నౌకల సహకారంతోనే ఇటీవల రెండు గ్యాస్ ట్యాంకర్లు పైన్ గ్యాస్, జగ్ వసంత్ అంతర్జాతీయ జలాల్లోకి ప్రవేశించి భారత్ దిశగా పయనిస్తున్నాయి. అంతకు ముందు శివాలిక్, నందాదేవి వంటి గ్యాస్ నౌకలు కూడా ఈ ఆపరేషన్లో భాగంగానే దేశీయ పోర్టులకు చేరుకోగలిగాయి. ప్రస్తుతం ఇక్కడ భారత్‌కు రావాల్సిన 22 నౌకలు తరలింపునకు సిద్ధంగా ఉన్నాయి. వీటిల్లో 20 వరకు ఎల్పీజీ, ఎల్ఎన్జీ క్రూడ్ ఆయిల్ రవాణా చేస్తున్నవే..! సేఫ్ రూటును చెబుతూ సాధారణంగా సముద్రంలో ప్రయాణం హైడ్రోగ్రాఫిక్ చార్టు, నావిగేషన్ వ్యవస్థల ఆధారంగా ఉంటుంది. ప్రస్తుతం ఉద్రిక్తతల నేపథ్యంలో హర్మూజ్ జలసంధి సమీపంలో ఇరాన్ సీమైన్సును అమర్చినట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. వీటిల్లో చాలావరకు బయటకు కన్పించవు. వీటి కారణంగా నౌకలకు తీవ్ర ముప్పు పొంచి ఉంటుంది. అందుకే, ఈ సీమైన్స్ తగలకుండా నౌకలను హర్మూజ్‌ను దాటించడం అత్యంత ఆవశ్యకం. దీన్ని గుర్తించిన భారత నేవీ.. మన నౌకల కోసం ప్రత్యేక హైడ్రోగ్రాఫిక్ చార్టును రూపొందిస్తోంది. నిఘా నౌకలతో సముద్ర గర్భాన్ని స్కాన్ చేసి నావిగేషన్ రూట్స్‌ను గుర్తిస్తోంది. ఆయా మార్గాలను నౌకలకు ఎప్పటికప్పుడు అందిస్తూ వాటిని హర్మూజ్ నుంచి తీసుకొస్తోంది.

### హర్మూజ్‌లో ఛార్జీలపై గందరగోళం..

ఇదిలాఉండగా హర్మూజ్ జలసంధిని దాటే నౌకలకు ఛార్జీలు విధిస్తామని ఇరాన్ చెప్పినట్లు ఇటీవల వార్తలు వచ్చాయి. అవన్నీ అవాస్తవమని భారత్‌లోని ఇరాన్ రాయబార కార్యాలయం తెలిపింది. అయితే, దీనిపై తాజాగా ఇరాన్ విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి చేసిన వ్యాఖ్యలు గందరగోళం సృష్టిస్తున్నాయి. హర్మూజ్లో నౌకల సురక్షిత ప్రయాణానికి ఫీజులు వసూలు చేస్తామని ఓ మీడియా ఇంటర్వ్యూలో ఆయన చెప్పడం గమనార్హం. మరోవైపు, అమెరికా, ఇజ్రాయెల్ సంబంధిత నౌకలు మినహా మిగిలినవన్నీ హర్మూజ్ మీదుగా ప్రయాణించవచ్చని ఐరాస సమావేశంలో ఇరాన్ ప్రకటన చేసింది.

# ఆహార భద్రతకు ప్రమాద ఘంటికలు

## హర్మ్యూజ్ మూసివేతతో ముంచుకొస్తున్న ముప్పు



ఇరాన్ యుద్ధం వల్ల ప్రపంచ దేశాలు ఇప్పటికే చమురు సరఫరా సమస్యలను ఎదుర్కొంటున్నాయి. మరోవైపు హర్మ్యూజ్‌ను మూసివేయడంతో చమురు, గ్యాస్‌తో పాటు ఎరువుల రవాణాకూ ఆటంకం ఏర్పడుతోందని ప్రపంచ వాణిజ్య సంస్థ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ జేన్ మేరీ పొగమ్ పేర్కొన్నారు. యూరియా సరఫరాకు అంతరాయాలు ఏర్పడుతుండడంతో ఎరువుల కొరత, అధిక ధరల రూపంలో ప్రపంచ ఆహార భద్రతకు ముప్పు కలిగే అవకాశముందని హెచ్చరించారు. ఐక్య రాజ్యసమితి వాణిజ్య, అభివృద్ధి విభాగం వెల్లడించిన వివరాల ప్రకారం, ప్రపంచంలోని మూడింట ఒక వంతు ఎరువులు గల్ఫ్ దేశాల నుంచి హర్మ్యూజ్ జలసంధి మీదుగానే రవాణా అవుతాయి. దీని మూసివేత కొనసాగితే యూరియా దిగుమతి చేసుకునే వ్యవసాయ ఆధారిత దేశాల్లో నిల్వలు తగ్గిపోయే ప్రమాదం ఉంది. యుద్ధం మొదలై కొన్ని వారాలు మాత్రమే అవుతున్నందున ప్రస్తుతం ఎరువుల కొరత అంతగా లేనప్పటికీ ఈ ప్రభావం వచ్చే ఏడాది పంటలపై పడనుంది. అలా అని ప్రపంచ దేశాలు ఎరువులు, ఆహార ధాన్యాల నిల్వలు పెంచుకోవడం ప్రారంభిస్తే అంతర్జాతీయ వాణిజ్యానికి అంతరాయం కలుగుతుంది. దీనివల్ల ఆహారాన్ని దిగుమతి చేసుకునే పేద దేశాలు దయనీయ పరిస్థితులను ఎదుర్కొనే ప్రమాదం ఉంది. మరోవైపు యూరియా ఉత్పత్తికి అవసరమైన ద్రవరూప సహజ వాయువు ఎల్ఎన్‌జీని భారత్ కొన్నేళ్లుగా ఖతార్ నుంచి దిగుమతి చేసుకుంటోంది. ప్రస్తుతం ఆ దేశం నుంచి ఎల్ఎన్ సరఫరా నిలిచిపోయింది. దీంతో ప్రధాన ఆహార ఎగుమతిదారులైన భారత్, థాయిలాండ్, బ్రెజిల్ వంటి దేశాలలోని కొన్ని యూరియా కంపెనీలు ప్లాంట్లను మూసివేసే పరిస్థితులు నెలకొన్నాయి.

### ఎరువుల ధరల పెరుగుదల

యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ప్రపంచ మార్కెట్లో యూరియా ధరలు సుమారు 25 శాతం పెరిగాయి. సరఫరా కొరత కారణంగా ఇతర ఎరువుల ధరలు కూడా క్రమంగా పెరుగుతున్నాయి. ఎరువులను ఎక్కువగా వినియోగించుకునే మార్కెట్లలో భారత్, బ్రెజిల్ వంటి దేశాలు ఉన్నాయి. దీంతో ఆయా దేశాల పై అధిక ప్రభావం పడే అవకాశం ఉంది. అమెరికా కూడా యూరియాకు అతిపెద్ద మార్కెట్గా ఉన్నప్పటికీ నత్రజనిలో సగానికి పైగా దేశీయంగానే ఉత్పత్తి చేసుకుంటుండడం వల్ల ఆ దేశంపై ఎక్కువ ప్రభావం ఉండదు. ప్రపంచ మార్కెట్లో కొరత కారణంగా ఎరువుల ధరలు పెరగడంతో రైతుల ఉత్పత్తి ఖర్చులు పెరగనున్నాయి. చమురు ధరల పెరుగుదల వల్ల రైతుల రవాణా ఖర్చులపై కూడా ప్రభావం పడుతుంది. దీంతో ప్రపంచ దేశాల్లో ఆహార ధాన్యాలు, వ్యవసాయ ఉత్పత్తుల ధరలు కూడా పెరగనున్నాయి. ఈ ఏడాది ప్రపంచ వ్యాప్తంగా ఆహార ధరలు సుమారు 2 శాతం పెరిగే అవకాశం ఉంది.



# ఇరాన్‌ను జయించేశాం!

## అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆసక్తికర వ్యాఖ్యలు

యుద్ధాన్ని ముగించే విషయంపై అమెరికా, ఇరాన్ మధ్య చర్చలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. హర్మ్యూజ్ జలసంధికి సంబంధించి ఇరాన్ నుంచి తమకు చాలా పెద్ద బహుమతి లభించిందన్నారు. అణ్వాయుధాన్ని ఎప్పటికీ తయారుచేయకుండా ఉండేందుకు ఇరాన్ అంగీకరించిందన్నారు. వైట్ హౌస్లో విలేకరులతో మాట్లాడుతూ.. ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. వారు (ఇరాన్) ఒక అద్భుతమైన పని చేశారు. మాకు ఒక బహుమతి ఇచ్చారు. ఈరోజే అది మాకు చేరింది. అది చాలా పెద్దది. దాని విలువ అపారమైనది' అని ట్రంప్ పేర్కొన్నారు. అది అణు సంబంధమైనది కాదని.. చమురు, గ్యాస్‌తో ముడిపడినదని పేర్కొన్నారు. దీనికి సంబంధించి పూర్తి వివరాలను మాత్రం ఆయన వెల్లడించలేదు. అయితే, ఇంధన రవాణాకు కీలకమైన హర్మ్యూజ్ జలసంధి గురించే ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేసినట్లుగా తెలుస్తోంది. ఇరాన్తో ఒక ఒప్పందం కుదుర్చుకోవడానికి తాను ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు ట్రంప్ పేర్కొన్నారు. ఆ దేశంలోని సరైన వ్యక్తులతోనే తాము చర్చలు జరుపుతున్నామని వెల్లడించారు. ఇకపై జరగనున్న చర్చల్లో అమెరికా నుంచి ఉపాధ్యక్షుడు జేడీ వాని, విదేశాంగ మంత్రి మార్కో రూబియోతో పాటు ట్రంప్ అల్లుడు జారెడ్ కుష్నర్, ప్రత్యేక రాయబారి స్టీవ్ విట్కాఫ్లు పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. అణ్వాయుధం ఎప్పటికీ తయారుచేయమని ఇరాన్ అంగీకరించిందని ట్రంప్ తెలిపారు. ఆ దేశ నాయకత్వంలో ఇప్పటికే గణనీయమైన మార్పులు చోటుచేసుకున్నాయన్నారు. ఈ సందర్భంగా యుద్ధంలో ఇరాన్‌పై తాము విజయం సాధించామని ట్రంప్ పునరుద్ఘాటించారు. ఇది ఇంత త్వరగా ముగియడం రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్కు నిరాశపరిచిందని వ్యాఖ్యానించారు..

# మేం అనుకున్నప్పుడే యుద్ధ విరమణ

## - అమెరికా ప్రతిపాదనను అంగికరించని ఇరాన్



పశ్చిమాసియాలో కాల్పుల విరమణకు అమెరికా చేసిన ప్రతిపాదనను ఇరాన్ తోసిపుచ్చింది. తమ డిమాండ్లు నెరవేరినప్పుడు, తాము నిర్ణయించుకున్నప్పుడు మాత్రమే యుద్ధం ముగుస్తుందని స్పష్టం చేసింది. అప్పటివరకు పశ్చిమాసియాలో భారీ స్థాయిలో దాడులు కొనసాగిస్తామని తెలిపింది. ఈ మేరకు ఇరాన్ కీలక అధికారి వెల్లడించిన వివరాలను అక్కడి అధికారిక మీడియా ప్రసారం చేసింది. అమెరికా, ఇరాన్ మధ్య మధ్యవర్తిత్వం వహిస్తోన్న పాకిస్థాన్, కాల్పుల విరమణ ప్రతిపాదనను ఇరాన్‌కు తెలిపిన అనంతరం ఈ మేరకు ప్రకటన వెలువడింది.

### 15వేల బాంబులేశాం: ఇజ్రాయెల్

ఫిబ్రవరి 28 నుంచి ఇప్పటివరకు ఇరాన్పై 15వేల బాంబులు జారవిడిచినట్లు ఇజ్రాయెల్ వెల్లడించింది. గతేడాది జూన్లో చేసిన దాడులతో పోలిస్తే నాలుగు రెట్లు: అధికమని పేర్కొంది. ఈ మేరకు ఇజ్రాయెల్ రక్షణమంత్రి కట్జ్, ఐడీఎఫ్ చీఫ్ ఆఫ్ స్టాఫ్ ఇయాల్ ఆమీర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. యుద్ధం మొదలైన తొలి రోజుల్లో అమెరికా, ఇజ్రాయెల్లు నిత్యం వెయ్యి బాంబులను జారవిడిచినట్లు చెప్పారు.

### లెబనాన్లో 1094 మంది మృతి

ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో లెబనాన్లో ఇప్పటివరకు 1004 మంది ప్రాణాలు కోల్పోయినట్లు లెబనాన్ ఆరోగ్యశాఖ వెల్లడించింది. గడిచిన 24 గంటల్లోనే 22 మంది చనిపోయినట్లు పేర్కొంది. మృతుల్లో 121 మంది చిన్నారులు. మహిళలు ఉన్నట్లు తెలిపింది.

## పాక్ నౌకను వెనక్కు రప్పించిన ఇరాన్

పశ్చిమాసియా యుద్ధ ఉద్రిక్తతల నడుమ ఇరాన్ సరిహద్దులోని హర్మ్యూజ్ జలసంధిలో నౌకాయానానికి సంబంధించి ఆ దేశం పలు నిబంధనలు విధించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో హర్మ్యూజ్ నుంచి కరాచీ వెళ్తున్న పాక్ కంటైనర్ నౌక (సెలెన్)ను ఇరాన్ వెనక్కి రప్పించినట్లు ఐఆర్ సీ వెల్లడించింది. హర్మ్యూజ్ గుండా ప్రయాణించడానికి ముందస్తు అనుమతులు లేకపోవడంతో అడ్డుకొని.. వెనక్కి మళ్లించినట్లు తెలిపింది. ఈ జలసంధి గుండా వెళ్లే ప్రతి నౌక ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్ సముద్ర అధికార యంత్రాంగంతో సమన్వయం చేసుకోవాలని ఐఆర్‌సీ పేర్కొంది. ఈ నిబంధనలు ఉల్లంఘిస్తే జోక్యం చేసుకుంటామని స్పష్టం చేసింది. పాక్ నౌకను ఇరాన్ అడ్డుకున్న విషయాన్ని కాబుల్‌లోని ఇరాన్ రాయబార కార్యాలయం కూడా ధ్రువీకరిం చింది. కాగా ఇరాన్, అమెరికా శాంతి చర్చలు పాకిస్థాన్ వేదికగా జరగనున్నాయని.. ఇరుదేశాల నేతలు ఇస్లామాబాద్‌లో భేటీ కానున్నారని వార్తలు వస్తున్న నేపథ్యంలో ఘటన గమనార్హం.

## కువైట్ విమానాశ్రయంపై ఇరాన్ డ్రోన్ దాడి

పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు రోజురోజుకీ భీకర స్థాయికి చేరుకుంటున్నాయి. కువైట్ అంతర్జాతీయ విమానాశ్రయం లక్ష్యంగా డ్రోన్ దాడికి పాల్పడింది. డ్రోన్ ఓ ఆయిల్ ట్యాంకర్‌ను ఢీ కొట్టడంతో మంటలు పెద్ద ఎత్తున ఎగసిపడ్డాయి. బుధవారం తెల్లవారుజామున ఇరాన్‌కు చెందిన డ్రోన్లు కువైట్ అంతర్జాతీయ విమానాశ్రయం లక్ష్యంగా దూసుకెళ్లాయి. అందులో ఒక డ్రోన్ విమానాశ్రయ పరిసరాల్లో ఉన్న ఆయిల్ ట్యాంకర్‌ను ఢీ కొట్టింది. ఈ ఘటనపై కువైట్ ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. మంటలు అదుపు చేసేందుకు రెస్క్యూ టీమ్ తీవ్రంగా శ్రమిస్తోంది.

# చెప్పిన గంటలోపే లింకన్ లక్ష్యంగా ఇరాన్ దాడి

**పశ్చిమాసియా ఘర్షణల్లో అనూహ్యపరిణామం**

పశ్చిమాసియా ఘర్షణల్లో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. అమెరికాకు చెందిన విమాన వాహక నౌక యూఎస్ఎస్ అబ్రహాం లింకన్ లక్ష్యంగా ఇరాన్ క్షిపణి దాడులు చేసింది. ఈ విమాన వాహకనౌక కదలికలను నిరంతరం పరిశీలిస్తున్నామని, లక్ష్యంగా చేసుకుంటామని హెచ్చరించిన గంటలోపే దాడి చేసింది. దానికి సంబంధించిన వీడియోను ఇరాన్ మీడియా విడుదల చేసింది. యుద్ధాన్ని ముగించేందుకు ఇరాన్‌తో అమెరికా ముమ్మరంగా చర్చలు జరుపుతోంది. ఇందులో భాగంగానే నెల రోజుల కాల్పుల విరమణ కోసం 15 పాయింట్లతో కూడిన ప్రణాళికను ఇరాన్కు పాకిస్థాన్ అందించింది. ఇలాంటి సమయంలో తాజా ఘటన చోటుచేసుకోవడం గమనార్హం. దీనిపై అమెరికా ఎలా స్పందిస్తుందనే దానిపై ఆందోళన నెలకొంది. అబ్రహాం లింకన్పై దాడి చేశామని ఇరాన్ ప్రకటించడం ఇదే తొలిసారి కాదు. తమ బాలిస్టిక్ క్షిపణులు ఈ నౌకను ఢీకొట్టాయని, దాంతో అది పనిచేయడం లేదని, గల్ఫ్ జలాల నుంచి వెనక్కి తగ్గిందని ఇటీవల పేర్కొంది. ఆ ప్రకటనను అప్పట్లో అమెరికా తోసిపుచ్చింది.





## ముంబై ఇండియన్స్ ఫ్యాన్స్‌కు సూపర్ న్యూస్!

ఇటీవల ముంబై ఇండియన్స్ స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌కు వెళ్లిన సంగతి తెలిసిందే. దీంతో అతనికి గాయమైందేమోనని అభిమానులు ఆందోళన చెందారు. ఐపీఎల్ 2026 మరో మూడు రోజుల్లో ప్రారంభం కానుండటంతో బుమ్రాకు సంబంధించిన ఈ విషయం ముంబై ఫ్యాన్స్‌ను కంగారు పెట్టింది. అయితే తాజాగా వారికి అదిరిపోయే న్యూస్ ఒకటి బయటకు వచ్చింది. జస్ప్రీత్ బుమ్రాకు ఎలాంటి గాయం లేదని, కేవలం ఫిట్‌నెస్ చెక్ కోసమే సీఓఈకి వెళ్లాడని కన్ఫర్మ్ అయ్యింది. దీంతో ముంబై అభిమానులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రస్తుతం బుమ్రా పూర్తి ఫిట్‌నెస్‌తో ఉన్నాడని, తొలి మ్యాచ్ నుంచే అందుబాటులో ఉంటాడని క్రీడా వర్గాలు చెబుతున్నాయి. ఈ సీజన్ మార్చి 28 నుంచి ప్రారంభం కానుండగా.. ముంబై ఇండియన్స్ తమ తొలి మ్యాచ్‌ను మార్చి 29న ఆడనుంది. వాంఖడేలో జరిగే మ్యాచ్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్‌తో ముంబై తలపడనుంది. ఐపీఎల్ 2025 ఎడిషన్‌లో బుమ్రా తొలి నాలుగు మ్యాచ్‌లకు అందుబాటులో లేకపోవడం ముంబై ఇండియన్స్‌పై చాలా ప్రభావం పడింది. బుమ్రా రాకతో ముంబై జట్టు తిరిగి గాడిలో పడి క్వాలిఫయర్-2 వరకు చేరింది. గత సీజన్‌లో బుమ్రా 12 మ్యాచ్‌ల్లో 18 వికెట్లు తీశాడు. ప్రస్తుతం బుమ్రా టీమిండియా తరఫున టీ20 ప్రపంచ కప్2026లోనూ అద్భుత ప్రదర్శనలు చేసి జోరుమీదున్నాడు. బుమ్రా ఫామ్ ముంబై ఇండియన్స్ ఫ్యాన్స్‌కు ఆరో టైటిల్ ఊరిస్తుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. బుమ్రా తన సామర్థ్యం మేరకు రాణించగలిగితే ఈ సీజన్‌లోనూ ముంబై ప్లే ఆఫ్స్‌కు తప్పక చేరుతుంది.

## సచిన్ సహచరుడిపై యువరాజ్ సింగ్ తండ్రి ఫైర్



టీమిండియా మాజీ స్టార్ ఆల్ రౌండర్ యువరాజ్ సింగ్ తండ్రి యోగ్‌రాజ్ సింగ్.. తన కొడుకు సహచరులపై తరుచూ వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తూ వార్తల్లో నిలుస్తుంటాడు. తాజాగా క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ సహచరుడు, భారత స్టార్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్‌పై ఆసక్తికర వ్యాఖ్యలు చేసి మరోసారి వార్తల్లోకెక్కాడు. అయితే యోగ్‌రాజ్ అశ్విన్‌పై ఆగ్రహించడానికి సచిన్ కొడుకు అర్జున్ టెండూల్కర్ కారణం. మరి.. ఆ వివరాలు ఏమిటో ఇప్పుడు చూద్దాం 2022లో యోగ్‌రాజ్ వద్ద అర్జున్ టెండ్కూలర్ శిక్షణ తీసుకున్నాడు. ఆ తర్వాత ముంబై ఇండియన్స్‌తో ఐపీఎల్ కాంట్రాక్ట్ పొందాడు. అలానే రంజీ ట్రోఫీలో గోవాకు మారి సత్తా చాటడం ప్రారంభించాడు. ఇటీవల జరిగిన ఐపీఎల్ 2026 వేలంలో అర్జున్‌ను లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ రూ.30 లక్షలకు కొనుగోలు చేసింది. ఈ సీజన్‌లో అర్జున్‌కు లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ తుది జట్టులో చోటు లభించడంపై ఇటీవల అశ్విన్ కాస్త ఓపెన్‌గా మాట్లాడాడు. అర్జున్‌కు తుది జట్టులో చోటు దక్కడం అసాధ్యమని, అలానే ఒకవేళ చోటు దక్కినా అతడు రాణించడమే అని అన్నాడు.

ఈ మాటలే యోగ్‌రాజ్‌ను చిర్రెత్తిపోయేలా చేశాయి. టీవీల్లో కూర్చొని ఒకరి ప్రతిభను డిసైడ్ చేయడానికి నువ్వు ఎవరు.. నీ అర్హత ఏంటి అంటూ ఘాటుగా స్పందించాడు. ఒక ప్లేయర్‌ను.. నువు చేయలేవు, నీవు ఆడలేవు, నీకు ఇది సాధ్యం కాదు అని మాట్లాడటం సరైంది కాదంటూ అశ్విన్‌కు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చాడు. నిరుత్సాహ పరిచే ఇలాంటి మాటలు ఏ ఆటగాడిపై అయినా ఒత్తిడి పెంచుతుందని అన్నాడు. సచిన్ కొడుకు కావడం అర్జున్‌పై ముందు నుంచే ఒత్తిడి ఉందని, ఇలాంటి వ్యాఖ్యలు అతన్ని మరింత ఒత్తిడిలోకి నెడతాయని యోగ్‌రాజ్ తెలిపాడు. ఈ ఐపీఎల్ సీజన్‌లో అర్జున్‌కు తప్పక అవకాశాలు వస్తాయని, వచ్చిన అవకాశాలను కూడా సద్వినియోగం చేసుకుంటాడని ఆయన విశ్వాసం వ్యక్తం చేశాడు.

# ఐపీఎల్ కెప్టెన్లు ముచ్చట్లు















# ఐపీఎల్ చరిత్రలోనే తొలిసారి..

### - కోల్‌కతా నైట్ రైడర్స్ సంచలన నిర్ణయం




ఐపీఎల్ చరిత్రలో అరుదైన ఘట్టం చోటు చేసుకుంది. కోల్‌కతా నైట్ రైడర్స్ ఫ్రాంచైజీ సంచలన నిర్ణయం తీసుకుంది. వెస్టిండీస్ స్టార్ ఆల్‌రౌండర్, కేకేఆర్ లెజెండరీ ఆండ్రీ రస్సెల్ ఈ సీజన్‌కు ముందు ఐపీఎల్‌కు వీడ్కోలు పలికిన విషయం తెలిసిందే. దీంతో అతడి జెర్సీ నంబర్ 12ను కూడా రిటైర్ చేస్తూ రస్సెల్‌కు ఘన వీడ్కోలు పలికింది. ఐపీఎల్ చరిత్రలో ఓ ఫ్రాంచైజీ జెర్సీ నంబర్‌ను అధికారికంగా రిటైర్ చేయడం ఇదే తొలిసారి కావడం విశేషం. ఐపీఎల్ 2026కి ముందు కేకేఆర్ 'నైట్స్ అన్‌ప్లగ్డ్' అనే ప్రి సీజన్ ఈవెంట్ నిర్వహించింది. ఈ కార్యక్రమంలో కేకేఆర్ సీఈవో వెంకీ మైసూర్ తమ నిర్ణయాన్ని వెల్లడించారు. 'రస్సెల్.. నీకు మేమిచ్చే బహుమానం ఇదే. నీ జెర్సీ నంబర్ 12ను కూడా రిటైర్ చేస్తున్నాం. ఈ జెర్సీ నీకే సొంతం' అని అతడికి ఘన వీడ్కోలు పలికారు. కేకేఆర్ జట్టుతో దశాబ్దానికి పైగా అనుబంధం కలిగిన రస్సెల్.. 2014, 2024 టైటిల్ విజయాల్లో కీలక పాత్ర పోషించాడు. ఇది వరకు భారత క్రికెట్‌లో బీసీసీఐ మాత్రమే జెర్సీ నంబర్లను రిటైర్ చేసింది. క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ జెర్సీ నంబర్ 10, ఎంఎస్ ధోనీ జెర్సీ నంబర్ 7లను రిటైర్ చేశారు. అయితే ఐపీఎల్‌లో ఇలాంటి నిర్ణయం ఇప్పటివరకు ఎప్పుడూ తీసుకోలేదు.

**రస్సెల్ భావోద్వేగం..**

ఈ సందర్భంగా రస్సెల్ కెరీర్‌ను ప్రతిబింబించే వీడియోను ప్రదర్శించారు. దీంతో తన ప్రయాణాన్ని గుర్తు చేసుకుంటూ అతడు భావోద్వేగానికి లోనయ్యాడు. 'దశాబ్దానికి పైగా ఈ జట్టుతో ఎన్నో విజయాలు సాధించాను. రెండు టైటిల్స్ గెలిచాం. ఆ జ్ఞాపకాలన్నీ కళ్ల ముందు మెదిలాయి. అది చూసి కళ్లలో నీళ్లు వచ్చాయి. ప్రతి మ్యాచ్‌ను నా చివరి మ్యాచ్‌లా ఆడాను' అని రస్సెల్ వెల్లడించాడు. తాజా సీజన్‌కు ముందు రస్సెల్ భవిష్యత్తుపై అనిశ్చితి నెలకొన్నప్పటికీ, ఆసక్తికరంగా అతను వేలంలోకి వెళ్లకుండా కేకేఆర్ ఆఫర్‌ను అంగీకరించి 'పవర్ కోచ్'గా కొత్త బాధ్యతలు స్వీకరించాడు. ఇకపై యువ ఆటగాళ్లను తీర్చిదిద్దడంపై దృష్టి పెట్టనున్నాడు.

చైతన్య రథం
సినిమా
గురువారం 26 మార్చి 2026 XI

# మెగా అభిమానులకు గుడ్ న్యూస్

**- కోలుకున్న రామ్‌చరణ్..**
**- రేపే 'పెద్ది' స్పెషల్ వీడియో విడుదల**



'పెద్ది' సినిమా సెట్స్‌లో రామ్‌చరణ్ గాయపడటంపై చిత్ర బృందం స్పందించింది. ప్రస్తుతం ఆయన కోలుకున్నారని తెలిపింది. సెట్స్‌లో చరణ్ కుడి కంటికి స్వల్ప గాయమైందని, తగిన ట్రీట్‌మెంట్ జరిగిందని పేర్కొంది. ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అభిమానులకు సూచించింది. చరణ్ గాయం విషయంలో వస్తున్న రూమర్లను నమ్మవద్దని విజ్ఞప్తి చేసింది. గురువారం (మార్చి 26) నుంచి చరణ్ మళ్లీ షూటింగ్‌లో పాల్గొంటారని తెలిపింది. మరోవైపు రామ్‌చరణ్ పుట్టినరోజు సందర్భంగా 'పెద్ది' టీమ్ స్పెషల్ సర్ప్రైజ్ ఇవ్వబోతోంది. మార్చి 27వ తేదీ ఉదయం 11.07 గంటలకు స్పెషల్ వీడియో విడుదల చేయనున్నట్టు తెలుస్తోంది. ఈ విషయాన్ని తెలియజేస్తూ కుస్తీ పోటీలు నిర్వహించే బరిని పంచుకుంది.

# జీన్స్ లుక్‌లో 'దివి' సెగలు..

**సోషల్ మీడియాను షేక్ చేస్తున్న బిగ్‌బాస్ బ్యూటీ**



బిగ్‌బాస్ ఫేమ్ దివి వైద్య గురించి తెలుగు ప్రేక్షకులకు ప్రత్యేక పరిచయం అక్కర్లేదు. రియాలిటీ షో తర్వాత తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న ఈ బ్యూటీ ప్రస్తుతం వరుస సినిమాలు, వెబ్ సిరీస్‌లతో కెరీర్‌లో దూసుకుపోతోంది. ఒకవైపు వృత్తిపరంగా బిజీగా ఉంటూనే మరోవైపు సోషల్ మీడియాలో ఎప్పుడూ యాక్టివ్‌గా ఉంటూ అభిమానులతో టచ్‌లో ఉంటోంది.

తాజాగా దివి తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో షేర్ చేసిన ఫొటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. స్టైలిష్ జీన్స్ ధరించి అతిగా మేకప్ లేకుండా చాలా సహజంగా కనిపిస్తూనే తన నడుము అందాలతో నెటిజన్లను కట్టిపడేస్తోంది. ఈ ఫొటోషూట్‌లో దివి గ్లామర్, స్టైల్ కలగలిసి ఉండటంతో అభిమానులు ఫిదా అవుతున్నారు. "గ్లామర్ క్వీన్", "నేచురల్ బ్యూటీ" అంటూ కామెంట్లతో ముంచెత్తుతున్నారు. ప్రస్తుతం ఈ ఫొటోలు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్‌లో తెగ చక్కర్లు కొడుతున్నాయి.

# 'ధురంధర్' సక్సెస్ సీక్రెట్ ఇదే..

**వెల్లడించిన ముఖేష్ చాబ్రా**



సినిమా అంటే కేవలం రంగుల ప్రపంచం మాత్రమే కాదు. ఆ రంగుల వెనుక వేలాది మంది శ్రమ ఉంటుంది. ముఖ్యంగా ఒక పాత్రకు ప్రాణం పోయాలంటే ఆ పాత్రలో ఒదిగిపోయే నటుడు ఉండాలి. ప్రస్తుతం బాక్సాఫీస్ వద్ద రికార్డులు తిరగరాస్తున్న 'ధురంధర్' సిరీస్ విజయానికి ప్రధాన కారణం అందులోని నటీనటుల ఎంపిక. ఈ అద్భుతానికి వెనుక ఉన్న సూత్రధారి, ప్రముఖ కాస్టింగ్ డైరెక్టర్ ముఖేష్ చాబ్రా "కేవలం హీరో, హీరోయిన్లు ఉంటే సినిమా హిట్ అవ్వదు.

తెరపై ఒక్క నిమిషం పాటు కనిపించే వ్యక్తి కూడా ఆ పాత్రలాగే జీవించాలి" అన్నది ముఖేష్ చాబ్రా నమ్మకం. ఈ చిత్రం కోసం ఆయన చేసిన కసరత్తు సామాన్యమైనది కాదు. ధురంధర్ రెండు భాగాల కోసం నటుల ఎంపికకే ఏకంగా 24 నెలల సమయం కేటాయించారు. సుమారు 300 మంది నటులకు స్వయంగా ఆడిషన్స్ నిర్వహించి, ప్రతి పాత్రకు సరిపోయే వారిని వడపోశారు. ముఖేష్ చాబ్రా నేతృత్వంలో ఎనిమిది మంది సహాయకులు అహోరాత్రులు శ్రమించి ఈ కాస్టింగ్ ప్రక్రియను పూర్తి చేశారు.

దర్శకుడు ఆదిత్య ధర్ కోరుకున్న నాచురాలిటీని తీసుకురావడంలో ముఖేష్ చాబ్రా వంద శాతం విజయం సాధించారు. "ప్రతి నటుడి ఎంపిక ఒక సవాలుగా అనిపించినా, ఆదిత్య ధర్ స్పష్టమైన విజన్ వల్ల అది సాధ్యమైంది" అని ముఖేష్ పేర్కొన్నారు.



## భాగ్యనగరంలో వారణాసి..
# రాజమౌళి రీక్రియేట్



మహేష్‌బాబు కథానాయకుడిగా ఎస్ఎస్ రాజమౌళి దర్శకత్వంలో రూపొందుతున్న భారీ యాక్షన్ అడ్వెంచర్ ఫిల్మ్ 'వారణాసి'. ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉన్న ఈ సినిమాకు సంబంధించిన సెట్స్, మినియేచర్స్ ఫొటోలు అలరిస్తున్నాయి. 'వారణాసి'ని హైదరాబాద్‌లో రీక్రియేట్ చేశారు. పాలిగాన్ సహా పలు హాలీవుడ్ నిర్మాణ సంస్థల ప్రతినిధులు తమ సోషల్ మీడియా ఖాతాల్లో వీటిని పంచుకోవడంతో ఈ వార్తలు వైరల్ అవుతున్నాయి. ఈసారి రాజమౌళి విజన్ తారాస్థాయిలో ఉందని కామెంట్స్ పెడుతున్నారు. ఇంకెందుకు ఆలస్యం మీరు కూడా 'వారణాసి'ని దర్శించండి.

# 'రాకాస' ట్రైలర్..

**- అంచనాలు రెట్టింపు**
**- ఏప్రిల్ 3న మూవీ గ్రాండ్ రిలీజ్**




నిహారిక.. జీ స్టూడియోస్ సమర్పణలో తన పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ బ్యానర్‌పై ఉమేష్ కుమార్ బన్సాల్‌తో కలిసి నిర్మించిన చిత్రం 'రాకాస'. మానస శర్మ తెరకెక్కించిన ఈ చిత్రంలో సంగీత్ శోభన్, నయన్ సారిక జంటగా నటించారు. ఈ సినిమా ఏప్రిల్ 3న రిలీజ్ అవుతోంది. ఇప్పటి వరకు విడుదల చేసిన టీజర్, సాంగ్స్‌తో సినిమాపై ఆసక్తి పెరిగింది. డిఫరెంట్ ప్రమోషనల్ కంటెంట్‌తో మూవీపై బజ్ క్రియేట్ అయ్యింది. ఈ క్రమంలో మేకర్స్ బుధవారం ట్రైలర్ విడుదల చేశారు.

'ఆ కోటలో ఉన్నది.. ఊరు బలి పంపుతున్నది సామాన్యుడికి కాదు.. భీకర బ్రహ్మ రాక్షసుడికి' అనే డైలాగ్‌తో 'రాకాస' ట్రైలర్ ప్రారంభమవుతుంది. దానికి అనుగుణంగా చూపించే పురాతనమైన కోట.. బ్రహ్మ రాక్షసుడు ఇవన్నీ సినిమాపై ఆసక్తిని రెట్టింపు చేస్తున్నాయి. హీరో సంగీత్ శోభన్, నయన సారికల మధ్య ఉన్న ప్రేమ.. హీరో, హీరోయిన్‌కు మధ్య ఉన్న సీన్స్‌ను చూపిస్తూ వారి మధ్య ఉన్న లవ్ యాంగిల్‌ను రివీల్ చేశారు. రాజు ఎదురోలు సినిమాటోగ్రఫీ, అనుదీప్ దేవ్ మ్యూజిక్ సినిమాకు పెద్ద ఎసెట్‌గా మారింది.

# విజయ్-రష్మిక 'వరల్డ్ టూర్' ప్లాన్

**థాయ్‌లాండ్ వెకేషన్‌లో కొత్త జంట ముచ్చట్లు**



టాలీవుడ్ క్యూట్ కపుల్ విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న ఇటీవల వివాహ బంధంతో ఒక్కటైన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఈ కొత్త జంట మధుర క్షణాలను ఆస్వాదించేందుకు థాయ్‌లాండ్‌లోని కోహ్ సముయ్ దీవికి వెళ్లారు. అక్కడ ఒక ప్రైవేట్ రిసార్ట్‌లో గడుపుతున్న ఆనంద క్షణాలను రష్మిక ఒక స్పెషల్ వీడియో రూపంలో సోషల్ మీడియాలో పంచుకున్నారు.

సొంత ఇల్లులా అనిపించింది:

"పెళ్లి వేడుకల హడావిడి తర్వాత ప్రతి క్షణాన్ని ప్రశాంతంగా ఆస్వాదించాలనుకున్నాం. నిశ్చలమైన ఉదయాలు, ఈత కొలనులో మధ్యాహ్న స్నానాలు, సాయంత్రం వేళ టేబుల్ టెన్నిస్ ఆటలు, నవ్వులు.. ఇలా కోహ్ సముయ్ దీవి మాకు ఒక సొంత ఇల్లులా అనిపించింది" అని రష్మిక తన పోస్ట్‌లో పేర్కొన్నారు.

ఈ వీడియోలో విజయ్, రష్మిక మధ్య జరిగిన సంభాషణ అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటోంది.

రష్మిక: "నిన్ను 'నా భర్త' అని పిలవడానికి ఇంకా అలవాటు పడుతున్నాను..!"

విజయ్: "నువ్వు ఎప్పటికీ నా ప్రియమైన స్నేహితురాలివే.. ఆ స్థానం మారదు."

ఇదే క్రమంలో విజయ్ దేవరకొండ.. "రాబోయే ఐదేళ్లలో నువ్వు ఏం చేయాలనుకుంటున్నావు?" అని ప్రశ్నించగా.. "ప్రపంచాన్ని చుట్టి రావాలి.. ఇలాంటి అందమైన ప్రదేశాలన్నింటినీ చూడాలి" అని రష్మిక తన కోరికను బయటపెట్టారు. దానికి విజయ్ వెంటనే స్పందిస్తూ.. "కచ్చితంగా చేద్దాం! తను ప్రతి రోజునూ అద్భుతంగా మార్చేస్తోంది" అంటూ ప్రేమగా సమాధానమిచ్చారు. ప్రస్తుతం వీరిద్దరి విహారయాత్రకు సంబంధించిన వీడియో నెట్టింట తెగ వైరల్ అవుతోంది. అభిమానులు ఈ కొత్త జంటకు శుభాకాంక్షలు తెలుపుతున్నారు.